అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 26-2-2023
www.navatelangana.com
సంపుటి : 9 సంచిక : 56 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



రాజకీయాలకు సోనియా గుడ్ బై?

భారత్ జోడో యాత్రతో నా ఇన్నింగ్స్ ముగిసిందని వ్యాఖ్య ● 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపు

మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలకు వ్యతిరేకంగా బీజేపీ పనిచేస్తున్నది. రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నది. కాంగ్రెస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదు.అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, న్యాయం కోసం పోరాడుతుంది. - సోనియా గాంధీ.

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ శనివారం రాయ్‌పూర్ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ ప్లీనరీ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. భారత్ జోడో యాత్ర పార్టీకి కీలక మలుపు..అని చెప్పారు. తన పొలిటికల్ ఇన్నింగ్స్ భారత్ జోడో యాత్రతో ముగిసిందని చెప్పారు. భారత ప్రజలు సామరస్యం, సహనం, సమానత్వాన్ని కోరుకుంటున్నారని యాత్ర నిరూపించిందని తెలిపారు. జోడో యాత్ర పార్టీ, ప్రజల మధ్య సంబంధాలను పునరుద్ధరించిదన్నారు. కాంగ్రెస్ ప్రజలతో నిలబడి, వారి కోసం పోరాడటానికి సిద్ధంగా ఉందన్న సంగతి చూపించిందన్నారు. జోడో యాత్ర కోసం ...2లో



హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి
విజయకేతనం
అన్ని స్థానాలూ కైవసం

- అధ్యక్షులుగా ప్రజ్వల్, ప్రధాన కార్యదర్శిగా కృప మరియజార్జ్
- అంబరాన్నంటిన విద్యార్థుల సంబురాలు
- ఏబీవీపీకి భంగపాటు

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం(హెచ్‌సీయూ) విద్యార్థి సంఘ ఎన్నికల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కూటమి విజయకేతనం ఎగురవేసింది. అన్ని స్థానాలనూ కైవసం చేసుకుని విజ యదుందుభి మోగించింది. హెచ్‌సీయూ ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జెండా రెపరెపలాడింది. విద్యార్థులు అంబరాన్నంటేలా సంబురాల్లో మునిగిపోయారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
'ఇంక్విలాబ్ జిందాబాద్, ఎస్ఎఫ్ఐ జిందాబాద్, ఏబీవీపీ ముర్దాబాద్'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. డప్పులు వాయిస్తూ, నినాదాలు చేస్తూ, గెలిచిన అభ్యర్థులకు పూలదండలు వేసి వారిని ఎత్తుకుని క్యాంపస్ అంతా తిరిగి గెలుపు ఆనందాన్ని పంచుకున్నారు. మొత్తం 5,133 ఓట్లలో 3,925 మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెచ్‌సీయూ నూతన అధ్యక్షులు ప్రజ్వల్, ఉపాధ్యక్షులుగా పృథ్విసాయి, ప్రధాన కార్యదర్శిగా కృప మరియజార్జ్, జాయింట్ సెక్రెటరీగా కత్తి గణేష్, కల్చరల్ సెక్రెటరీగా లిఖిత్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీగా సిహెచ్ జయరాజు, ఐసీసీ జీఎస్ క్యాష్ (ఇంటిగ్రేటెడ్) షిఫా మింజ్, ఐసీసీ జీఎస్ క్యాష్ (పీజీ)కి హృతిక్ లక్ష్మణ్ లలన్, ఐసీసీ జీఎస్ క్యాష్ (రీసెర్చ్)కు ఎస్ఎస్ సుభాషిణీ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఏబీవీపీ కనీసం పోటీ ఇవ్వలేక చతికిలపడిపోయింది. మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ఫలితాలు వచ్చినప్పటి నుంచే ఎస్ఎఫ్ఐ కూటమి ఆధిక్యాన్ని ...2లో

ఆర్‌ఎస్‌ఎస్ చేతికి
ప్రసార భారతి
ఆర్ఎస్ఎస్‌కు చెందిన 'హిందుస్తాన్ సమాచార్'కు రెండేండ్ల కాంట్రాక్ట్

ప్రసారభారతి సారథ్యంలో నడిచే దూరదర్శన్ ఛానల్స్, ఆల్ ఇండియా రేడియో..ఇకపై పూర్తిగా ఆర్ఎస్ఎస్ చేతిలోకి వెళ్లిపోయాయి. దేశంలో పేరొందిన వార్తా ఏజెన్సీ 'ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' (పీటీఐ)ను పక్కకు పెట్టి ఆర్ఎస్ఎస్‌కు చెందిన న్యూస్ ఏజెన్సీ 'హిందుస్తాన్ సమాచార్'తో ప్రసార భారతి కొద్ది రోజుల క్రితం ఒప్పందం కుదుర్చుకుంది. ఇక నుంచి దేశవ్యాప్తంగా రోజువారీ వార్తా కథనాలు, ఫొటోలు, ఇంటర్వ్యూల కోసం దూరదర్శన్ టీవీ ఛానల్స్, ఆల్ ఇండియా రేడియో 'హిందుస్తాన్ సమాచార్'పై ఆధారపడనున్నాయి. రెండేండ్ల కాలపరిమితితో కూడిన ఈ ఒప్పందం మార్చి 2025న ముగుస్తుంది. ఈ కాంట్రాక్ట్ నిమిత్తం హిందుస్తాన్ సమా చార్‌కు సుమారుగా రూ.7.7 కోట్లు చెల్లించబోతున్నట్టు ఒప్పందంలో ప్రసారభారతి పేర్కొన్నది.

- దూరదర్శన్ ఛానల్స్, ఆల్ ఇండియా రేడియోకు పీటీఐ సేవలు పూర్తిగా బంద్
- 2017 నుంచి ఏజెన్సీపై కక్షసాధింపు..ఇప్పుడు సబ్‌స్క్రిప్షన్ రద్దు..

న్యూఢిల్లీ : ప్రతిరోజూ కనీసం 100 వార్తా కథనాలు ఇవ్వాలని, దాంట్లో కనీసం 10 జాతీయ వార్తా కథనాలు, 40 స్థానిక వార్తా కథనాలు ఉండాలని ఒప్పందంలో తెలిపారు. 2017లో పీటీఐ సేవల్ని ప్రసారభారతి రద్దు చేసింది. ఆనాటి నుంచి ఇప్పటివరకూ పీటీఐ, యుఎన్ఐ న్యూస్ ఏజెన్సీల సేవల్ని పాక్షికంగా వినియోగించు కుంటోంది. ఏజెన్సీల నుంచి మోడీ సర్కార్ అనుకూల వార్తలు, ఇంటర్వ్యూలు వస్తేనే వాటిని స్వీకరించటం మొదలైంది. గతకొన్నేండ్లుగా హిందుస్తాన్ సమాచార్‌ను మెల్లమెల్లగా ప్రోత్సహిస్తూ, ఇప్పుడు పూర్తిస్థాయిలో కాంట్రాక్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు పీటీఐ సబ్‌స్క్రిప్షన్‌ను కూడా రద్దు చేసింది. ఆ రెండు న్యూస్ ఏజెన్సీలతో కొనసాగుతున్న కాంట్రాక్ట్‌లను రద్దు చేసుకోవాలని ప్రసారభారతిపై ఒత్తిడి తెస్తోంది.

అనుకూలంగా రాయలేదని..

పీటీఐతో పోల్చితే 'హిందుస్తాన్ సమాచార్' చాలా చిన్న ఏజెన్సీ. ఎంతో అనుభవమున్న రిపోర్టర్స్, ఫొటోగ్రాఫర్స్‌ను పీటీఐ దేశవ్యాప్తంగా కలిగివుంది. ఇంత పెద్ద నెట్‌వర్క్ సంస్థను కాదని చాలా పరిమితమైన వార్తా ...5లో



యువతను మోసం చేసిన మోడీ
డీవైఎఫ్ఐ మహిళా సమ్మేళనంలో బృందాకరత్

వివరాలు 5లో..



అడవుల్లో ఎదురు కాల్పులు
ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి

- ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు
- వివరాలు వెల్లడించిన బస్తర్ ఐజీ

నవతెలంగాణ-చర్ల
సరిహద్దు ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఆర్‌జీ బలగాలకు, మావోయిస్టులకు మధ్య శనివారం ఎదురు కాల్పులు జరిగాయి. ముగ్గురు జవాన్లు మృతిచెందారని, మరో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని బస్తర్ ఐజీ పి.సుందర్ లాల్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..
సుక్మా జిల్లాలోని జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 :30 గంటలకు పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు జవాన్లు చనిపోయారు. ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం సుక్మాకు తరలించి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాయపూర్ పంపించారు. జవాన్ల డీఆర్‌జీ బృందం కుందేడు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో బైక్‌పై జవాన్లు వెళ్తుండగా.. ...5లో

సానుభూతి, దయ ఉండాలి
వాటితోనే విద్యకు పరిపుష్టి

- న్యాయ పుస్తకాలే కాదు... ఇతర పుస్తకాలూ చదవాలి
- నల్సార్ విశ్వవిద్యాలయం 19వ స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై.చంద్రచూడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
సానుభూతి, దయ వంటి విలువైన లక్షణాలను అలవర్చుకోవాలనీ, వాటితోనే చదువుకున్న విద్య పరిపుష్టి అవుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై.చంద్రచూడ్ విద్యార్థులకు సూచించారు. శనివారం హైదరాబాద్ జస్టిస్ సిటీలోని నల్సార్ విశ్వవిద్యాలయం 19వ స్నాతకోత్సవం, రజతోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుభూతి విలాసవంతమైనదేమీ కాదంటూ, అది న్యాయం పొందేందుకు ఉన్న అడ్డంకులను తొలగిస్తుందని తెలిపారు. భారీ సంఖ్యలో వచ్చే వాహన ప్రమాద కేసుల విషయంలో అనేక సాంకేతిక అంశాలున్నప్పటికీ సానుభూతితోనే సుప్రీంకోర్టు వాటిని పరిష్కరిస్తుందని ఉదహరించారు. స్నాతకోత్సవ శుభ సందర్భంలో విద్యార్థులు సమాజంలోని అనేక విషయాలను తెలుసుకునేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేల ఏండ్ల సంవత్సరాల తరవాత విద్యనభ్యసించే అవకాశమొచ్చిన అట్టడుగు వర్గాల విద్యార్థుల్లో ఆత్మహత్యలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన ముంబయి, ఒడిశాలో ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు విద్యార్థుల ఉదంతాలను ఉదహరించారు. తాత్విక దృక్కోణం, దయా దృష్టితో ఉన్నత ...5లో



మట్టిలో కలిపేస్తా...

- అఖిలేష్‌నుద్దేశించి యూపీ సీఎం యోగి వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో : ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్‌పై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో అఖిలేష్‌వైపు వేలు చూపుతూ.. 'మట్టిలో కలిపేస్తాం' అని యోగి ఆదిత్యనాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఎస్పీ నేత హత్య కేసులో నిందితులను శుక్రవారం కాల్చిచంపడంపై.. ప్రతిపక్షాల విమర్శలకుగానూ అసెంబ్లీ వేదికగా శనివారం ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని అసెంబ్లీలో ప్రతిపక్షాలు యోగి ప్రభుత్వంపై విమర్శలు చేశాయి. 2005లో జరిగిన బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్యలో ప్రధాన సాక్షి అయిన ఉమేష్ పాల్, అతడి వ్యక్తిగత భద్రతా సిబ్బందిలో ఒకరిని శుక్రవారం ప్రయాగ్‌రాజ్‌లో కాల్చి చంపారు. దీనిపై విమర్శలు చేస్తున్న తరుణంలో... అఖిలేష్ యాదవ్‌వైపు యోగి వేలు చూపుతూ.. ...5లో



వివరాలు 5లో..

టర్కీ భూకంపం ఎఫెక్ట్
కోటి యాభై లక్షల మంది నిరాశ్రయులు

స్నేహితున్ని చంపి గుండె తీసి..
దారుణంగా హత్య చేసిన యువకుడు

- ముక్కలు ముక్కలుగా శరీర భాగాలు..
- పోలీసుల ఎదుట నిందితుని లొంగుబాటు
- ఇద్దరు యువకులు ఒకే అమ్మాయిని ప్రేమించడమే కారణం..!
- ఘటన స్థలానికి డీసీపీ, ఏసీపీ ...5లో



హరిహర కృష్ణ నవీన్

క్యాష్ పిటల్ హబ్..

ఉత్తర తెలంగాణలోనే ఆస్పత్రుల హబ్‌గా ఉన్న కరీంనగర్ జిల్లా 'క్యాష్'పిటల్ హబ్‌గా మారింది. వైద్యంలో ఓనమాలు కూడా తెలియని లీడర్లు, రియల్టర్లు, బిల్డర్లు, ఫైనాన్షియర్లు, బడా వ్యాపారులు పదుల సంఖ్యలో వైద్య రంగంలోకి వచ్చారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే 260 ప్రయివేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో సుమారు వందకుపైగా ఆస్పత్రులు నాన్ డాక్టర్స్ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. విజిటింగ్ డాక్టర్లు, అర్హతలేని ఫారిన్ సర్టిఫికెట్ డాక్టర్లతో కార్పొరేట్‌ను తలదన్నేలా అద్దాల మేడల్లో వైద్య వ్యాపారాన్ని సాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి. ఆర్ఎంపీ, పీఎంపీ, ప్రయివేటు ల్యాబ్‌టెక్నీషియన్లు, అంబులెన్స్ డ్రైవర్లను ఏజెంట్లుగా మలుచుకుని.. పీఆర్‌ఓలు, మార్కెటింగ్ సిబ్బందిని నియమించుకుని 'రెఫరల్' కేసుల బిల్లుల్లో కమీషన్లు, గిఫ్టులు, ట్రిప్పులు అందిస్తున్నారు. వైద్యం వికటించి ప్రాణాలమీది కొచ్చినప్పుడు నయానో బయానో బాధితులకు కొంత ముట్టచెప్పి చేతులుదులుపుకుంటూ యథావిధిగా తమ దందా సాగిస్తున్నారు.

విస్తరిస్తున్న వైద్య వ్యాపారం

- ఓనమాలు తెలియని వారూ వైద్య రంగంలో పెట్టుబడులు
- పదుల సంఖ్యలో పెరిగిన నాన్ డాక్టర్స్ అనుమతులు
- ప్రాణం మీదకొచ్చినా అర్హత లేని వైద్యులతో హైరిక్స్ ఆపరేషన్లు
- పీఆర్‌ఓలు, మార్కెటింగ్ సిబ్బందితో వ్యాపార విస్తరణ
- 'రెఫరల్ కేసులు అందిస్తే కమీషన్లతోపాటు గిఫ్టులు, ట్రిప్పులు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి
రెండు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నగరాలు, పట్టణాలు సహా చిన్న టౌన్లు, మండల కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ పేర్లతో ప్రయివేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆ ఆస్పత్రుల్లోని బోర్డుల్లో ఉండే స్పెషలిస్టులు హాస్పిటల్‌లో కనిపించరు. వారి స్థానంలో అర్హత లేని డాక్టర్లు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. కొన్ని చోట్ల ...5లో

ఇటీవలి ఘటనలు..

- కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన చిమ్మని స్రవంతి గాల్‌బ్లాడర్ సమస్యపై జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో సర్జరీ చేయించుకుంది. ఆ సర్జరీ వికటించడంతో శనివారం పరిస్థితి విషమించి మరణించింది. సరిగ్గా నెల కిందట అల్గునూర్‌కు చెందిన నేరెళ్ల మహేష్‌కు అపెండిసైట్ ఆపరేషన్‌ను నిర్లక్ష్యంగా చేసిన ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో రెండు రోజులకే మళ్లీ సర్జరీ చేశారు. చివరకు పరిస్థితి విషమించి రోగి చనిపోయాడు.
- మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ ఆరేండ్ల కిందట పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రయివేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స ద్వారా డెలివరీ చేయించుకుంది. ఆ సమయంలో సదరు వైద్యురాలు కడుపులోనే కత్తెర మరిచిపోయింది. తరచూ కడుపునొప్పి వస్తుండటంతో శనివారం స్కానింగ్ చేయించుకుంటే కడుపులో కత్తెర ఉన్నట్టు గుర్తించారు. ఇదే విషయమై సదరు ఆస్పత్రి వైద్యురాలిని నిలదీయగా, ఆ మహిళ కడుపులో కత్తెరను తొలగించేందుకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తానని హామీ ఇచ్చి హైదరాబాద్‌కు తరలించారు.



సహకార ఉద్యమ నేత ఎఎల్‌మల్లయ్య మృతి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, చెరుపల్లి సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక సహకార ఉద్యమ నేత, కొండ లక్ష్మణ్ బాపూజీ సహచరులు ఎఎల్ మల్లయ్య (85) శనివారం మధ్యాహ్నం హైదరాబాదులో గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మరణం బాధాకరమంటూ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. చేతి వృత్తిదారులందరూ సమాజంలో అభివృద్ధి చెందాలంటే సహకార రంగం ఎంతో ఉపయోగమనీ, దాని నిర్మాణానికి కృషి చేసిన వారిలో మల్లయ్య ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. జీవితకాలమంతా గంగపుత్రుల అభివృద్ధికి మత్స్యకారుల చైతన్యానికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. వారి మరణం అణగారిన సామాజిక వర్గాలకు తీరని లోటని చెప్పారు. మల్లయ్యకు నివాళులర్పించినవారిలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎంఎస్ శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ నగర మత్స్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొప్పు పద్మ, మూఠా విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

మల్లయ్య మృతికి రేవంత్‌రెడ్డి సంతాపం

తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ ఎల్ మల్లయ్య మరణం పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. మల్లయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ నేతలు మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్, ఫిషర్మెన్ విభాగం రాష్ట్ర చైర్మెన్ మెట్టుసాయికుమార్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

మార్చి 10న డాక్ అదాలత్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోస్టల్ సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారం, ఫిర్యాదులు, సలహాల స్వీకరణ కోసం మార్చి 10వ తేదీ వర్చువల్ మోడ్ (ఆన్‌లైన్)లో డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సర్కిల్ పోస్టల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ కే జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు మేటర్లు, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను స్వీకరించబోమని తేల్చిచెప్పారు. ఈ అదాలత్‌లో పాల్గొనదలచినవారు మార్చి 3 లోపు పోస్టాఫీసుల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రాజకీయాలకు సోనియా గుడ్ బై?

(మొదటిపేజీ తరువాయి)

కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు ముఖ్యంగా రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సమయం దేశానికి, కాంగ్రెస్‌కు చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలన ప్రతీ సంస్థను అణచివేసి, స్వాధీనం చేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమానత్వం కోసం కాంగ్రెస్..

కొంతమంది ఆర్థికవేత్తలకు అనుకూలంగా ఉండటం ద్వారా ఆర్థిక నాశనానికి కారణం అయ్యారని ఆరోపించారు. తోటి భారతీయులపై విద్వేష మంటలు వ్యాపింపచేస్తున్నారని విమర్శించారు. మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలకు వ్యతిరేకంగా బీజేపీ పనిచేస్తున్నదనీ, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నదని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని.. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, న్యాయం కోసం పోరాడతామని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన సమయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఓడించే లక్ష్యాన్ని సాధించాలని శ్రీమతి గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. చత్తీస్‌గఢ్‌లో రాయపూర్ వేదికగా పార్టీ 85వ ప్లీనరీ సెషన్స్ జరుగుతున్నాయి. 2024 ఎన్నికల ముందు పార్టీ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

మత వివక్షకు వ్యతిరేకంగా చట్టాన్ని తెస్తాం : కాంగ్రెస్

దేశంలో ద్వేషపూరిత నేరాల ముప్పును పరిష్కరించడానికి, చట్టాన్ని ప్రతిపాదిస్తామని కాంగ్రెస్ తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశం జరుగుతున్నది. కొన్ని షరతులతో కూడిన ప్రతిపాదిత చట్టం 2024 సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చనుంది కాంగ్రెస్. రాజకీయ తీర్మానంలో మొత్తం 56 అంశాలు ఉంటాయని పార్టీ సీనియర్ సభ్యుడు ఒకరు తెలిపారు. కాంగ్రెస్ రాజకీయ తీర్మానంలో వస్తు, సేవల సరఫరాలో మతం, కులం, లింగం, భాష ఆధారంగా వివక్షను నిషేధించే లక్ష్యంతో వివక్ష నిరోధక చట్టాన్ని కూడా ప్రతిపాదిస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ తీర్మానం పొత్తుపై పార్టీ వైఖరి కూడా త్వరలోనే చక్కబడు తుందని, భావసారూప్యత గల పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు ఉంటాయని మరో పార్టీ సభ్యుడు తెలిపారు. పాలకవర్గం న్యాయవ్యవస్థపై తీసుకు వస్తున్న ఒత్తిడిని కూడా చర్చిస్తామ న్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతత్వంలో 85వ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశం శుక్రవారం రాయ్‌పూర్‌లో ప్రారంభమైంది. కాంగ్రెస్ 2024 జాతీయ ఎన్నికల ప్రచారానికి ప్రణాళిక రెడీ చేస్తుంది.

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి విజయకేతనం

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శించింది. అన్ని రౌండ్లలోనూ ముందంజలో ఉన్నది. అందుకే అన్ని స్థానాల్లోనూ ఎస్ఎఫ్ఐ-ఏఎస్ఏ-డీఎస్‌యూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అధ్యక్షులుగా పోటీ చేసిన వారిలో ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి ప్రజ్వల్‌కు 1,838 ఓట్లు, ఏబీవీపీ కూటమి అభ్యర్థికి 1,250 ఓట్లొచ్చాయి. 588 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఉపాధ్యక్ష పదవికి ఎస్ఎఫ్ఐ కూటమి నుంచి పృథ్విసాయికి 1,861 ఓట్లు వేశారు. ఏబీవీపీ కూటమి అభ్యర్థికి 1,163 ఓట్లు వచ్చాయి. 708 ఓట్ల తేడాతో పృథ్వి సాయి విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు పోటీ చేసిన ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి కృప మరియ జార్జ్‌కు 2,076 ఓట్లు పడ్డాయి. ఏబీవీపీ కూటమి అభ్యర్థికి 1,185 ఓట్లు వచ్చాయి. కృప మరియ జార్జ్ 892 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. స్పోర్ట్స్ సెక్రెటరీగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి సిహెచ్ జయరాజుకు 1,544 ఓట్లొచ్చాయి. ఏబీవీపీ కూటమి అభ్యర్థి 1,377 ఓట్లు సంపాదించారు. 177 ఓట్ల తేడాతో జయ రాజు గెలిచారు. జాయింట్ సెక్రెటరీ పోస్టుకు ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి కత్తి గణేష్‌కు 1,578 ఓట్లు వచ్చాయి. ఏబీవీపీ కూటమి అభ్యర్థికి 1,011 ఓట్లు పడ్డాయి. 567 ఓట్ల తేడాతో గణేష్ విజయం సాధించారు. కల్చరల్ సెక్రెటరీ పోస్టుకు ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి లిఖిత్ కుమార్‌కు 1,789 ఓట్లు పడ్డాయి. ఏబీవీపీ కూటమి అభ్యర్థి 1,318 ఓట్లు పొందారు. 471 ఓట్ల తేడాతో లిఖిత్ కుమార్ గెలుపొందారు. ఐసీసీ జీఎస్ క్యాష్ (ఇంటి గ్రేటెడ్) పోస్టుకు 126 ఓట్లతో షిఫా మింజ్, ఐసీసీ జీఎస్ క్యాష్ (రీసెర్చ్) పోస్టుకు 213 ఓట్లతో ఎస్ఎస్ సుభాషిణీ, ఐసీసీ జీఎస్ క్యాష్ (పీజీ) పోస్టుకు హృతిక్ లక్ష్మణ్ లలన్ విజయం సాధించారు. హెచ్‌సీయూ విద్యార్థి సంఘ ఎన్ని కల్లో రెండోసారి వరుసగా ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించడం గమనార్హం. ఈ ఎన్నికల్లో గెలిచిన వారికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు అభినందనలు తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘ ఎన్నికల ఫలితాలు

- అధ్యక్షులు : ప్రజ్వల్
- ఉపాధ్యక్షులు : పృథ్వి సాయి
- ప్రధాన కార్యదర్శి : కృప మరియ జార్జ్
- జాయింట్ సెక్రెటరీ : కత్తి గణేష్
- కల్చరల్ సెక్రెటరీ : లిఖిత్‌కుమార్
- స్పోర్ట్స్ సెక్రెటరీ : సిహెచ్ జయరాజు
- ఐసీసీ జీఎస్ క్యాష్ (ఇంటిగ్రేటెడ్) : షిఫా మింజ్
- ఐసీసీ జీఎస్ క్యాష్ (పీజీ) : హృతిక్ లక్ష్మణ్
- ఐసీసీ జీఎస్ క్యాష్ (రీసెర్చ్) : ఎస్ఎస్ సుభాషిణీ

సాహిత్య సమ్మోహన 'ధార'



'అనంతోజు' అధ్యయనం భేష్

- 'ధార' పుస్తకావిష్కరణలో వక్తలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సాహిత్యరంగంలో అనంతోజు మోహనకృష్ణ రచనలు 'ధార'గా మొదలై, సముద్రంగా విస్తరించి, సమాజ చైతన్య గమనానికి దిశానిర్దేశనం చేయాలని పలువురు వక్తలు అభిలషించారు. ఆయనకు సార్వజనీన వ్యాసరచనా స్వభావాన్ని మార్క్సిస్టు సిద్ధాంతమే తెచ్చిపెట్టిందని అభిప్రాయ పడ్డారు. అనంతోజు మోహనకృష్ణ రచించిన 'ధార' సాహిత్య వ్యాసాల పుస్తకావిష్కరణ సభ శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగింది. తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు రాంపల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమా నికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరై, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకానికి 'ధార' అనే పేరును నామౌచిత్యంగా పెట్టారనీ, దానిలోని 15 వ్యాసాలు సార్వజనీన సాహిత్యంగా నిలిచేవని అన్నారు. అనేకమంది సాహిత్య నిష్ణాతులకు కూడా తెలియని అంశాలను మోహన కృష్ణ తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చారని అభినందించారు. యువతరం సమాజం గురించి ఆలోచించి, ప్రేరేపింపబడితే ఇలాంటి అద్భుత రచనలు వస్తాయని చెప్పారు. పుస్తక పరిచయం చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ సాహిత్య గమనాన్ని గుర్తెరిగి, మరుగున పడిన చరిత్రను వ్యాసరూపంలో అక్షరబద్ధీకరించడం గొప్ప విషయం అని అన్నారు. కవులు, కథకులతో పాటు వ్యాసకర్తలకూ పరిశోధనా దృక్పథం ఉంటుందనీ, దానికి సామ్యవాద మానవతావాదాన్ని జోడించి రచనలు చేస్తే చరిత్రలో చిరస్థాయిగా మిగిలి పోతాయన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ మోహన కృష్ణ రచనల్లో మార్క్సిస్టు సిద్ధాంతం తెచ్చిపెట్టిన ప్రామాణికత, నిబద్ధత కనిపిస్తు న్నాయని చెప్పారు. సమాజంలో చైతన్యాన్ని నింపే ఇరుసు లాంటి వ్యాసాలను ఆయన రాసారని అభినందించారు. ప్రముఖ రచయిత్రి జ్వలిత మాట్లాడుతూ సమాజానికి కావల్సిన ప్రయోజనాలను ఈ పుస్తకం ద్వారా వెల్లడించారనీ, ఇది విద్యార్థులకు పరిశోధనార్థంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ ప్రతిభకంటే సంస్కారం గొప్పదనీ, భాషా విస్తృతికి అదే తొలి మెట్టు అని చెప్పారు. పాత తరం స్ఫూర్తిపొందే పద్ధతిలో నేటి యువతరం రచనలు చేస్తున్నదని కొనియాడారు. నవతెలంగాణ సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ సాహిత్యం ప్రజల పక్షాన నిలవాలని ఆకాంక్షించారు. మార్క్సిజమే మోహన కృష్ణ రచనలను ప్రేర ణగా నిలుస్తుందన్నారు. అదానీల కోసం పాకులాడటమో... వారేదో చేస్తారని బెదిరిపోయేతత్వం మార్క్సిజానికి లేదని స్పష్టంచేశారు.

తెలం గాణ సాహితి ప్రధాన కార్యదర్శి కే ఆనందా చారి మాట్లాడుతూ పత్రికారంగం సాహిత్య కారులకు అద్భుత వేదిక అని చెప్పారు. ప్రజాపక్షాన నిలిచే ఉద్యమాల స్ఫూర్తి నుంచి వచ్చే అక్షరాలే చరిత్రగా నిలుస్తాయని తేల్చిచెప్పారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ బీ జయరావు, బోడేపూడి విజ్ఞాన కేంద్రం పూర్వ జనరల్ మేనేజర్ సీహెచ్ రాజారావు రచయిత మోహనకృష్ణకు శుభాశీస్సులు అంద చేశారు. కార్యక్రమాన్ని పేర్ల రాము సమన్వయం చేశారు.

హెచ్‌సీయూలో రణరంగం

ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీఈపీ కార్యకర్తల దాడి

- పలువురికి గాయాలు



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రణరంగంగా మారింది. శుక్రవారం విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగ్గా.. అదే రోజు అర్ధరాత్రి ఏబీవీపీ నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడికి దిగారు. ఈ ఘటనలో ఎస్ఎఫ్ఐ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రి కి తరలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు శివ దుర్గారావు మాట్లాడుతూ.. ఏబీవీపీ నాయకులు తమపై క్రూరంగా దాడి చేశారని, ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఎఫ్ హాస్టల్ లోపలికి చొరబడి దాడికి తెగబడ్డారని విమర్శించారు. మద్యం మత్తులో ఏబీవీపీ విద్యార్థి సంఘం సభ్యులు తమను దుర్భాషలాడుతూ గొడవకు దిగారని, హాస్టల్‌పై దాడి చేసి అద్దాలు పగులగొట్టారని తెలిపారు. హాస్టల్ ముందు పడి ఉన్న పదునైన గాజు ముక్కలు, సైకిళ్లతో తమపై దాడి చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి భయంతో ఏబీవీపీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, హింసను ఆశ్రయిస్తోందని ఆరోపించారు. దాడులకు వ్యతిరేకంగా విద్యార్థి లోకమంతా ఐక్యంగా నిలబడాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రశాంత వాతావరణంలో జరిగేవని, నేడు ఏబీవీపీ నాయకులు ఈ రకమైన భౌతిక దాడులకు పూను కోవడం దారుణమన్నా రు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాల న్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పిస్తూ ఎన్నికల్లో తమ పానెల్ పోటీ చేసిందని తెలిపారు.

ఈ విషయాన్ని జీర్ణించుకోలేని ఏబీవీపీ నాయకులు తమపై అకారణంగా దాడి చేశారని తెలిపారు. ఇలాంటి భౌతికదాడులకు యూనివర్సిటీ విద్యార్థులు ఎప్పటికీ అవకాశం ఇవ్వొద్దని కోరారు. ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

ఏబీవీపీ దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

- ఎస్వీకే వద్ద దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, నాయకులపై ఏబీవీపీ నాయకులు దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) వద్ద ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ హెచ్‌సీయూలో విద్యార్థి సంఘ ఎన్నికలు శుక్రవారం జరిగాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్యానెల్ ఎన్నికల పోస్టర్లను ఏబీవీపీకి చెందిన రాజేందర్ నాయక్, ఆకాశ్ బాటి, సిద్ధం శుక్లా అనే విద్యార్థులు చింపివేశారని తెలిపారు. ఈ పోస్టర్లను చింపొద్దంటూ వారించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఆకాశ్‌ను మద్యం మత్తులో విచక్షణా రహితంగా ఏబీవీపీ నాయకులు దాడి చేశారని విమర్శించారు. వారే కర్రలు, రాళ్లతో యూనివర్సిటీ హాస్టల్ కిటికీ అద్దాలను ధ్వంసం చేశారని అన్నారు. వారికి వారే అద్దాలను బద్దలు కొట్టుకుని గాయాలు చేసుకుని ఎస్ఎఫ్ఐ దాడి చేసిందంటూ ప్రకటించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. కరోనా సమయంలో విద్యార్థులకు హాస్టళ్లు ఇవ్వాలనీ, యూనివర్సిటీలో ఉన్న హాస్టళ్లు, డిపార్ట్‌మెంట్ సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడిందని గుర్తు చేశారు. అదే రోజు ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై దాడికి ప్రయత్నం చేశారని చెప్పారు. మళ్లీ ఎన్నికల ముందు ఈ చర్యకు పాల్పడ్డారని అన్నారు. యూనివర్సిటీలో శాంతియుతంగా ఉన్న వాతావరణాన్ని ఏబీవీపీ ఉద్రిక్తంగా మార్చుతున్నదని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో విద్యార్థులపై ఏబీవీపీ దాడికి పాల్పడిందన్నారు. హెచ్‌సీయూలోనే కాకుండా గతంలో ఢిల్లీ జెఎన్‌యూలో, ఎఎంయూలో కూడా కర్రలు, కత్తులతో దాడి చేశారని గుర్తు చేశారు. ఈ దాడిని విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె అశోక్ రెడ్డి, నాయకులు రమేష్, అజయ్, వాసు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ గూండాలను కఠినంగా శిక్షించాలి : ఏఐఎస్ఎఫ్

హెచ్‌సీయూలో వామపక్ష విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేసిన ఏబీవీపీ గూండాలను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘం కూటమి ఎన్నికల్లో గెలుస్తుందనీ, దీన్ని ఓర్వలేక ఏబీవీపీ గూండాలు కర్రలతో దాడి చేసి అరాచకాన్ని సృష్టించారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ విద్యార్థి సంఘం కాదనీ, గూండాల సంఘంగా మారిందని విమర్శించారు. తెలంగాణ విద్యార్థి లోకం ఆ సంఘాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దాడి చేసిన వారిని వర్సిటీ నుంచి సస్పెండ్ చేయాలనీ, పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ బోర్డుపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్

హైదరాబాద్ :ఇంటర్ బోర్డ్‌పైనా, అధికారులపైనా కొందరు వ్యక్తులు స్వార్థంతో చేసే అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్) తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం కన్వీనర్లు మాచర్ల రామకృష్ణగౌడ్, కొప్పిశెట్టి సురేష్, సమన్వయకర్త మైలారం జంగయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ విద్యావ్యవస్థను నాశనం చేసేందుకు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 2019లో అనుభవం ఉన్న వ్యక్తులు పరీక్షలు నిర్వహించినా అవకతవకలు జరగడంతో 27 మంది, 2021లో అవసరం లేని సమయంలో పరీక్షలు నిర్వహించడంతో ఆరుగురు విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. ఆ చావులకు కారణమైన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

చదువు చెప్పని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు కొన్ని మీడియా సంస్థలకు తప్పుడు సమాచారం పంపుతూ అనుభవం లేని వ్యక్తులు ఇంటర్ బోర్డు లో తిష్ట వేశారంటూ బదనాం చేస్తు న్నారని తెలిపారు. అలాంటి వారు ఎవరున్నారో ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) డైరీని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సమగ్ర సమాచారంతో రూపొందించిన ఈ డైరీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. సీపీఎస్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పాత పెన్షన్ పద్ధతిలో కుటుంబ పెన్షన్‌ను మంజూరు చేశారని గుర్తు చేశారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మ్యాన పవన్, దర్శం గౌడ్, ఉపేందర్, మల్లికార్జున్, దేవయ్య, నరేందర్‌రావు, కోటకొండ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఇటీవల ఫ్యామిలీ పెన్షన్ ఆర్డర్స్ వచ్చిన సందర్భంగా ఇద్దరు పెన్షనర్లకు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ చేతుల మీదుగా వాటిని అందించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు కొత్త ఆవిష్కరణ

- యంత్రాన్ని తయారు చేసిన యువ ఇంజినీర్



హైదరాబాద్ : ఆధునిక కాలంలో వ్యర్థాల తరలింపు ఒక ప్రధాన సమస్యగా మారింది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లు ఎక్కడ చూసినా ఖాళీ మంచినీళ్ల బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. వీటి సేకరణ, తరలింపు భారమైన నేపథ్యంలో ఒక యువ ఇంజినీర్ కంచాడపు శ్రీనివాస్ రావు సరికొత్త ఆవిష్కరణ చేశారు. 12 ఓల్టుల విద్యుత్ వినియోగించి వేడెక్కిన స్ట్రింగ్ సహాయంతో ఏవైనా ప్లాస్టిక్ వస్తువులను కత్తిరించవచ్చు అలాగే ఖాళీని తగ్గించవచ్చు. ఈ సూత్రం ఆధారంగా స్థలాన్ని తగ్గించడమే లక్ష్యంగా చేసుకొని ఈ యంత్రాన్ని తయారు చేశారు.రవాణా చేయడమూ సులభంగా ఉంటుందని చెప్పారు. దీనిని మరింత అభివృద్ధి చేస్తూనే మాన్యువల్ యంత్రాలు తయారు చేయడం కూడా తమ లక్ష్యంగా పెట్టుకున్నామని యువ ఇంజినీర్ అన్నారు. వీటిని తక్కువ ధరకే విక్రయిస్తామనీ, ఎక్కువ యంత్రాలు తయారు చేసి విస్తృతంగా మార్కెట్ చేస్తామని తెలిపారు.

నేటి నుంచి ఇంటింటికి టీడీపీ

చంద్రబాబు రాక



నవతెలంగాణ -హైదరాబాద్

తెలంగాణలో తెలుగుదేశానికి పూర్వవైభవం సాధించేందుకు యువత, మహిళలు, విద్యావంతులకు పెద్దపీట వేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఉదయం 10 గంటలకు తెలుగుదేశం అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లోని తన నివాసంలో మీడియాతో కాసాని చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రంలో పదిరోజులపాటు మండలం యూనిట్‌గా ప్రతిబూత్‌స్థాయిలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. అన్ని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో డివిజన్లవారీగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకుంటూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా చేపడతామని ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్ని డివిజన్లలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా నాడు ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. కిలో రూ. 2 బియ్యం పథకం, పట్వారీ, పటేల్ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తిహక్కు, బీసీ తరగతులకు పెద్దపీట తదిత అంశాలు వివరించడంతోపాటు టీడీపీకి పూర్వ వైభవం కోసం సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు.

మిషన్ కాకతీయ అధ్యయనానికి పంజాబ్ బృందం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ ఈనెల 16న మాన్ కొండపవచ్చమ్మ సాగర్, సిద్దిపేట జిల్లాలో మిషన్ కాకతీయ చెరువులు, చెక్ డ్యాంలను సందర్శించిన సంగతి తెలిసిందే. అనంతరం పంజాబ్ తిరిగి వెళ్ళిన తర్వాత పంజాబ్ వ్యవసాయ విశ్వ విద్యాలయ అధికారులను పిలచి తెలంగాణలో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని , దాని వలన రాష్ట్రంలో భూగర్భ జలాల అభివద్ధి ఎట్లా జరిగిందో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆమేరకు ముగ్గురు సభ్యుల బందం ఈ నెల 28న రాష్ట్రానికి రానుంది. వారంతా మార్చి ఒకటి, రెండు తేదీల్లో తెలంగాణలో మిషన్ కాకతీయ చెరువులు, చెక్ డ్యాంలు, భూగర్భ జలాల రీచార్జింగ్ ఏర్పాట్లను పరిశీలించనున్నారు. సాగునీటి శాఖ, భూగర్భ జల శాఖ వారి అధ్యయనానికి అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి చూపించాల్సిన చెరువులు, చెక్ డ్యాంలను ఎంపిక చేసే పనిలో ఉన్నారు. సోమవారం నాటికి రెండు లేదా మూడు జిల్లాల్లో పర్యటన షెడ్యూల్ ఖరారు అవుతుందని ఇంజనీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయమని గజ్వేల్ ఇంజినీర్ ఇన్ చీఫ్ హరిరాం, భూగర్భ జల శాఖ సంచాలకుడు పండిత్ మధూరేను ఆదేశించినట్టు చెప్పారు.

ఆయకట్టు స్థిరీకరణ లేకుండా

నిర్మాణాలెందుకు?

అవసరమున్న చోట ప్రాజెక్టులు నిర్మించాలి

- దక్షిణ తెలంగాణ లక్షల ఎకరాలకు నీరు లేదు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఆయకట్టు స్థిరీకరణ చేయకుండా.. వేలాది ఎకరాలను ముంపుకు గురిచేసి రైతులను నిర్వాసితులను చేసి ప్రాజెక్టులు ఎందుకు నిర్మాణం చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలో నిర్మిస్తున్న చిన్నోనిబాయి రిజర్వాయర్ పనులను నిలిపేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న నిర్వాసితులకు శనివారం ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తమ్మినేని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సాగునీటి కోసమే చేశారని గుర్తు చేశారు. కానీ, సాగునీటి అవసరం లేకుండా భూములు కోల్పోయేలా ప్రాజెక్టులు నిర్మించడం సరికాదన్నారు. ఏ ప్రాంతంలో సాగునీరు అవసరం ఉందో జిల్లాల వారీగా సర్వే చేసి ప్రాజెక్టులు నిర్మించాలి తప్ప చిన్నోనిపల్లి లాంటి ఆయకట్టు లేని ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించడం అవివేకమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దానినే మోడల్‌గా చూపించడం సరికాదన్నారు. దక్షిణ తెలంగాణలో లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వకుండా బంగారు తెలంగాణ ఎలా సాధ్యమన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలు లోపభూయిష్టంగా ఉన్నాయని చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టుల వల్ల రైతుల్లో ఆనందం వెల్లివిరియల్సిందిపోయి అడ్డుకునే స్థాయికి వచ్చారంటే పాలకుల ముందు చూపు ఏంటో తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులను పరిశీలిస్తే భూములకు సాగునీరు ఇవ్వడం కంటే కాంట్రాక్టర్లకు డబ్బులు ముట్టజెప్పడమే ప్రధాన ధ్యేయంగా కనిపిస్తుందన్నారు. రిజర్వాయర్ల ద్వారా సాగు భూములు తడపాల్సింది పోయి రైతులను నిర్వాసితులను చేసి వారకి కన్నీళ్లు తెప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిమిత సమయంలో భూములను ఉపయోగంలోకి తీసుకురాకపోతే స్వాధీనం చేసుకున్న వాటిని తిరిగి రైతులకు ఇచ్చేయాలని చెప్పారు. ఆ చట్ట ప్రకారం 17 సంవత్సరాలు దాటినా వాడుకోని భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షలాది ఎకరాల భూములను సాగునీటి ప్రాజెక్టుల పేరుతో తీసుకొని మార్కెట్ ధర కన్నా తక్కువగా పరిహారం చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతులు ఉద్యమాలు చేసినందువల్ల ఎకరాకు 60 లక్షలు పరిహారం ఇచ్చిన విషయం గుర్తు చేశారు. రైతులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) గద్వాల జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, ఉద్యమ కన్వీనర్ నరేష్, నాయకులు నరసింహ, నర్మద, దేవదాన్, పరంజ్యోతి, ఆంజనేయులు, మారన్న, సవారన్న మద్దిలేటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ స్వశక్తితో ఎదుగుతున్న దేశం

టీయూలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

'భారత్.. అత్యంత వేగవంతంగా అభ్యున్నతి చెందుతున్న దేశం. స్వయం శక్తితో ఎదుగుతున్నది. 20 దేశాలకు నాయకత్వం వహిస్తున్న సందర్భంలో గర్వంగా ఉంది. మన కలను సాకారం చేసుకొనే దిశగా పయణించాలి' అని రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ అన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో శనివారం "ఇండియాస్' జి 20 ప్రెసిడెన్సీ: ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్ ఫర్ ఇండియా యాస్ ది గ్లోబల్ లీడర్" అంశంపై నిర్వహించిన సదస్సులో గవర్నర్ పాల్గొన్నారు మొదట ఉపకులపతి ఆచార్య డి.రవీందర్ గవర్నర్‌కు స్వాగతం పలికారు. 7వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది 'గార్డ్ ఆఫ్ ఆనర్' (గౌరవ వందనం) చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. భారతదేశం జీ-20 దేశాల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గ్రూప్ ఆఫ్ నేషన్స్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)- న్యూఢిల్లీ, దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలను విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఇప్పుడు భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందన్నారు. 85 శాతం అంతర్జాతీయ స్టార్టప్ కంపెనీలు మన దేశ సహకారం కోసం ఎదురుచూ స్తున్నాయని చెప్పారు. కరోనా మహమ్మారిని తట్టుకొనే వాక్సినేషన్‌ను తయారుచేసి దాదాపు 150 దేశాలకు సరఫరా చేసిన ఘనత మన దేశానికి ఉందన్నారు. ఇదేగాక రుబెల్లా, పోలియో వ్యాధులకు వాక్సిన్ తయారు చేసి అతి ప్రాణాంతమైన వ్యాధులకు చికిత్స అందిస్తుందన్నారు. భారతదేశం సర్వ స్వతంత్ర దేశంగా ఎదుగుతుందన్నారు. భారతదేశ చరిత్ర అజరామరం అయిందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ దేశాలకు శాంతి, అహింస మార్గాలను చూపిందన్నారు. ఈ 2023వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "ఇంటర్నేషనల్ డే ఆఫ్ మిల్లెట్స్" అనే సంక్షిప్త సందేశంతో ముందుకు వెళ్తుందని చెప్పారు. సంపూర్ణ చిరుధాన్యాల ఆహారం మన భారతీయుల సంస్కృతి అన్నారు. భవిష్యత్తు తరాలకు పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపుపై అవగాహన పెంచాలని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులు చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. యువత ఏదైనా సాధించగలదని, అసాధారణ ప్రతిభ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య డి. రవీందర్, ఎబిఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త కార్యనిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్, రిజిస్ట్రార్ ఆచార్య బి.విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. ఆరతి, వీసీ సతీమణి సౌభాగ్యలక్ష్మి, సదస్సు డైరెక్టర్ డా.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల పైసలతో ఆటలా?

- ఎల్ఐసీ పెట్టుబడులు ఆవిరవుతుంటే మౌనం ఎందుకు?
- అదాని వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం
- ముంబయిలో ఘనంగా స్వాగతం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆదాని కుంభకోణంలో ప్రజలు పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ సంస్థ డబ్బులు ఆవిరవుతుంటే, ఎందుకు మౌనంగా ఉందని బీఆర్ఎస్ కల్వకుంట్ల కవిత కేంద్రాన్ని ప్రశ్నించారు. అదాని కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టిన పెట్టుబడుల విలువ 11 శాతం మేర పడిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ముంబాయిలో బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆమెకు ఘన స్వాగతం పలికారు.అనంతరం కవిత మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. అ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రజల డబ్బులతో ఆటలాడటం ఏంటని ప్రశ్నించారు. ఎల్ఐసీలో పెట్టుబడులు పెట్టిన మధ్య తరగతి ప్రజలకు మోడీ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు. ఇంత పెద్ద కుంభకోణం జరిగి దాదాపు రూ. 12 లక్షలకోట్లు నష్టపోయినా సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ వంటి సంస్థలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు. సంస్థలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే సంస్థలేనా? అని నిలదీశారు. హిడెన్‌బర్గ్ నివేదిక బహిర్గతమైనప్పటి నుంచి ఆదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అప్పుడే కేంద్రం జెపిసి ఏర్పాటు చేస్తే ప్రజలు మరింత నష్టపోయేవారు కాదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం కండ్లు తెరిచి మరింత నష్టం జరగకుండా చూడాలని సూచించారు.తెలంగాణలో జరుగుతున్న పనులు మహారాష్ట్రలో ఎందుకు జరగలేదని కవిత ప్రశ్నించారు. ముంబాయిలో రోజుకు రెండు గంటలే మంచినీళ్లు సరఫరా అవుతున్నాయని తెలిపారు. రానున్న కాలంలో మహారాష్ట్ర అభివృద్ధిలో తమ పార్టీ కీలక భాగస్వామి అవుతుందనీ, ఇక్కడి ప్రజల కోసం తాము పని చేస్తామని చెప్పారు. ఈ పర్యటనలో శరత్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే వంటి నాయకులను కలుస్తారా? అని విలేకరులు అడగ్గా... శరత్ పవర్‌తో కేసీఆర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనీ, ఉద్యమానికి కూడా ఆయన ఎంతగానో తోడ్పడ్డారని వివరించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్ఎంలదే 'స్నాక్స్' బాధ్యత

181 ఉన్నత బడులు.. 7671 మంది స్టూడెంట్స్

- 34 రోజులకు.. రూ.3.91కోట్లు ఖాతాల్లో జమ
- పండ్లు, ఇతర తినుబండరాల వెండర్ల కోసం వెతుకులాట



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా.. సర్కారు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా.. ఆ సమయంలో విద్యార్థులకు అందించాల్సిన స్నాక్స్ పని ప్రధానోపాధ్యాయులపై పడింది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు సార్లు స్నాక్స్ అందించేందుకు విద్యాశాఖ ఈ నెల 10వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా హైదరాబాద్ జిల్లాలో 7,671 మందికి లబ్ది చేకూరనుంది. అయితే, ఈ స్నాక్స్ మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారానే అందించాలని ఆదేశాలున్నాయి. నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మన్నా ట్రస్ట్ ద్వారా పెడుతున్నారు. అయితే, స్నాక్స్ కూడా ట్రస్ట్ ద్వారా అందించడం సాధ్యం కాదని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఆ బాధ్యతను ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకే అప్పగించారు. అధికారుల ఆదేశాల మేరకు పండ్లు, ఇతర తినుబండారాల తయారీ వెండర్ల కోసం వెతుకతులాట ప్రారంభించారు.

రెండు గంటలు ప్రత్యేక తరగతులు

విద్యార్థులు టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ఉదయం గంట, సాయంత్రం ఓ గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం వేళ స్పెషల్ క్లాసులు కొనసాగనున్నాయి. ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఉదయం, సాయంత్రం వేళ్లలో స్నాక్స్ ఇచ్చేందుకు సర్కారు నిర్ణయించింది. పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సెలవు రోజులు మినహా పాఠశాలలు పనిచేసే మొత్తం 34 రోజులపాటు స్నాక్స్ అందిస్తారు. ఒక్కో విద్యార్థికి ప్రతిరోజూ రూ.15 తినుబండారాలు అందజేస్తారు. జిల్లాలో మొత్తం 181 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా.. 7,671మంది పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. వీరికి స్నాక్స్ అందించేందుకు ప్రభుత్వం రోజుకు రూ.1,15065 చొప్పున 34 రోజులకుగాను రూ.3,91,2,210 కోట్లు కేటాయించింది. కాగా ఇప్పటికే డీఈవో ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దాతల సహకారం తీసుకొని స్నాక్స్ అందిస్తున్నారు. కాగా, ప్రభుత్వమే ఈసారి స్నాక్స్‌కు నిధులు కేటాయించడంతో విద్యార్థులందరికీ ప్రయోజనం చేకూరడంతోపాటు, ప్రధానోపాధ్యాయులు దాతల సహకారం కోరే అవసరం తప్పింది.

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోనే..

హైదరాబాద్‌లో మొత్తం 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 1,17,502 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాన్ని మన్నా ట్రస్ట్ ద్వారా అందిస్తున్నారు. సదరు ట్రస్ట్ వారు ఉదయం 6 గంటలకే అన్న, కూర, సాంబారు వంటి పదార్థాలు తయారు చేసి.. ఉదయం 11గంటల వరకు అన్ని పాఠశాలలకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపిస్తారు. అలా పంపిన భోజనాన్ని మధ్యాహ్నం ఒంటిగంటకు విద్యార్థులకు పెడుతారు. అయితే, ఉదయం 6గంటలకు తయారు చేసే తినుబండారాలు సాయంత్రంలోగా పాచిపోయే అవకాశం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడనుంది. దాంతో పది విద్యార్థులకు స్నాక్స్ అందించే బాధ్యతను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకే అప్పగించారు. సంబంధిత నిధులు కూడా ఇప్పటికే పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమచేశారు. మరోవైపు హెడ్‌మాస్టర్లు పాఠశాలకు సంబంధించిన రోజువారి పనులతోపాటు పది విద్యార్థుల ప్రిపరేషన్, ప్రత్యేక తరగతులకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ వంటి పనులతోనే భారమవుతుంటే.. ఇప్పుడు స్నాక్స్ కొనుగోలు బాధ్యత ఎలా అంటూ వాపోతున్నారు. ఇంకోవైపు పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో వేసిన నిధులు, వాటి ఖర్చులకు సంబంధించి ప్రతి బిల్లుకూ జీఎస్టీ కావాలి. ప్రతి బిల్లునూ జీఎస్టీతోపాటు అప్‌లోడ్ చేయాల్సి ఉండటం మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

ఉదయం తయారు చేసి సాయంత్రం పెట్టలేం..

ఆర్.రోహిణి- డీఈవో- హైదరాబాద్

నగరంలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మన్నా ట్రస్ట్ ద్వారా అందిస్తున్నాం. వారు ఉదయమే తయారు చేసి.. ఆ సమయంలోగా పంపిస్తారు. అలాంటప్పుడు ఉడకబెట్టిన పల్లీలు, ఇతర తినుబండారాలు వంటివి ఎప్పుడో ఉదయం చేయించి.. సాయంత్రం పెడితే.. విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉన్నది. అందుకని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకే పోషకహారాలతో కూడిన స్నాక్స్ విద్యార్థులకు అందించాలని సూచించాం. నిధులు జమ చేశాం.

సుక్మాలో ఎన్‌కౌంటర్‌తో రాష్ట్ర సరిహద్దుల్లో హైఅలర్ట్

- భారీ ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన గ్రేహౌండ్స్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులు మరణించడంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. సుక్మా జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు పోలీసులు అక్కడిక్కడే మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సలైట్ విభాగం పోలీసులు పారిపోయిన మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు సైతం ఈ సమాచారం అందించి అప్రమత్తం చేశారు. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రంలోకి మావోయిస్టులు చొరబడకుండా చూడటానికి భారీ ఎత్తున రాష్ట్ర గ్రేహౌండ్స్ దళాలు సరిహద్దులో మోహరించాయి. ముఖ్యంగా ములుగు జిల్లా సరిహద్దు నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకు సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ బలగాలే కాకుండా తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు బెటాలియన్‌కు చెందిన పలు కంపెనీల సాయుధ పోలీసులు మోహరించారు. గ్రేహౌండ్స్ బలగాలకు సహకరిస్తూ కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో సరిహద్దు జిల్లాలకు చెందిన రాష్ట్ర ఎస్పీలు సైతం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన ఆదేశాలు ఇస్తున్నారు.

పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి లేదంటే ఉద్యమం తప్పదు..

- 28న గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్ర హైదరాబాద్‌లో ముగింపు సభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలనీ, గ్రామ పంచాయితీ కార్మికులకు కూడా మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టుగానే జీవో 60 ప్రకారం వేతనాలు. పెంచాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్,అధ్యక్షులు గ్యార పాండు,ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రద్దు చేసిన పాత కేటగిరీలను పునరుద్ధరించాలని, కోరారు. జీవో51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలని పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి అప్రజాస్వామిక పద్ధతిలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 12న పాలకుర్తినుంచి ఆరుగురు రాష్ట్ర నాయకుల బృందంతో పాదయాత్ర నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈ యాత్ర 17 రోజుల్లో 350 కిలోమీటర్లు పూర్తి చేసుకొని 28న హైదరాబాద్కు చేరుకోనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర కొనసాగుతుందనీ, అక్కడ ముగింపు సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సభలో సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం సాయిబాబు, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, వివిధ యూనియన్లు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు.

తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలి

- వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనీ, అందుకే ఇక్కడ రాష్ట్ర పతిపాలన విధించాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల కోరారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. "తెలంగాణలో వాస్తవ పరిస్థితులను వివరించేందుకే గవర్నర్‌ను కలిశానని తెలిపారు. కేసీఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో భారత రాజ్యాంగం అమలులో ఉంటే తెలంగాణలో కేసీఆర్ రాజ్యాం గం అమలు అవుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నర్‌ను కోరినట్టు తెలిపారు. వీధి కుక్కలు దాడి చేసి పసి ప్రాణాలు తీస్తే పట్టించుకునే దిక్కులేదని విమర్శించారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం... నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెడికో విద్యార్థిని ప్రీతిని ఆమె పరామర్శించారు. వైఎస్. వివేకానంద రెడ్డి కేసులో సీబీఐ తన పని తాను చేయాలని కోరుతున్నామన్నారు. చట్టం తన పని తాను చేస్తుందని షర్మిల తెలిపారు.

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి : టీఏపీఆర్‌పీఏ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. టీఏపీఆర్‌పీఏ అధ్యక్షులు పాలకుర్తి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మచ్చా రంగయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం లోపభూయిష్టంగా తయారైం దని తెలిపారు. నగదు రహిత వైద్యం ఎక్కడా అమల్లో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్ పెన్షనర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.తొమ్మిది వేలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సెంట ర్లను వరంగల్, నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు సీతా రాం, అరుణ, రామ్మోహన్‌రావు, వైకుంఠం, సుజావతి, గడ్డం అశోక్ పాల్గొన్నారు.

ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చాలి

- ఆరెకుల సంక్షేమ సంఘం చైర్మెన్ కిషన్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మెన్ లింగంపల్లి కిషన్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘంలో వివిధ రాజకీయ పార్టీల వారుంటారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వం మంచి చేసినా ఆ విషయాలను అందరికీ చెప్పాల్సిన అవసరముందన్నారు. సంఘం ప్రతిష్టకు భంగం కలిగేలా అవాస్తవాలను ప్రచారం చేయడం మంచిది కాదని అన్నారు. ఆరెకుల సంఘానికి రూ.50 కోట్ల విలువ చేసే ఎకరం స్థలం, ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు ప్రకటించారు. ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా లింగంపల్లి కిషన్‌రావు తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా రెకెంధర్ చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా వరికెల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా ఏసికా శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా కృష్ణాజి, బాసోపోలు శ్రీనివాస్, జెండా అంబయ్య, కర్రోల్ల సత్యం, కంటెడి రామోజీ, రాష్ట్ర కార్యదర్శులుగా దాపాడి బాలాజీ రావు, నిట్టె బాలరాజును ఎన్నుకున్నారు.

సంపాదకీయం

"ఇస్ దేశ్ మే కాబా?"

అసలు ప్రశ్న తలెత్తటమే సహించలేని వాళ్లకు, ఆ ప్రశ్న పాట రూపమెత్తితే ఇక కంపరమెత్తదా! ఇప్పుడా జానపద గీతం దేశాన్ని మేల్కొలుపుతోంది. సామాన్య జనాన్ని, పల్లీయులను చైతన్య పరుస్తున్నది. మనం గుర్తుంచుకోవాల్సిన విషయాలేమిటో, ఆలోచించాల్సిన అంశాలేమిటో తట్టి మరీ హెచ్చరిస్తోంది. తేలికయిన జానపదుల పదాలలో రాగమై ధ్వనిస్తోంది. బీహార్‌కు చెందిన భోజ్‌పురి జానపద గాయని

కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని 'కాబా' గీతం ఎరుకపరుస్తున్నది. పశువుల కన్నా హీనంగా చూడబడుతున్న సామాన్యుల జీవిత చిత్రాలను, కష్టాలను ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఈ పాట మనకు బోధిస్తున్నది. ప్రజా పాట నెత్తుకున్న నేహాసింగ్ రాథోర్‌కు జేజేలు పలుకుతూనే నీతో మా గొంతునూ కలుపుతామని వాగ్దానం చేద్దాం!

నేహాసింగ్ రాథోడ్ పాడిన ఒక వీడియో ఇప్పుడు దేశమంతా చర్చనీయాంశంగా మారింది. ఆమె ఆ పాటలో జానపదుల శైలిని అనుకరిస్తూ ఉన్న "యూపీ మే కాబా?" అనే పల్లవితో ఉత్తరప్రదేశ్‌లో ప్రజల బాధలను, రాజకీయుల దుర్మార్గాలను, సామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా గానం చేసింది. ఇటీవల కాన్పూర్ అక్రమ ఇళ్లను కూల్చేసే సందర్భంగా తల్లీ కూతుళ్ల మరణించిన విషయంపై నేహా ఈ పాట పాడారు. ఇది వైరల్ అయింది. దీంతో ఎక్కడలేని భయాందోళనలకు గురయిన యూపీ ప్రభుత్వం ఆమెపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసింది. అయినా 'నా పాటను ఆపేదే లేదు, పాడుతూనే ఉంటాను' అని నేహా తన ఉద్దేశాన్ని ధైర్యంగా ప్రకటించింది.



పాటకంత బలముంటది. పాట, ఆనంద పరవశంలో ఓలలాడడానికే కాదు, సంతోషాల్లో సంబరాల్లో గంతులేస్తూ గొంతులెత్తే పద గుంభనమే కాదు, కపట రాజకీయుల కుటిల నీతిని వెలికితీసి, వాస్తవిక సామాజిక చిత్రాన్ని గుండెలపై ధ్వనింపజేసే కళా ఢంకాధ్వానం పాట. పాట ప్రజా కళారూపం. అందుకే ఏ ప్రజా ఉద్యమానికైనా ఖడ్గధారియై కవాతు చేస్తుంది. ఎక్కుపెట్టిన తుపాకిలా శత్రువును భయకంపితుణ్ణి చేస్తుంది. ఎందుకంటే అది సత్యాన్ని సమర్థవంతంగా జనంలోకి తీసుకు వెళ్లగలుగుతుంది గనుక. ఆనాడు భారతదేశాన్ని చెరపట్టిన బ్రిటిష్‌వాడూ పాటంటే భయపడ్డాడు. 'వందేమాతరం' అనే పల్లవికే వణికిపోయి తుపాకులు పేల్చాడు. తెలంగాణలో నిజాము, జమిందారు, భూస్వాముల గుండెల్లో బల్లెమైదిగింది పాట. ప్రజల్ని చైతన్య పరిచే గొప్ప సాధనం పాట. పాట నెత్తుకున్న గొంతుపై ఆధిపత్య కత్తులు వేలాడుతూనే ఉంటాయి. నిర్బంధాలు, అడ్డగింతలు నిత్యం ఎదురవుతూనే ఉంటాయి. అయినా పాట సాహసి. జరుగుతున్న అన్యాయాలను, దుర్మార్గాలను చూస్తూ ఉండలేదు. మీడియా గొంతువిప్పకపోవచ్చు, ఛానళ్లు మూగపోవచ్చు, ప్రతిపక్షం ప్రతిధ్వనించకపోవచ్చు... కానీ పాట తనను తాను చంపుకోదు. తన ఉనికి గొంతెత్తడమే. అవును, ఎక్కడి నుండో ఒకపాట మనల్ని మేల్కొల్పుతూనే ఉంటుంది. ఆ పాట ఇప్పుడు నేహాసింగ్ గొంతులోంచి దూసుకువచ్చింది.

'యూపీ మే కాబా?' ఆ రాష్ట్రంలో ఏముంది? ఏముందో, ఏం జరుగుతోందో ఆ పాటలో నేహా కళ్లకు కట్టారు. కరోనా కాలంలో జనులు ఎంత ఇబ్బందులు పడ్డారో, గంగలో ఎన్ని శవాలు తేలాయో, మంత్రి కొడుకు రైతుల ఛాతీమీది నుండి కార్లెలా దూకించాడో, లైంగిక దాడులు చేసిన వాళ్లు ఎలా బలదూర్ తిరుగుతున్నారో, దళితుల జీవితం ఎంత దుర్భరంగా ఉందో తెలిపే పాట అది. అందుకే ప్రభుత్వానికి ఆగ్రహమొస్తోంది. అన్నింటికన్నా మన మందరం నేహా సింగ్‌లోని ధైర్యాన్ని, నిజాయితీని చూసి స్ఫూర్తి పొందాల్సి ఉంది. నేను ఏమీ ప్రతిపక్షం కాదు, మంత్రిని కాదు, మంత్రి కుమార్తెనూ కాదు, నేనొక సామాన్య కళాకారిణిని, నేను మతం గురించి మాట్లాడలేదు. రాజకీయాలూ పాడలేదు. కేవలం ప్రజల భావాన్ని పాటగా పాడాను. ఎందుకంటే నేను 'లోక్ గాయక్ హూ' (ప్రజా గాయనిని) అని ప్రకటించింది. అంతే కాదు, "వాళ్ల నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పరు. కేవలం నోటీసులు ఇస్తారు. నేను అధికారం మీదనే పాడతాను. ఎందుకంటే, వాళ్ల మా ఓట్లు తీసుకుని అధికారంలోకి వచ్చారు. వాళ్ల మాకు చేస్తానన్నవి చేయటం లేదు. ప్రశ్నలు పాడుతూనే" ఉంటాను అని చెప్పిన తీరు నిజంగా అభినందనీయమైనది. ఒక ప్రజాగాయని ఎలా ఉండాలో ఉదాహరణగా నిలిచింది నేహా. డబ్బులు తీసుకుని నేను పాడనని, జనంవైపే ఎప్పటికీ నిలబడతానని, పాటను ఆపే ప్రసక్తే లేదని తెలిపిన ఆ కళాకారిణి మనందరికీ ఆదర్శప్రాయం. నాకు వ్యతిరేకంగా మాట్లాడాలంటే వాళ్లూ పాటలు రాయాలి, పాడాలి అని అన్న ఆమె సవాలును స్వీకరించక తప్పని ప్రభుత్వం వారు 'యూపీ మే సబ్ బా' అంటూ ఇక్కడ మందిరమున్నది, రాముడున్నాడు, మహానాయకుడు ఉన్నాడూ అని నేహా వీడియోకు ప్రతిగా పాటను రిలీజ్ చేసారు. కానీ ప్రజా పాటకు వచ్చిన ఆదరణ దానికెందుకుంటుంది?

రేపు 'కాబా!' అని ప్రశ్నించి గళమెత్తిన నేహాసింగ్‌ను అక్రమంగా నిర్బంధించవచ్చు. వాస్తవాలను వెలికి తీసిన, తీస్తున్న జర్నలిస్టులపై, రచయితలపై, మీడియాపై దాడి చేయడం, వారి భావ ప్రకటనా స్వేచ్ఛను నొక్కేయడమే రామరాజ్యమని చెప్పుకునే పాలకుల కాలంలో ఆమెకు నోటీసులివ్వడం ఆశ్చర్యపర్చదు. కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని 'కాబా' గీతం ఎరుకపరుస్తున్నది. పశువుల కన్నా హీనంగా చూడబడుతున్న సామాన్యుల జీవిత చిత్రాలను, కష్టాలను ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఈ పాట మనకు బోధిస్తున్నది. ప్రజా పాట నెత్తుకున్న నేహాసింగ్ రాథోర్‌కు జేజేలు పలుకుతూనే నీతో మా గొంతునూ కలుపుతామని వాగ్దానం చేద్దాం!

తెలుగురాష్ట్రాల్లో కమల విన్యాసాల విపత్తు



తెలకపల్లి రవి

తెలుగు రాష్ట్రాల న్యాయమైన కోర్కెలు నెరవేర్చని కేంద్ర బీజేపీ రాజకీయ వ్యూహాలు, దర్యాప్తు సంస్థల ప్రయోగాలలో మాత్రం ఎత్తులమీద ఎత్తులు వేస్తున్నది. ప్రధాన పాలక పార్టీలను ఇరకాటంలో పెట్టడమే దాని ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇప్పటికే తెలంగాణ గవర్నర్ తమిళిసై కేసీఆర్ బీఆర్ఎస్ సర్కారుతో నిత్యఘర్షణ పెట్టుకుంటుంటే ఏపీకి కూడా ఆఘమేఘాల మీద మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌ను నియమించింది. తమిళిసై తాను తమిళనాడు బీజేపీ నేతనన్న విషయం నిరంతరం గుర్తు చేస్తూనే ఉన్నారు. అంతేగాక బీజేపీనాయకులతో పోటీపడి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతున్నారు. ఏపీ గవర్నర్‌గా వచ్చిన నజీర్ గతంలో అయోధ్యతో సహా అనేక కీలక కేసుల్లో ఇచ్చిన తీర్పులు బీజేపీకి సంతోషం కలిగించిన ఫలితంగానే ఈ పదవి పొందగలిగారన్నది సర్వజన భావన. జగన్ సర్కార్‌కు చెక్ పెట్టడానికే ఆయన వచ్చాడని టీడీపీ, బీజేపీ చెబుతుంటే వైసీపీ నేతలు మాత్రం అదేమీ లేదని పైకి గంభీరంగా తోసిపుచ్చుతున్నారు. అయితే ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా పోకడలు తెలుసు గనక నిజంగా తేలిగ్గా తీసుకోవడం జరగదు. కొత్త గవర్నర్‌కు ముఖ్యమంత్రి జగన్ ఘనస్వాగత సత్కారాలు జరపగా టీడీపీ నేత చంద్రబాబు కూడా కలసి మాట్లాడారు. ఆయన రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యాన్ని దృష్టికి తెచ్చారని అనుకూల మీడియా వార్తలు. కొత్తగవర్నర్ తాను ఇంకా విషయాలు తెలుసుకోవాలని చెప్పినట్టు కూడా అవి పేర్కొన్నాయి. సుప్రీం మాజీ జడ్జిని పదవీ విరమణ తర్వాత నెలలోనే గవర్నర్‌గా నియమించిన తీరును సీపీఐ(ఎం), కాంగ్రెస్ వంటిపార్టీలు తప్పు పట్టాయి


బీజేపీ శత వ్యూహాలు

రాజ్‌భవన్ రాజకీయాలు అలావుంచితే నేరుగా బీజేపీ సంస్థాగత వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఏపీలో వెనకబడివున్నా తెలంగాణలో అధికారానికి వచ్చేస్తామని కొన్నాళ్ల కిందట బీజేపీ అగ్రనేతలు కూడా హడావుడి చేశారు. స్వయంగా మోడీ, అమిత్‌షా, అధ్యక్షుడు నడ్డాలు పర్యటించి వెళ్లారు. దక్షిణాదిలో తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని గొప్పలు పోయారు. కానీ మునుగోడు ఫలితాల తర్వాత ఇదంతా తారుమారైంది. ఇప్పుడు బీజేపీ నేతలెవరూ అధికారంలోకి రావడం గురించి ఆశలు పెట్టుకోలేదు. పదిహేను స్థానాలు తెచ్చుకుంటే ధన్యమని భావిస్తున్నారు. భారీ ఎత్తున ఇతర పార్టీలనుంచి వచ్చి చేరతారని లెక్కలు వేసింది నిజం కాలేదు. ఒక బలమైన సామాజిక వర్గాన్ని చేర్చుకోవాలనుకుంటే వారు కాంగ్రెస్‌లోనే కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లోని పద్నాలుగు మంది ప్రముఖులను ఆకర్షించాలనుకుంటే ఇంతవరకూ వారిని సంప్రదించడమే కుదరలేదట. ఆఖరుకు చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ తనే నెమ్మదైపోయారని బీజేపీ నేతలంటున్నారు. ఆపరేషన్ ఫామ్‌హౌస్ సుడిగుండం నుంచి సీబీఐ కాస్త విముక్తి కలిగించినా సమస్య మిగిలే ఉంది. మరోవైపున తమ చేతిలోని ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి రోజుకో దాడి చేయిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం పేరిట బీఆర్ఎస్ అధినేత కుమార్తె కవితతో సహా ఆరోపణలలో ఇరికించి ప్రతికూల ప్రచారం కుమ్మరిస్తున్నారు. ఇప్పుడు ఢిల్లీ ఆప్ ముఖ్యమంత్రినీ ఉప ముఖ్యమంత్రినీ కూడా చేర్చారు. ఒక సారా వ్యాపారిని అరెస్టు చేయగా అనేకమందిని విచారిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు తెలిసినా ఆరువేల కోట్ల మేరకు వివరాలు తమదగ్గర ఉన్నా చట్టబద్దంగా పట్టుకోలేం గనక ఈ కేసును తవ్వితీశామని ఈ మధ్యనే బీజేపీ నేత ఒకరన్నారు. ఇదే కేసులో ఏపీలో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడినీ, పార్లమెంటరీనేత విజయసాయిరెడ్డి అల్లుడి తమ్ముడు శరత్ చంద్రారెడ్డినీ కూడా అరెస్టు చేశారు. అడపాదడపా బీఆర్ఎస్ నేతల వ్యాపార సంస్థలపై ఆకస్మిక దాడులు జరుపుతూ ఒత్తిడి పెడుతున్నారు. ఈ కేసుల్లో పొరబాట్లే లేవనీ, ప్రతి ఆరోపణా అబద్ధమని ఎవరూ చెప్పరు. కానీ వాటిపై దర్యాప్తు తీరు మాత్రం కేంద్ర సంస్థలపై బీజేపీ ఒత్తిడి ఫలితమనేది వాస్తవం. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహాయకున్ని కూడా ఈడీ విచారించడం ఎప్పుడో తేలిపోయిన బంగారం స్మగ్లింగ్ కేసునూ సాగదీయడం కర్నాటక కాంగ్రెస్ వారిపైన తమిళనాడులో డిఎంకె మంత్రిపైనా సాగే కేసులు ఇవన్నీ చూస్తే బీజేపీయేతర వ్యతిరేక పార్టీలనే లక్ష్యంగా చేసుకోవడం స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఈడీ, సీబీఐతో సహ ఈ సంస్థల అత్యున్నత బాధ్యులంతా ఎక్స్‌టెన్షన్‌పైనే సర్వీసులో ఉన్నారు. ఆ పొడగింపు పద్ధతే తప్పని సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. అందువల్ల ఇదంతా సత్యశోధన న్యాయ సాధన కోసమే జరుగుతున్నదని నమ్మడం కష్టం. ఈ ఆరోపణల మధ్యవారుగనక బీజేపీలో చేరేట్టయితే అంతా గప్‌చిప్. కాకుంటే అప్పుడప్పుడూ నామకార్థంగా కొన్ని దాడులు చేసి వారు అదుపు తప్పిపోకుండా చూస్తుంటారు. ఇంతకంటే అనేక రెట్లు ప్రత్యక్షంగా జరిగిన తెలంగాణ ఆపరేషన్ ఫాంహౌస్ గురించి పట్టించుకోరు! ప్రపంచాన్నే ప్రకంపనలకు గురిచేసిన అదానీ విషయంలో నోరు మెదపరు. ఇలాంటి కారణాలతోనే జగన్ ప్రభుత్వం కేంద్రంతో సహకరించవలసి వస్తున్నదని అత్యధికుల అభిప్రాయం. గత ఎన్నికల సమయంలో సీబీఐ రాకను నిషేధించి మోడీని సవాలు చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత కూడా ఇప్పుడు కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ జోక్యాన్ని ఆహ్వానించడం ఇక్కడ కొసమెరుపు.

ఏపీ, తెలంగాణ పరిణామాలు

ఆలస్యంగానైనా తెలంగాణ ముఖ్యమంత్రి బీజేపీతో రాజకీయ పోరాటం ప్రారంభించి బీఆర్ఎస్‌గా మారడం దేశరాజకీయాలను ప్రభావితం చేస్తున్నది. అయితే ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడుప్రాంతీయ పార్టీలు కేంద్ర బీజేపీకి దగ్గరగా విధేయంగా ఉంటున్నాయి. తమలో తాము పోట్లాడుకోవడం తప్ప వీరికి ఏపీ ప్రయోజనాలు, ప్రత్యేకహోదా, లోటుభర్తీ, వెనకబడిన ప్రాంతాల నిధులు, పోలవరం పూర్తి, విశాఖ ఉక్కు రక్షణ వంటి అంశాలపైనైనా కలసిపోరాడాలనే స్పృహ విధానం ఎంతమాత్రం లేవు. ఈ పరిస్థితిని రాజకీయంగా బీజేపీ పూర్తిగా వాడుకుంటున్నది. అయితే ప్రజల్లో మాత్రం వారిపై విముఖత అసంతృప్తి పూర్తిగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైనా నిరసన ఉంది. కాని ఇందులో రాష్ట్రం భాగంపై ఉద్యమాలు తప్ప కేంద్రం జోలికి పోవడానికి టీడీపీ, జనసేన సిద్ధంగా లేవు. ఇక జగన్ సర్కారును తీసుకుంటే కేంద్రం ఇచ్చే ఆదేశాలు విధానాలు తుచ తప్పకుండా పాటించేందుకు అత్యుత్సాహం చూపుతున్నది. గతంలో కేసీఆర్ కూడా పెద్దనోట్ల రద్దును సమర్థించడంలో బీజేపీ నేతల కన్నా ముందుండేవారని ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఉభయులూ కలసి మోడీకి అనుకూలంగా ఓటేసిన సందర్భాలెన్నో. ఇప్పుడు బీఆర్ఎస్ మారింది గాని వైసీపీ అదే బాటలో కొనసాగిస్తున్నది. తెలుగుదేశం స్వంత గెలుపు ఏకైక అవసరంగా ఇటు అటు మారుతోంది. వామపక్షాలతో కలసి నడిచిన పవన్ కళ్యాణ్ ముందే పొత్తుపెట్టుకున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య సమీకరణాలు ఎలా మారతాయనేదానిపైనే ఎడతెగని ఊహాగానాలు అంచనాలలో మునిచితేలుస్తున్నారు.

స్వతహాగా బీజేపీకి తెలుగునాట పెద్ద పునాది లేదు. దానికి తోడు కేంద్రం వివక్ష వారిలో తీవ్ర ఆగ్రహం కలిగిస్తున్నది. ఫలితంగావున్న బీజేపీ పని ఎదురీతగా



తయారైంది. అంతర్వేది, రామతీర్థం వంటి సమస్యలు రగిలించాలని చూసినా ఆశించిన స్పందన రాలేదు. తెలంగాణలోనూ బండిసంజయ్, ఎంఎల్ఏ రాజాసింగ్ వంటివారు పచ్చి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నా ప్రజలు ఆదరించడం లేదు. టీఆర్ఎస్ నుంచి చేరిగెలిచిన ఈటెల రాజేందర్ వంటివారు కూడా జోరు తగ్గించుకోవలసి వచ్చింది. బీఆర్ఎస్ వామపక్షాలు గట్టిగా నిలిచి తిప్పికొట్టడం ఇందుకు ప్రధాన కారణం. ఆ వాతావరణం ఏపీలోలేదు. బీఆర్ఎస్ భవిష్యత్ వ్యూహాలేమిటనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. మునుగోడు ఫలితం తర్వాత మీడియా ఏకపక్షంగా ముగ్గురూ కలసిపోయినట్టే రాసినా ఉభయ కమ్యూనిస్టుపార్టీలూ ఆ కథనాలను తోసిపుచ్చాయి. ఎన్నికల చర్చలు ఇంకా జరగలేదనీ, బీఆర్ఎస్ మంత్రులూ నాయకులూ కొందరు తోచినట్టు మాట్లాడటం సరికాదని స్పష్టం చేశాయి. బీజేపీ వ్యతిరేక పోరాటంలో కలసినడిచినా సమస్యలపైన సర్దుబాట్లపైనా తాము కలసి వ్యవహరిస్తామని, గౌరవ ప్రదమైన సంబంధాలే కోరుకుంటామని తేల్చిచెప్పాయి. బీఆర్ఎస్, బీజేపీలను సమానంగా చూస్తూ కేసీఆర్ ప్రభుత్వంపై ఎక్కువ కేంద్రీకరిస్తున్న కాంగ్రెస్ అదే అస్పష్టతలోనూ అనైక్యతలోనూ మునిగివుంది. మునుగోడు తర్వాత జోరు తగ్గిన బీజేపీ ఎకాఎకిన సర్కారులోకి వచ్చేస్తాననే అతిశయాలు తగ్గించుకోక తప్పలేదు. పైగా ఆ ఫలితం చూశాక పెద్ద నాయకులెవరూ ఇతర పాలక పార్టీలలోంచి బీజేపీలోకి దూకేందుకు ఆసక్తిచూపడం లేదనే వాస్తవం మోడీ, అమిత్‌షాలు గ్రహించాల్సి వచ్చింది. టీబీజేపీ అసలైన నేత ఎవరనేదికూడా పూర్తిగా తేల్చుకోలేని స్థితి.

తెలంగాణలోనూ బండిసంజయ్, ఎంఎల్ఏ రాజాసింగ్ వంటివారు పచ్చి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నా ప్రజలు ఆదరించడం లేదు. టీఆర్ఎస్ నుంచి చేరిగెలిచిన ఈటెల రాజేందర్ వంటివారు కూడా జోరు తగ్గించుకోవలసి వచ్చింది. బీఆర్ఎస్ వామపక్షాలు గట్టిగా నిలిచి తిప్పికొట్టడం ఇందుకు ప్రధాన కారణం. ఆ వాతావరణం ఏపీలోలేదు. బీఆర్ఎస్ భవిష్యత్ వ్యూహాలేమిటనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. మునుగోడు ఫలితం తర్వాత మీడియా ఏకపక్షంగా ముగ్గురూ కలసిపోయినట్టే రాసినా ఉభయ కమ్యూనిస్టుపార్టీలూ ఆ కథనాలను తోసిపుచ్చాయి. ఎన్నికల చర్చలు ఇంకా జరగలేదనీ, బీఆర్ఎస్ మంత్రులూ నాయకులూ కొందరు తోచినట్టు మాట్లాడటం సరికాదని స్పష్టం చేశాయి.

రాజ్‌భవన్ రాజకీయాలు అలావుంచితే నేరుగా బీజేపీ సంస్థాగత వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఏపీలో వెనకబడివున్నా తెలంగాణలో అధికారానికి వచ్చేస్తామని కొన్నాళ్ల కిందట బీజేపీ అగ్రనేతలు కూడా హడావుడి చేశారు. స్వయంగా మోడీ, అమిత్‌షా, అధ్యక్షుడు నడ్డాలు పర్యటించి వెళ్లారు. దక్షిణాదిలో తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని గొప్పలు పోయారు. కానీ మునుగోడు ఫలితాల తర్వాత ఇదంతా తారుమారైంది. ఇప్పుడు బీజేపీ నేతలెవరూ అధికారంలోకి రావడం గురించి ఆశలు పెట్టుకోలేదు. పదిహేను స్థానాలు తెచ్చుకుంటే ధన్యమని భావిస్తున్నారు.

బీజేపీతో కలిస్తే చేటే

ఏపీలోనైతే సోమువీర్రాజు నాయకత్వం అడుగడుగునా విభేదాలను ఎదుర్కొంటున్నది. మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అనేక మల్లగుల్లాల తర్వాత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నుంచివచ్చి చేరిన ఎంపీలు, ఇతరులు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. టీడీపీని మళ్లీ పెరగనివ్వరాదనేది కేంద్ర బీజేపీ వ్యూహమని చెబుతున్నా లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ పట్టువిడుపులతో మూడుపార్టీలను గుప్పిట్లో పెట్టుకోవాలనేది వ్యూహంగా ఉంది. అయితే విభేదాలు ఎంతవరకూ పోయాయంటే కేంద్రనాయకుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి పురందేశ్వరి బాహాటంగా వ్యతిరేకించుకునేవరకూ. రాజధాని సమస్యపై పరిపరి విధాల మాట్లాడుతూ ప్రతిష్టంభన పెంచడం ఇందులో భాగమే. విశాఖసీటుపై కన్నేసిన బీజేపీ ఉక్కు ఫ్యాక్టరీ సమస్యపై ఆత్మరక్షణలో పడినా ఏదో తాత్కాలికంగా వేగం తగ్గించినట్టు చూపించేందుకు పథకాలు వేస్తున్నది. టీడీపీ కన్నాను చేర్చుకోవడంలో కనిపించే సామాజిక వ్యూహాన్ని వైసీపీ మరింత ఎక్కువగా ప్రయోగిస్తోంది. కులం, మతం ఏది కలసి వస్తుందా అని బీజేపీ చూస్తున్నది. పాత నేస్తం బీజేపీ, ప్రస్తుత నేస్తం టీడీపీ మధ్య జనసేనాని ఊగిసలాడుతూ ఉభయులనూ కలపాలని చూస్తున్నారు. ఆ కోణంలో చూస్తే బీజేపీతో కలసి ఉండే ఏ పొందిక కూడా రాష్ట్రానికి దేశానికి మేలు చేస్తుందంటే అంతకన్నా హాస్యాస్పదం ఉండదు. కేవలం నవరత్నాలనే గొప్పగా చెబుతూ అనేక అప్రజాస్వామిక పోకడలకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కూడా ప్రజలు ఆమోదించిదిగా లేదు. ప్రత్యేకించి ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాలు ఆర్థికవిధానాలు ప్రజలపై భారాలు రైతుల సమస్యలు తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. ఏపి సమగ్రాభివృద్ధి, ఆర్థిక సౌష్టవం కోసం కేంద్ర నిరంకుశత్వంపై పోరాటం ఇప్పుడు అనివార్యం. అది నిర్దిష్టంగా ఏ రూపం తీసుకునే ఏ శక్తులు ఏ పాత్ర పోషించేది తెలియాలంటే మరికొంత వేచి చూడాలి. ఎందుకంటే మన మీడియాలో కేవలం ప్రాంతీయ పార్టీల ప్రకారం విభజించి చూసే వారు బీజేపీ అదృశ్య ప్రభావం అంతకంటే ఎక్కువగా ఉందని చెప్పడం లేదు. ఏకథలు చెప్పినా విభజనానంతర సమస్యలతో సతమతమవుతున్న ఈ రాష్ట్రానికి నష్టం కలిగించే విధానం ఎవరు అనుసరించినా ప్రజలు సహించరు. •



'సహకార'పై కేంద్రం పెత్తనం!

బహుళ రాష్ట్ర సహకార సంఘాల (ఎంఎస్‌సిఎస్) పేరిట వివిధ రాష్ట్రాల్లోని సహకార సంఘాలపై పెత్తనం చలాయించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వాస్తవానికి సహకార సంఘాలు రాష్ట్ర జాబితాలోని అంశం. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లో రాష్ట్ర జాబితాలోని 32అంశాల్లో సహకార సంఘాలు ఒకటి. అయినా, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడం రాష్ట్రాల హక్కుల్లోకి చొరబడడమే. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించడమే! ఆ శాఖ మంత్రిగా కేంద్ర కేబినెట్‌లో సర్వ శక్తిమంతుడైన అమిత్ షాను నియమించడం కూడా సహకార సంఘాలను కేంద్రం అజమాయిషీ లోకి, ఆ తరువాత బీజేపీ రాజకీయ ప్రభావంలోకి లాక్కోవాలని మోడీ సర్కారు యోచిస్తున్నది.

కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటుపై 2021 జులైలో ప్రకటన చేసినప్పటినుండి అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా వందేండ్లు పైబడి సహకార సంఘాలను విజయవంతంగా నడుపుతున్న కేరళ రాష్ట్రం మోడీ సర్కారు ఎత్తులను ఆది నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సహకార వ్యవస్థను విస్తారంగావించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర ప్రముఖమైనది. చక్కెర రంగంలో అద్భుత ఫలితాలు సాధించింది. అలాగే పాడి రంగంలో గుజరాత్, ఆ కర్నాటక వంటివి సహకార వ్యవస్థ ద్వారా అటు పాల ఉత్పత్తిదార్లకు, ఇటు వినియోగదార్లకు ప్రయోజనకరంగా నిర్వహిస్తున్నాయి. అయితే, గ్రామ సీమల్లో సహకార సొసైటీల విస్తరణ, నిర్వహణ ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ రాజకీయ పట్టు సాధించడానికి సహకార రంగాన్ని సాధనంగా చేసుకోవాలన్న ఎత్తుగడను అమలు చేయడానికే ఈ ఎంఎస్‌సిఎస్ తీసుకొచ్చారు. ఇప్పటికే గుజరాత్ వారి వశమైంది. మహారాష్ట్ర, కర్నాటకల్లో ప్రయత్నిస్తున్నా అక్కడి ప్రతిపక్షాల పట్టు నుండి తప్పించలేకపోతున్నారు. కేరళలో అది అసాధ్యంగా ఉంది. అందుకనే సహకారాన్ని కేంద్రం పరిధికి తీసుకొచ్చే ఈ కొత్త యత్నం.

బహుళ రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) బిల్లు, 2022ను లోక్‌సభలో గతేడాది డిసెంబర్ 7న ప్రవేశపెట్టారు. రానున్న బడ్జెట్ సెషన్ రెండో భాగంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదైనా సహకార సంఘం ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఎంఎస్‌సిఎస్‌లో కలిసేలా ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. తద్వారా కొన్ని సహకార సంఘాలను ఎంఎస్‌సిఎస్ పరిధిలోకి తీసుకొస్తారు. అలాగే సహకార ఎన్నికల యంత్రాంగాన్ని కూడా కేంద్రం ఏర్పాటు చేస్తుంది. ఆ విధంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీలో నున్న సహకార వ్యవస్థ కేంద్రం పరిధికి క్రమంగా పోతుందన్నమాట. ఇది రాష్ట్రాల అధికారాల్లో కేంద్రం జోక్యం చేసుకోవడమే. 'ఒకే దేశం - ఒకే భాష', 'ఒకే దేశం - ఒకే పన్ను' లాగే 'ఒకే దేశం - ఒకే రిజిస్ట్రేషన్' విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. అంటే ఇది మరో జీఎస్‌టి లాంటిదే! సహకార రంగం అనేది రాష్ట్ర జాబితాలో ఉన్న అంశమైనప్పటికీ కేంద్రం రాష్ట్రాలను కనీసం సంప్రదించకుండా సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర మంత్రి రాష్ట్రాల సహకార శాఖ కార్యదర్శులకు, సొసైటీల రిజిస్ట్రార్లకు నేరుగా ఆదేశాలు జారీ చేయడం నిరంకుశత్వానికి నిదర్శనం. •

ఫొటోగ్రాఫర్



జె. రఘుబాబు

ఇది పెళ్ళిళ్ళ సీజన్, రిసెప్షన్ల సీజన్. ఎక్కడ చూసినా జనం జనం. నగరం మధ్యలో పార్కింగు లేక తాము ఇబ్బంది పడి ఇతరులను ఇబ్బంది పెట్టడం ఎందుకని ఈ పెళ్ళిళ్ళ మండపాలు గార్డెన్లుగా అవతార మెత్తి ఊరి బయటకు దారితీశాయి. కొంత ప్రయోజనమే. కొంత దూరమే అయినా తప్పదు. ఆ రెండు గంటలూ హాయిగా ఉండొచ్చు. ఈ సీజనంతా పెళ్ళి చుట్టూ ఉండే అవసరాలతో ఎందరికో జీవనోపాధి. వాళ్ళలో ఫొటోగ్రాఫర్లు ఒకరు. ఎంతో ఓపిక, సహనం, పట్టుదల ఉంటే కాని ఈ రంగంలో ఉండడం కష్టం. కష్టమైనా సరే వాళ్ళు ఎంతో కొంత టేస్ట్ ఉండబట్టి అలా ఫొటోగ్రాఫర్లుగా నిలబడగల్గుతారు.

విత్ ద ఫొటోగ్రాఫర్ అని రచయిత స్టీఫెన్ లీకాక్ ఒక చిన్న కథ రాస్తాడు. నలుపు తెలుపు ఫొటోలున్న కాలంలో ఫొటో తీసుకుందామని స్టూడియోకు పోతాడు రచయిత. ఈయన మొహం చూస్తేనే ముభావంగా చూస్తాడు ఫొటోగ్రాఫర్. అంటే నీ మొహం ఫొటోకు పనికి రాదు అన్నట్టు. ఎలాగో తీయించుకొని బయటపడతాడు. చెప్పిన రోజుకు ఫొటో తీసుకుందామని పోతే ఒక ఫొటో చేతిలో పెడతాడు. ఆ ఫొటోలో కనిపించే తల, కళ్ళు, ముక్కు, చెవులు తనవి కాదు, ఏమంటే అవి బాగా లేవని మార్చానంటాడు, టచప్‌లు ఇచ్చానంటాడు. ఇది నా చిత్రం కాదు నీదగ్గరే ఉంచుకో అని బాధగా వెళ్ళిపోతాడు రచయిత. ఆ కథలో ఎంతో వ్యంగ్యం ఉంటుంది. ఫొటోగ్రాఫర్లు ఇలా కూడా ఉండేవారన్నమాట. ఓ తెలుగు సినిమాలో బ్రహ్మానందానికి ఇలాంటి సీను పెట్టారు కూడా. ఇప్పుడు కూడా హెచ్.డి అని, బ్యూటిఫై అని ఎవరినైనా సినిమా హీరోల్లా చూపేవాళ్ళూ ఉన్నారు. సెల్లుల్లో అలా చేసేవాళ్ళూ ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లు ఈ సీజనంతా యమా బిజీ. ముందుగానే మాట్లాడుకోకపోతే వాళ్ళు కూడా ముక్కు పిండి వసూలు చేస్తారంటారు. కానీ ఎవరు మాత్రం ఆ పని చేయడం లేదు చెప్పండి. ఆ లెక్కన పురోహితుడి దగ్గరి నుండి అందరూ చెట్టుపైన కూచొని ఉంటారు. ఎలాగోలా వాళ్ళను దింపుకొని తమ పనైపోగుట్టుకున్నాక వారిని కామెంట్ చేసే ఈ సో కాల్డ్ మనుషులు తరువాత పలకరించను కూడా పలకరించరు. సంవత్సరంలో ఎన్నోరోజులు వాళ్ళు రెస్టు తీసుకోవలసిందే పాపం. ఏమైతేనేం ఇతరత్రా ఎన్నో చోట్ల పనిచేసి కాలం గడుపుకొస్తారు ఈ ఫొటోగ్రాఫర్లు. మస్తు స్మార్టు సెల్లులు వచ్చి వీళ్ళ డిమాండ్ తగ్గింది. కానీ నలుపు తెలుపు ఫిల్ముల కెమెరాలనుండి, రంగురీళ్ళు వచ్చాక తమను తాము చూసుకునే పనిలో ఈ ఫొటోగ్రాఫర్లే సహాయం చేశారని మరుస్తారు కొందరు.

ఇక పెళ్ళిలో వీళ్ళ హడావుడి అంతా ఇంతా కాదు. కొందరైతే తమ ప్రతాపాన్ని, నైపుణ్యాన్ని కలగలిపి ఎన్నెన్నో కోణాల్లో ఫొటోలు తీస్తారు. పైత్యాన్ని కూడా కలుపుతారని మా మిత్రుడంటూ ఉంటాడు. తాళి మళ్ళీ కట్టమన్నా, దండ మళ్ళీ వేయమన్నా, తలంబ్రాలు తిరిగి వేయమన్నా



చేయాల్సిందే. అది ఫొటోగ్రాఫర్ పవరంటే. ఎందరో పురోహితులు ఈ ఫొటోగ్రాఫర్లు తమ పనికి అడ్డు తగులుతున్నారని అంటూ ఉంటారు. వీళ్ళు వింటూ ఉంటారు కాని తాము చేసేది చేస్తూనే ఉంటారు. తలంబ్రాలు వేస్తుంటే పెళ్ళి కొడుకు పెళ్ళి కూతుర్ల మధ్యలో దూరిపోయి పెళ్ళికొడుకు తలంబ్రాల చేతుల కిందినుంచి ఫొటో తీస్తున్న ఒక ఫొటోను వాట్సప్‌లో పెట్టారు మిత్రులు. అది నిజమైనా కాకున్నా వాళ్ళు పడే కష్టమంతా పెళ్ళివాళ్ళకోసమే కదా!

పెళ్ళిలో ఫొటోలు, వీడియో తీస్తుంటారు కాబట్టి జనాలు ఓ క్రమశిక్షణతో కూర్చొని ఉంటారు. కొద్దిగా నవ్వు మొహం కూడా పెడుతుంటారు. సడన్‌గా డ్రోన్ కెమెరా పైనుండి పోతుంటుంది హెలికాప్టరు లాగా. అంతకు ముందు క్రేన్ లాంటి యంత్రాలతో తీసేవారు.

సురుకు

ఇలా టెక్నాలజీ కొత్త కొత్త రూపాలు ధరించినప్పుడంతా ఈ ఫొటోలు కూడా అతీతం కాదు కాబట్టి అవీ వాటిని ఉపయోగించుకుంటాయి. ఫొటోగ్రాఫర్లు లేదా ఆపరేటర్లు ఉంటేనే ఈ వీడియోలు, ఫొటోలు వస్తాయా అంటే లేదు అని సమాధానమొస్తుంది. సీసీ కెమెరాలు వాటంతట అవే ఇరవైనాలుగు ఇంటూ ఏడు అన్నట్టు పనిచేస్తుంటాయి. చివరికి క్రికెట్ మ్యాచుల్లో కూడా మూడో అంపైర్ రూపంలో వీడియో చూసి మరీ బల్లేబాజ్ అవుటా కాదా! అని నిర్ణయిస్తారు. ఇక గూగుల్లో కూడా కృత్రిమ ఉపగ్రహాలు పంపే చిత్రాల ద్వారా మనం చూడొచ్చు.

సినిమా షూటింగులు తీసే ఫొటోగ్రాఫర్ల గురించి ఎంత చెప్పినా తక్కువే. అన్నిచోట్లా ఉన్నట్టుగానే అక్కడా శ్రమదోపిడీ ఉంటుంది. హీరో ఎంతబాగా చేసినా సరిగా రానట్టు తీసి అందరి సమయాన్ని వేస్టు చేయొచ్చు వాళ్ళు కోపమొస్తే. కాని అలా చేయరు. ఎందుకంటే శ్రమ విలువ తెలిసిన వాళ్ళు కాబట్టి. ఎక్కడో కొండల్లో, అడవుల్లో, ఎడారుల్లో ఇంకా సెట్టింగుల్లో పగలూ రాత్రి తేడా లేకుండా షూటింగులో జరిగేదంతా షూట్ చేస్తుంటారు. మూడు షిఫ్టులు చేసిన హీరోల గురించి, హీరోయిన్ల గురించి రాస్తారు కాని వీళ్ళ గురించి రాయాల్సినంతగా రాయరు. ఏ అవార్డో వచ్చినప్పుడు మాత్రం ఆకాశానికెత్తేస్తారు.

ముందే అనుకున్నట్టు ఈ ఫొటోలు, వీడియోలు ఓ నిఘాగా మనం అర్థం చేసుకోవాలి. సమాజాన్ని చిత్రించే కవులు, కళాకారులు తమ కలాలతో, తమ కళారూపాలతో దేశంలో, రాజకీయాల్లో ఏమి జరుగుతోందని ఆరా తీస్తూ వాటిని ప్రజలకు చూపిస్తుంటారు. ఒక విధంగా వాళ్ళు జరుగుతున్న దాన్ని చూపే ఫొటోగ్రాఫర్లే అనుకోవాలి. జరిగే ప్రతి విషయాన్ని రికార్డు చేస్తుండడం వారి ప్రత్యేకత. ఆ భయంతోనే వారి నోరు నొక్కేసే వాళ్ళూ ఉన్నారనుకొండి, అయినా ఈ రికార్డు చేసేవాళ్ళు వెనక్కు పోరుగాక పోరు. ఎంత శంఖమూదినా చెవిటి ప్రభుత్వాలు వినిపించినా విననట్టు నటిస్తుంటాయి. చెవుల్లేని పాము కూడా ఆడించేవాడు తిప్పినట్టు తన తలను ఆడిస్తుంది. వినబడీ వినబడనట్లు నటించేవాడిని ఎవ్వరూ మార్చలేరు. అటు శంఖం ఊదేవాళ్ళు విసిగిపోయినా మళ్ళీ మళ్ళీ ఊదుతూనే ఉంటారు. ప్రజలు కూడా విసుగొచ్చి వాత ఎక్కడ పెట్టాలో ఎప్పుడు పెట్టాలో నిర్ణయిస్తూ ఉంటారు. మూడో అంపైర్ వీడియో క్లిప్పింగులు చూసి నిర్ణయం ప్రకటించినట్టు మొత్తం చూసి మరీ అవుట్ చెబుతారు. అప్పుడు కానీ నిత్యం

ముందే అనుకున్నట్టు ఈ ఫొటోలు, వీడియోలు ఓ నిఘాగా మనం అర్థం చేసుకోవాలి. సమాజాన్ని చిత్రించే కవులు, కళాకారులు తమ కలాలతో, తమ కళారూపాలతో దేశంలో, రాజకీయాల్లో ఏమి జరుగుతోందని ఆరా తీస్తూ వాటిని ప్రజలకు చూపిస్తుంటారు. ఒక విధంగా వాళ్ళు జరుగుతున్న దాన్ని చూపే ఫొటోగ్రాఫర్లే అనుకోవాలి. జరిగే ప్రతి విషయాన్ని రికార్డు చేస్తుండడం వారి ప్రత్యేకత. ఆ భయంతోనే వారి నోరు నొక్కేసే వాళ్ళూ ఉన్నారనుకొండి, అయినా ఈ రికార్డు చేసేవాళ్ళు వెనక్కు పోరుగాక పోరు. ఎంత శంఖమూదినా చెవిటి ప్రభుత్వాలు వినిపించినా విననట్టు నటిస్తుంటాయి.

గమనించే ఫొటోగ్రాఫర్లు ఉన్నారని తెలియదు కొందరు జనాలకు.

పైన చెప్పుకున్న ఓపిక, సహనం, పట్టుదల ఎక్కువగా ఉండబట్టి వాళ్ళు ప్రజలవైపే నిలబడతారు. కొద్దిమందైనా ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా నిలబడి ప్రజల గొంతును తమగొంతుగా వినిపిస్తారు. ప్రజలవైపు నిలబడే పత్రికల్లో రాస్తారు, ఏ టీవీలోనైనా ప్రజల గొంతుతోనే మాట్లాడతారు, ప్రజలకూ, నిజాలకు భయపడేవాళ్ళు ఎన్ని ట్రోలింగులు చేసినా విసుగు చెందక, సహనం కోల్పోక తాము చెప్పేది నిజం కాబట్టి తగ్గేదే లేదని మరీ దూసుకుపోతారు. వీళ్ళంతా ప్రజలకు చెందిన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లూ కాక మరేమిటి చెప్పండి!!

సెల్: 9849753298

సొంతంగా ఎదుగుతోంది

సాధారణంగా సెలబ్రెటీల పిల్లలు కుటుంబ అండతో పరిశ్రమలోకి అడుగుపెడతారు. కానీ ఖతీజా రెహమాన్ అలా కాదు. చదువుకునే రోజుల్లోనే స్వచ్ఛంధ కార్యకర్తగా పని చేశారు. తనకున్న ప్రతిభతో వివిధ సామాజిక అంశాలపై పని చేస్తూ సొంతంగా ఎదుగుతున్నారు. ప్రస్తుతం ఎ.ఆర్.రెహమాన్ ఫౌండేషన్‌లో ఔట్‌రీచ్ ప్రోగ్రామ్స్ & గ్లోబల్ ఇనిషియేటివ్స్ ట్రస్టీగా, డైరెక్టర్‌గా బాధ్యతలు చూస్తున్నారు. ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన పిల్లలను దత్తత తీసుకుని వారికి సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. అంతేకాదు ఆమె కూడా స్వయంగా ప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు. ఇటీవల సాగవాసిలో రాపర్ అరివుతో కలిసి పనిచేసిన ఆమె ఓ వెబ్ మ్యాగజైన్‌తో పంచుకున్న విశేషాలు నేటి మానవిలో...



నలుగురికి సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కుటుంబంలో పెరిగారు ఖతీజా రెహమాన్. దారిన పోయే ప్రజలు దాహాన్ని తీర్చుకోవడానికి అమ్మమ్మ తమ ఇంటి బయట ఎప్పుడూ ఓ నీటి కుండను ఉంచేదని ఆమె గుర్తు చేసుకున్నారు. "ఇంటికి ఎవరైనా వస్తే కనీసం ఒక గ్లాసు నీళ్ళు తాగకుండా ఆమె ఎవరినీ విడిచిపెట్టదు. నాన్న, అమ్మతో సహా మా కుటుంబంలో అందరూ అలాంటివారే. వారు అందరి పట్ల చూపించే ఈ చిన్నపాటి దయే నాకు స్ఫూర్తినిచ్చింది" అని ఖతీజా చెప్పారు. ఆమె స్వతహాగా ప్రశంసలు పొందిన సంగీత విద్వాంసురాలు. ఖతీజా ఎ.ఆర్.రెహమాన్ ఫౌండేషన్ రోజువారీ నిర్వహణలో దగ్గరి సంబంధం కలిగి ఉన్నారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆమె లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌లో, అడయార్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో, యూత్ రెడ్‌క్రాస్ వారితో కలిసి స్వచ్ఛందంగా పనిచేశారు. ఇవన్నీ తనకు మంచి అనుభవాలను నేర్పాయని ఆమె అంటారు.

మూస పద్ధతులను బద్దలు కొట్టి

2016లో ట్రోంబోనిస్ట్ అయిన లిసా సరాసిని ఆధ్వర్యంలో ప్రారంభించబడిన బ్రాస్ ఎన్‌సెంబుల్ గురించి కూడా ఆమె పంచుకున్నారు. సాంప్రదాయకంగా సంగీత వాయిద్యాలతో ఆడుతూ, పాడటం అనేది పురుషుల పనిగానే కొనసాగుతుంది. ఎందుకంటే ఇది శారీరకంగా కూడా కష్టంతో కూడుకున్నది. అయితే ది సన్‌షైన్ ఆర్కెస్ట్రాలోని అమ్మాయి బ్రాస్ ప్లేయర్‌లు మూస పద్ధతులను బద్దలు కొట్టి కొత్త చరిత్రను సృష్టించినందుకు ఆమె గర్వపడుతున్నారు. ఫౌండేషన్ తన మొదటి ఔట్ రీచ్ కార్యక్రమాన్ని 2018లో చెన్నైలోని ప్రభుత్వ సహాయక పాఠశాల జనరల్ కరియప్ప స్కూల్‌లో ప్రారంభించింది.

సామాజిక మార్పుకై...

సామాజిక మార్పు పట్ల ఖతీజాకు ఉన్న అభిరుచి వివిధ ప్రాంతాలకు విస్తరించింది. దాని గురించి వివరిస్తూ "యువతతో కలిసి పనిచేయడం నాకు చాలా ఇష్టం. 2008లో కొంతమంది విద్యార్థులతో ప్రారంభమైన సన్‌షైన్ ఆర్కెస్ట్రా ఇప్పుడు నాగాలాండ్‌కు విస్తరించింది. ఎ.ఆర్.రెహమాన్ ఫౌండేషన్ మార్క్యూ ప్రాజెక్ట్ అయిన ది సన్‌షైన్ ఆర్కెస్ట్రా సంగీతంలో నైపుణ్యం ఉండి ఆర్థికంగా వెనుకబడిన పిల్లలను గుర్తిస్తుంది. వారికి ఉచిత సంగీత శిక్షణ అందిస్తుంది. వారు సరైన నైపుణ్యాలతో శిక్షణ తీసుకుని, తగినంత ఆత్మవిశ్వాసం పొందిన తర్వాత వారే శిక్షకులుగా లేదా ప్రదర్శకులుగా అవకాశాలు కల్పించుకుంటారు. తద్వారా కెరీర్‌ను రూపొందించుకుంటారు. ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు ఆర్కెస్ట్రా 100 మంది విద్యార్థులను దత్తత తీసుకుంది" అన్నారు.

కరుణామృతసాగరం

"మా సీనియర్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సంగీతం నేర్పుతారు. మేము వారిని విద్యార్థి అధ్యాపకులుగా నియమించాము. వారు ఆదాయాన్ని పొందడానికి, నాయకత్వ నైపుణ్యాలను నేర్చుకోవడానికి వారికి సహకరిస్తున్నాము. సంగీతం ఎవరికైనా మానసిక ఉత్సాహాన్ని, దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడుతుంది" అని ఆమె జతచేస్తున్నారు. ఎ.ఆర్.రెహమాన్ ఫౌండేషన్ కరుణామృతసాగరం ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించింది. అదే పేరుతో అబ్రహం పండితార్ రచించిన తమిళ సంగీతంపై గ్రంథం ఆధారంగా రూపొందించబడింది. "ఈ ప్రాజెక్ట్‌తో మేము రాగాలు, పురాతన వాయిద్యాలు, తమిళ సంగీతానికి సంబంధించిన ఇతర అంశాలతో సహా చాలా సమాచారాన్ని ఆర్కైవ్ చేయడానికి పని చేస్తున్నాము" అని ఆమె వివరించారు. ఈ ప్రాజెక్ట్ 3,000 సంవత్సరాలకు పైగా తమిళ సంగీత పరిణామాన్ని, దాని శాస్త్రీయ పూర్వీకులు, జానపద సంగీతం నుండి కొత్త-యుగం సంగీతం వరకు అన్వేషిస్తుంది. ఫౌండేషన్ అత్యవసర సమయాల్లో సంగీతకారుల కుటుంబాలకు కూడా మద్దతు ఇస్తుంది. "మన చుట్టూ ఉన్న వ్యక్తులకు మనం చేయగలిగిన విధంగా మద్దతు ఇవ్వడానికి మేము సంతోషిస్తున్నాం. మేము వారి కోసం ఉన్నామని ప్రజలకు తెలుసు" ఆమె చెప్పారు.





మద్దతు ఇవ్వండి

ఖతీజాలోని నిరాడంబరతే ఆమెను ఓ గొప్ప స్థాయికి చేరుస్తుంది. "అంతా జట్టుచేత నడుస్తుంది. నిర్ణయాధికారం లేదా సమస్య పరిష్కార పరంగా వారికి మద్దతు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. సోషల్ మీడియా, మార్కెటింగ్, వెబ్‌సైట్ మేనేజ్‌మెంట్‌లో కూడా నేను వారికి మద్దతు ఇస్తున్నాను. మీరు కూడా మీ ఇంటిలోని వ్యక్తులతో, మీ స్నేహితుల పట్ల మంచిగా ఉండటం ప్రారంభించండి. మీ స్నేహితులు చిన్న వ్యాపారాన్ని ప్రారంభించినట్లయితే దానికి మద్దతు ఇవ్వండి. నేను నా తోటి కళాకారులకు మద్దతు ఇవ్వడం ద్వారా పని ప్రారంభిస్తాను. అది కూడా సమాజానికి తిరిగి ఇవ్వడమే. నా చివరి రోజుల్లో నేను పోయినప్పుడు ఆమె ఎప్పుడూ ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు అని ప్రజలు చెప్పుకోవాలి" అంటూ తన భావాలను పంచుకున్నారు.

జీవితం, సంగీతం

ఖతీజా జీవితంలో దాతృత్వం, సంగీతం రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఆమె తన 14వ ఏట తన తండ్రి సంగీత దర్శకత్వంలో ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఎంథిరన్‌లో అరంగేట్రం చేశారు. "మొదట పాడటానికి నిరాకరించాను. కానీ 'నువ్వు వెళ్లి పాడటం మంచిది' అని మా అమ్మ చెప్పింది. నేను పరీక్షను వదిలేసి వెళ్లి ఎంథిరన్ కోసం పుతియా మనిధ పాడాను. ఇదంతా చాలా తక్కువ కాలంలో జరిగింది. నేను కూడా మూడు భాషల్లో పాట పాడాను" అంటూ గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఆమె ఎనిమిదేండ్ల విరామం తీసుకున్నారు. చదువుపై దృష్టి పెట్టారు. సంగీత ప్రపంచంలోకి తిరిగి రావడానికి ముందు స్వచ్ఛంద కార్యకర్తగా పని చేశారు.

నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది

ఖతీజా 'అహింసా'లో ఐరిష్ రాక్ బ్యాండ్ 'U2'తో, 'ఇల్తేజా'లో గ్రామీ అవార్డు గెలుచుకున్న సంగీతకారుడు రికీ కేజ్‌తో కలిసి పనిచేశారు. ఆమె సంగీతం ప్రపంచవ్యాప్త గుర్తింపును కూడా తెచ్చుకుంది. కోక్ స్టూడియో తమిళ్ సాగవాసి కోసం ఆమె ఇటీవల రాపర్ అరివుతో కలిసి చేసిన చిత్రం ఇప్పటికే యూట్యూబ్‌లో 15 మిలియన్లకు పైగా హిట్‌లను సాధించింది. "ఇది భిన్నమైన అనుభవం. అరివు తన కళ ద్వారా చాలా శక్తివంతమైన సందేశాలను సమాజానికి అందిస్తారు. అతను రాసిన సాహిత్యాన్ని పాడినందుకు సంతోషిస్తున్నాను" అన్నారు. పాట వలె ప్రతిదీ సహజీవనం చేస్తుంది. అది కళకు అవసరం. అయితే ఖతీజా రెహమాన్ "ఇంపోస్టర్ సిండ్రోమ్"తో బాధపడుతున్నారు. "నేను వేరే ప్రదేశంలో ఉన్నాను. వ్యాధి వల్ల నేను బయట పాడటానికి ఆలోచిస్తున్నాను. ఆ సమయంలోనే నాకు ఈ కాల్ వచ్చింది. ఇది నాలో ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు సహాయపడింది. ఈ ఉత్సాహంతో నేను భవిష్యత్‌లో మరెన్నో చేయబోతున్నాను. ప్రణాళికలు రూపొందించుకుంటున్నాను" ఆమె చెప్పారు.

– సలీమ

లింగ సమానత్వం కోసం ఆవిష్కరణ, సాంకేతికత

ఈ ఏడాది మహిళా నినాదం



మార్చి 8వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023 సంవత్సరాన్ని "అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2023: లింగ సమానత్వం కోసం ఆవిష్కరణ, సాంకేతికత"గా యుఎన్ ప్రకటించింది.

మహిళలు సాధించిన విజయాలను ఉత్సవాలుగా జరుపుకోవడం, లింగ సమానత్వం కోసం వాదించడం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కార్యకలాపాలలో సమాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, మన సమాజంలో అత్యంత దుర్బలమైన మహిళలకు అన్ని రంగాలలో సమాన హక్కులు ఉండేలా లింగ సమానత్వం గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పని చేయాల్సిన కర్తవ్యాన్ని ఈరోజు గుర్తు చేస్తుంది.

అలుగుతున్నారా..?

జీవితభాగస్వామిపై అలగడం కొంతవరకు ముద్దుగానే ఉంటుంది. హద్దు దాటితే మాత్రం దాంపత్య బంధం భంగమవడానికి కారణమవుతుంది. భార్యాభర్తల మధ్య చోటుచేసుకొనే చిన్నవాటికి అలగడంకన్నా అవతలివారితో బాధను పంచుకోగలిగితే చాలు.. మనసు తేలిక పడుతుందంటున్నారు నిపుణులు.



- భాగస్వామి ఇచ్చినమాట తప్పినప్పుడు, ముఖ్యమైన సందర్భాలను ఇరువురిలో ఎవరైనా ఒకరు మర్చిపోయినప్పుడు అలగడం సర్వసాధారణం. ఆ అలకను రోజులతరబడి కొనసాగించినప్పుడు ఎదుటివారెందుకలా మౌనంగా ఉంటున్నారో కొన్నిసార్లు అవతలివారికి తెలియక పోవచ్చు. తమతో మాట్లాడకుండా నిశ్శబ్దాన్ని ఎందుకు పాటిస్తున్నారో అర్థంకాక అయోమయానికి గురికావొచ్చు. అలకకు ఎక్కువ రోజులు కొనసాగించకుండా కారణాన్ని చెప్పేయాలి. వారే తెలుసుకోవాలని పంతం ప్రదర్శించ కూడదు. అలగాల్సినంత ప్రాముఖ్యత ఆ విషయానికి ఉందని ఒకవేళ అవతలివారు భావించకపోతే సమస్య మరింత జటిలమవుతుంది. అందుకే అలకను ఆటగానే భావించి ఎదుటివారితో మనసులోని మాట చెప్పేయాలి. కాసేపు ఆటపట్టిస్తే చాలు. సందర్భం ఆనందంగా ముగుస్తుంది. లేదంటే వాదోపవాదాలకు దారితీసే ప్రమాదం ఉంది.
- మొదట సరదాగా అలిగిన సందర్భం సమయం గడిచేకొద్దీ కోపంగా మారే ప్రమాదమూ లేకపోలేదు. పుట్టినరోజు, పెండ్లిరోజు వంటి ప్రత్యేకమైన రోజులను అవతలివారు జ్ఞాపకంపెట్టుకోలేదనో, లేదా సెలబ్రేట్ చేయలేదనో అవతలివారిపై అలుగుతుంటారు. అయితే.. కొన్నిసార్లు ఆఫీసు పని ఒత్తిడి లేదా వేరే పనిలో బిజీగా ఉన్నప్పుడు నిజంగానే కొన్ని గుర్తు ఉండకపోవచ్చు. అటువంటప్పుడు రోజులతరబడి అలకను ప్రదర్శిస్తే అది అవతలివారికి అర్థంకాదు.
- అలాగ.. ఎదుటివారు తమ అలకను గుర్తించడంలేదని భావించి అలిగినవారు దాన్ని కోపంగా మార్చుకునే ప్రమాదం కూడా ఉంది. దీంతో ఇరువురిమధ్య లేనిపోని మానసిక సంఘర్షణలు మొదలవుతాయి. అలా కాకుండా ఉండాలంటే అప్పటికప్పుడు అవతలివారికి అసలు విషయం చెప్పగలిగితే చాలు. మనసు తేలిక పడుతుంది. ముఖ్యమైన రోజును మర్చిపోయినందుకు అవతలివారు పశ్చాత్తాపాన్ని ప్రదర్శిస్తే బెట్టుకు పోకుండా శాంతించండి. సంతోషం ఆ దంపతుల సొంతమవుతుంది. అలాగే ప్రతి చిన్న విషయానికీ అలుగుతుంటే అవతలివారికి చికాకును తెప్పించినవారవుతారు. ఆ తర్వాత ఎంత మూతి ముడిచినా ఎదుటివారు పట్టించుకోకపోవచ్చు.

స్నేహితున్ని చంపి గుండె తీసి..

(మొదటిపేజీ తరువాయి)

తాను ప్రేమించిన అమ్మాయితో నవీన్ చనువుగా ఉండటాన్ని హరి హర కృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. దాంతో నవీన్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 17వ తేదీన ఉదయం గెట్ టూ గెదర్ చేసుకుందామని నవీన్‌ను హరిహరకృష్ణ హైదరాబాద్‌లోని తన స్నేహితుడి రూమ్‌కి తీసుకెళ్లాడు. పార్టీ అనంతరం యువతి విషయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ విషయాన్ని నవీన్ వెంటనే తన తండ్రి శంకరయ్యకు ఫోన్ చేసి తెలిపాడు. దీంతో భయాందోళన చెందిన శంకరయ్య హరితో ఫోన్లో మాట్లాడి రాజీ కుదర్చడంతో ఇద్దరి మధ్య గొడవ సద్దుమణిగింది. అయితే అప్పటి నుంచి నాలుగు రోజులైనా నవీన్ కాలేజీకి కానీ, ఇంటికి కానీ రాలేదు. ఆందోళనతో నవీన్ తండ్రి శంకరయ్య నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. నార్కట్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా హరి స్నేహితులను, ఎంజీయూలోని విద్యార్థులను ప్రశ్నించారు. ఈనెల 22 సాయంత్రం నుంచి హరి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందని, హరికృష్ణ తల్లిదండ్రులను పోలీసులు పిలిపించి అతని గురించి అడిగారు. అయితే, అప్పటివరకు పరారీలో ఉన్న హరికృష్ణ పోలీసుల నుంచి ఒత్తిడి పెరుగుతుందని గ్రహించి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్లో ఈనెల 24న లొంగిపోయాడు. తాను ప్రేమించిన అమ్మాయిని ఎక్కడ దక్కించుకుంటాడోనని, తనకు ఆమె దూరం అవుతుందేమోనని నవీన్‌ను హత్య చేసినట్టు హరిహరకృష్ణ ఒప్పుకున్నాడు. అనంతరం నవీన్ మృతదేహాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ శివారులోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కన పడేసినట్టు పోలీసులకు చెప్పాడు. పోలీసులు నవీన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. హరిహరకృష్ణను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురించి రాచకొండ సీపీ చౌహాన్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. నిందితుడు హరహరకృష్ణ నవీన్‌ను కత్తితో కడుపులో పొడిచి ఆ తర్వాత మర్మాంగాలను కోశారని తెలిపారు. తల, మొండెం వేరు చేసిన హరిహరకృష్ణ.. నా ప్రియురాలిని ప్రేమిస్తావా అంటూ శరీరం నుంచి గుండెను వేరుచేశాడని పోలీసులు పేర్కొన్నారు. తల, మొండెం వేరు చేశాడు. ఆ తర్వాత నవీన్ గుండెను చీల్చాడు. మర్మాంగాలను కోసి.. చేతి వేళ్లను కట్ చేశాడు. ఆ తర్వాత ఆ ఫొటోలను అమ్మాయికి పంపించాడు. ఈ కేసులో దర్యాప్తు పారదర్శకంగా చేస్తామని పోలీసులు వెల్లడించారు. హరిహరకృష్ణపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్టు డీసీపీ సాయిశ్రీ తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ చేతికి ప్రసారభారతి

(మొదటిపేజీ తరువాయి)

సేకరణ వ్యవస్థ కలిగిన 'హిందుస్తాన్ సమాచార్'కు కాంట్రాక్ట్ దక్కటం ఇప్పుడు మీడియాలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ అనుకూల వార్తా కథనాలు వెలువరించటమే ఈ మార్పు ప్రధాన ఉద్దేశం. పీటీఐ, యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ) మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా వార్తా కథనాలు రాస్తోందని, ఆ సంస్థలపై కేంద్రం కక్షపూరిత చర్యలకు దిగటాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. లడఖ్ సరిహద్దులో భారత్-చైనా మధ్య చోటుచేసుకున్న ఘటనలపై పీటీఐ వార్తా కథనాలు మోడీ సర్కార్‌కు రుచించ లేదు. భారత్‌లో చైనా రాయబారిని, చైనాలో భారత రాయబారిని ఇంటర్వ్యూలు చేయటం కేంద్రానికి మింగుడుపడలేదు.

కేంద్రం ఒత్తిడికి తలొగ్గని పీటీఐ

తమకు అనుకూలురైన వ్యక్తులతో పీటీఐ ఎడిటోరియల్ బోర్డును నింపాలని మోడీ సర్కార్ గతంలో బెదిరింపులకు దిగింది. కేంద్రం తీసుకొచ్చిన ఒత్తిడికి పీటీఐ తలొగ్గలేదు. ప్రముఖ వెటరన్ జర్నలిస్టు విజయ్ జోషిని ఎడిటోరియల్ హెడ్‌గా నియమించింది. దాంతో 2017 నుంచి పీటీఐ, ప్రసారభారతి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని పీటీఐ భవనం నుంచి ప్రసారభారతి కార్యాలయం వేరే చోటకు తరలివెళ్లిపోయింది. తాజా పరిణామంపై కేంద్ర సమాచార శాఖ మాజీ కార్యదర్శి మీడియాతో మాట్లాడుతూ, "పీటీఐతో ఉన్న కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని కేంద్రం ఎప్పట్నుంచో ఎదురుచూస్తోంది. పీటీఐ ఎక్కువ మొత్తం ఛార్జ్ చేస్తోందని చెప్పటం ఒక సాకు మాత్రమే. సమయం కోసం ఎదురుచూసి పీటీఐ, యుఎన్ఐను దెబ్బకొట్టాలని భావించింది" అని అన్నారు. స్వతంత్ర న్యూస్ ఏజెన్సీగా పీటీఐతో మోడీ సర్కార్‌కు కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. అక్టోబర్ 2020నాటికి అవి పతాక స్థాయికి చేరుకున్నాయని ప్రసార భారతి ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎవరిదీ 'హిందుస్తాన్ సమాచార్'

వివిధ ప్రాంతీయ భాషల్లో వార్తా ఏజెన్సీ సేవలు అందించే నిమిత్తం 1948లో 'హిందుస్తాన్ సమాచార్'ను తీసుకొచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ శివరామ్ శంకర్ ఆప్టే, వీహెచ్‌పీ వ్యవస్థాపకుల్లో ఒకరు కలిసి దీనిని ఆనాడు ఏర్పాటుచేశారు. కేంద్రంలో మోడీ సర్కార్ ఏర్పాటైన వెంటనే 'హిందుస్తాన్ సమాచార్'కు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు పెద్ద ఎత్తున దక్కటం మొదలైంది. 2014కు ముందు..న్యూఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీస్‌కు సమీపంలో ఒక చిన్న భవనంలో ప్రధాన కార్యాలయం ఉండేది. మోడీ సర్కార్ వచ్చాక...నోయిడాలోని అత్యంత ఖరీదైన భవనంలోకి మారిపోయింది.

యువతను మోసం చేసిన మోడీ

- డీవైఎఫ్ఐ మహిళా సమ్మేళనంలో బృందాకరత్

న్యూఢిల్లీ : దేశంలో యువతను ప్రధాని మోడీ మోసం చేశారని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ విమర్శించారు. శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో రెండు రోజుల డీవైఎఫ్ఐ అఖిల భారత మహిళా సమ్మేళనం ప్రారంభమైంది. సమ్మేళనం ప్రారంభానికి ముందు డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఎఎ రహీం సంఘం జెండాను ఆవిష్కరించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే సదస్సును ప్రారంభించారు. మహిళలు లింగ ప్రాతిపదికన, కార్మికులుగా, పౌరులుగా మూడు రకాలుగా దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. లింగ సమస్య కూడా వర్గ దోపిడికి సంబంధించిన సమస్య అని అన్నారు. సంస్కృతిని కాపాడతామని చెబుతూ సంఘ్ పరివార్ మహిళలపై పితృస్వామ్యాన్ని ప్రయోగిస్తున్నదని విమర్శించారు. దాన్ని వ్యతిరేకించే వారిని దేశ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నదని దుయ్యబట్టారు.

డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య నివేదికను సమర్పించారు. అనంతరం జరిగిన చర్చల్లో ప్రతినిధులు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన సెషన్ సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ప్రసంగించారు. మోడీ సర్కార్ యువతకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నదని తెలిపారు. మోడీ హయాంలో యువత, మరీముఖ్యంగా యువతులు సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా హిజాబ్ అంశాన్ని ఉటంకించారు. ఈ కన్వెన్షన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

సానుభూతి, దయ ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

విద్య ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. నేటి తరం విద్యార్థులకు లోతైన జ్ఞానం, సమాచారం పొందే అవకాశాలొచ్చాయని తెలిపారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులు కేవలం బోధనా సిబ్బందిని మాత్రమే గుర్తుంచుకోవడం కాదనీ, ఆ విద్యాసంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన సిబ్బంది, వర్కర్లను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు గుర్తించిన జీవించే హక్కులో భాగమైన ఆత్మగౌరవానికి అదే నిజమైన అర్థమని తెలిపారు. కేవలం చట్టం, న్యాయానికి సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలను చదవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కోర్టు దృష్టిలో అందరూ సమానులేనని తెలిపారు. అధికారం మరింత బాధ్యతతో కూడుకుని ఉంటుందన్నారు. సమాజంలో న్యాయం దక్కని వ్యక్తికి దానిని అందించేందుకు దయ ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అది న్యాయానికి ఉండే ముఖ్యమైన కోణమని వివరించారు. విద్యార్థుల మధ్య పోటీ తత్వాన్ని పెంచేందుకే పరిమితం కాకుండా జీవితానికి ముఖ్యమైన సానుభూతిని పెంచడంపై దృష్టి సారించాలని జస్టిస్ చంద్రచూడ్ విద్యాసంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భయాన్ అధ్యక్షత వహించగా, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారావు స్వాగతోపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.విద్యుల్లత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాష్ పిటల్ హబ్..



(మొదటిపేజీ తరువాయి)

ఎంబీబీఎస్‌లు.. ఎండీలుగా, సర్జన్లుగా చలామణి అవుతుంటే, ఇంకొన్ని చోట్ల హోమియో, ఆయుర్వేద వైద్యులు స్పెషలిస్టులుగా చెప్పుకుంటూ వైద్యం చేస్తున్నారు. చాలా చోట్ల ఆర్ఎంపీలు, పీఎంపీలు నర్సింగ్‌హోంలు నిర్వహిస్తుండటం గమనార్హం.

నెలవారీ మామూళ్లు.. నేతల ఒత్తిళ్లు

సరైన అర్హతలు లేకున్నా పేషెంట్లను చేర్చుకొని చికిత్స చేస్తున్న ఆస్పత్రుల్లో.. రోగి ఆరోగ్యంతో బయటపడితే తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. పరిస్థితి విషమిస్తే హైదరాబాద్‌కు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. పేషెంట్ అక్కడే చనిపోతే రూ.లక్షల్లో డబ్బులిచ్చి సెటిల్‌మెంట్లు కూడా చేసుకుంటున్నారు. ఇలాంటి ప్రయివేటు ఆస్పత్రులను నియంత్రించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నెలవారీగా వచ్చే మామూళ్లు.. ఆస్పత్రులకు అండగా ఉన్న ప్రభుత్వ నేతల ఒత్తిళ్ల నడుమ అది తమ పని కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. చాలా ఆస్పత్రులకు, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, మెడికల్ షాపులకు రిజిస్ట్రేషన్లు, పర్మిషన్లు లేకున్నా పట్టించుకోవడం లేదు. పేషెంట్ల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు.

నాన్ డాక్టర్స్ ఆస్పత్రుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిఎస్.రావు

నాన్ డాక్టర్స్ ఆస్పత్రుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోగులను ఆస్పత్రిలో చేర్పించే సమయంలో పూర్వాపరాలు తెలుసుకోవాలి. నాన్ డాక్టర్స్ ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇలాంటి ఆస్పత్రులపై అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలి.

బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్ బైక్‌పై మంచిర్యాల వైపు వస్తుండగా.. అదుపుతప్పి గాయాల పాలయ్యాడు. స్థానికులు వెంటనే మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా.. అక్కడే కాచుకుని ఉన్న ఓ అంబులెన్స్ డ్రైవర్ బాధితుని బంధువులతో మాట కలిపి కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేయించాడు. వారంపాటు వైద్యం అందించిన సదరు ఆస్పత్రి యాజమాన్యం శ్రీనివాస్‌కు స్కానింగ్, చిన్న సర్జరీ, మందులు, ఇతర ఖర్చులు కలుపుకుని రూ.1.20లక్షల బిల్లు వేసింది. ఇంత పెద్దమొత్తంలో బిల్లు ఏంటని ప్రశ్నించి.. చివరకు అప్పుజేసి డిశ్చార్జ్ అయ్యాడు. ఇది ఒక్క శ్రీనివాస్ ఉదంతమేకాదు.. యాక్సిండెంట్, ఇతర అనారోగ్య సమస్యలతో రెఫరల్‌గా వచ్చే ఏ రోగికి అయినా రూ.లక్షకుపైగా బిల్లులు వేస్తున్న తీరు కరీంనగర్ జిల్లాలో షరామామూలుగానే మారిపోయింది.

టర్కీ భూకంపం ఎఫెక్ట్
కోటి యాభై లక్షల మంది నిరాశ్రయులు

అంకారా : టర్కీ, సిరియాల్లో సంభవించిన భూకంపాల వల్ల లక్షలాది ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఈ తీవ్ర భూకంపాల వల్ల టర్కీలో కోటి యాభై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈ ప్రకృతి ప్రకోపానికి ఇండ్లు కోల్పోయిన వారికి.. తిరిగి ఇండ్లు నిర్మించి ఇస్తామని ఆ దేశ ప్రధాని ఎర్డోగాన్ ప్రకటించారు. ఇక ఈ తీవ్ర భూకంపాలకు వేలాదిమంది మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజా లెక్కల ప్రకారం టర్కీలో 44,218 మంది మృతి చెందగా, సిరియాలో 5,914 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే టర్కీలో ఈ ఏడాది జూన్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎర్డోగన్ ప్రభుత్వం ఎన్నికల లక్ష్యంగా గృహాల పునర్నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేస్తున్నది. అయితే ఓట్ల కోసమే ఇండ్లను వేగంగా నిర్మించకుండా.. భద్రతపై దృష్టి పెట్టాలని అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక నిపుణుల అభిప్రాయాలపై అధికారులు స్పందించారు. 'ఇప్పటికే అనేక ప్రాజెక్టుల కోసం టెండర్లు, కాంట్రాక్టులు జరిగాయి. వాటి ప్రక్రియ చాలా వేగంగా జరుగుతున్నది. నిర్మాణాల భద్రతపై ఎటువంటి రాజీ ఉండబోదని.. భద్రతతోనే నిర్మాణాలు జరుగుతాయని' ఓ అధికారి తెలిపారు.

మట్టిలో కలిపేస్తా...

(మొదటిపేజీ తరువాయి)

'బాధితురాలి కుటుంబం ఆరోపించిన అతిక్ అహ్మద్, సమాజ్ వాదీ పార్టీ పెంచి పోషిస్తున్న మాఫియాలో భాగం కాదా?' ఆ మాఫియా వెన్ను విరిచేందుకే మేం కృషి చేస్తున్నాం అన్నారు. మాఫియా గురించి ఆయన మాట్లాడుతూ.. 'స్పీకర్ సార్, అన్ని ప్రొఫెషనల్ క్రిమినల్స్, మాఫియాకు గాడ్ ఫాదర్ ఆయనే. వారి సిరల్లో నేరాలున్నాయి. ఈ రోజు నేను ఈ సభకు చెబుతున్నా.. ఈ మాఫియాను మట్టి కరిపిస్తా' అని ఉద్వేగంతో యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

కాగా, సీఎం యోగి వ్యాఖ్యలతో సభలో గందరగోళం చెలరేగింది. దీంతో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ సభలో మాట్లాడుతూ.. 'నేరస్తులు మీ వాళ్లే' అంటూ ఎదురుదాడికి దిగారు. 'రామరాజ్యం'లో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని అఖిలేశ్ ఆరోపించారు. 'పట్ట పగలే కాల్పులు జరుగుతున్నాయి. బాంబులు విసురుతున్నారు. సాక్షిని చంపారు. పోలీసులు ఏం చేస్తున్నారు? ప్రభుత్వం ఏం చేస్తోంది? డబుల్ ఇంజన్‌లు ఎక్కడ ఉన్నాయి? ఇది సినిమా షూటింగా?' అంటూ మండిపడ్డారు.

మరోవైపు సీఎం యోగి మళ్లీ ఘాటుగా స్పందించారు. అతిక్ అహ్మద్ మాఫియాను పెంచి పోషించింది, రక్షించేది సమాజ్‌వాదీ పార్టీ అని విమర్శించారు. వారు ఇప్పుడు మాపై వేలు చూపుతున్నారంటూ ఎద్దేవా చేశారు. దోషులను వదిలి పెట్టబోమని ఆయన అన్నారు. మాఫియా, నేరాలపై తమ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్ పాలసీ'ని అమలు చేస్తున్నదని చెప్పారు. ప్రయాగ్‌రాజ్ విషయంలో కూడా ప్రభుత్వం దీని ప్రకారం వ్యవహరిస్తుందని అన్నారు. 'బీఎస్పీ ఎమ్మెల్యే హత్యా ఘటనలో పాల్గొన్న వారిని సమాజ్‌వాదీ పార్టీ పెంచి పోషించలేదా? సమాజ్‌వాదీ పార్టీ ఆయనను (అతిక్ అహ్మద్) ఎంపీ చేసింది' అని ఆదిత్యనాథ్ విమర్శించారు. ఈ సందర్భంగా 'నువ్వు సిగ్గుపడాలి, నీ తండ్రిని కూడా నువ్వు గౌరవించలేదు' అని అఖిలేష్ యాదవ్‌ను ఉద్దేశించి సీఎం యోగి అన్నారు. దీంతో సభలో మరోసారి గందళగోళం చెలరేగింది.

అడవుల్లో ఎదురు కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

అకస్మాత్తుగా అడవి నుంచి బుల్లెట్లు దూసుకొచ్చాయని, ఎదురు కాల్పులు జరిపే లోపే ఐదుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ముగ్గురు మృతిచెందారని ఐజీ వివరించారు. జేగురుగొండ నివాసి డీఆర్‌జీ ఎస్ఐ రామురామ్ నాగ్, అసిస్టెంట్ కానిస్టేబుల్ వంజం భీమా నివాసి చిన్నల్నార్ మార్కగూడ, కుంజం భీమా జేగురుగొండ నివాసి చనిపోయారు. ఈ సమయంలోనే ఆ ప్రాంతం నుంచి జవాన్ల ఆయుధాలను మావోయిస్టులు ఎత్తుకెళ్లారని ఐజీ తెలిపారు.



ఆలిండియా ఐఎన్‌టీయూసీ సెక్రెటరీగా ఈ.శ్రీధర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ సెక్రెటరీగా ఈ.శ్రీధర్ ఎన్నికైన శుభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-327 రాష్ట్ర నాయకులు ఆయనకు బోకే అందించి శాలువాతో సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-సరూర్ నగర్

సరూర్ నగర్‌లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిద్దామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ మైనార్టీ నాయకులు మహమ్మద్ సలీం శనివారము మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సరూర్ నగర్ డివిజన్లో గల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. మాట్లాడుతూ వేసవికాలంలో నీటి ఎద్దడి



లేకుండాల ప్రతిరోజు ఇంటింటికి మంచినీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూమి విక్రయిస్తున్న ముఠా

- ఆరుగురి నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నకిలీ డాక్యుమెంట్లతో భూ దందా చేస్తున్న తొమ్మిది మంది ముఠాలోని ఆరుగురు నిందితులను మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ, బీబీనగర్ సివిల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నకిలీ డాక్యుమెంట్లు, రూ.7లక్షల నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ నిందితుల వివరాలను వెల్లడించారు. చేర్యాల్‌కు చెందిన డీ.దామోదర్ రెడ్డి, రాఘవపూర్‌కు చెందిన డి.సత్తిరెడ్డి, రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ నసీర్, సనత్‌నగర్‌కు చెందిన ఎండీ షోకత్ అలీ, కర్నూల్‌కు చెందిన సి.రాము, కొండాపూర్‌కు



చెందిన వి.రాములు, యూసూఫ్‌గూడకు చెందిన జి.రమేష్, సికింద్రాబాద్‌కు చెందిన ఎండీ ఇబ్రాహీం, వెంకట్‌గిరికి చెందిన వి.బాలక్రిష్ణ కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఖాళీ స్థలాలు, యాజమానులు లేని ప్లాట్లు, చాలాకాంల నుంచి భూమి, ప్లాట్‌ను చూసుకోని వాటిపై కన్నేసేవారు. వాటికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లను, సేల్ డీడీలు, జీపీఏతోపాటు అసరమైన పత్రాలను తయారు చేసి అమాయకులకు విక్రయిస్తున్నారు. ఇదే తరహాలో రాఘువాపూర్ గ్రామంలో 2420 గజాల ప్లాట్‌పై కన్నేశారు. చాలా రోజుల నుంచి ప్లాట్ యజమానులు రాకపోవడంతో నకిలీ డాక్యుమెంట్లను తయారు చేశారు.

అమాయకులకు రూ.65లక్షలకు విక్రయించారు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ, బీబీ నగర్ సివిల్ పోలీసులు తొమ్మిది మంది ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేశారు. సయ్యద్ నజీర్ మృతిచెందాడన్నారు. ఇక పరారీలోవున్న వి.బాలక్రిష్ణ, ఎండి ఇబ్రాహీం కోసం గాలిస్తున్నామని తెలిపారు. భూములు, ప్లాట్‌ను కొనుగోలు చేసేముందు అన్ని పత్రాలను పరిశీలించాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ గిరీధర్, ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్ఐ కే.సైదులు, బీబీనగర్ ఎస్ఐ జీ.రఘు రాముడు, పీ.వాసుదేవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలి

హైదరాబాద్ ఆర్జేడీ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులు చక్కటి మార్కులతో ఉత్తీర్ణత సాధించే విషయంలో ఉపాధ్యాయులందరూ శ్రద్ధ పెట్టాలని హైదరాబాద్ ఆర్జేడీ ఈ.విజయలక్ష్మి కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల అమీర్‌పేట్-1, ప్రాథమిక పాఠశాల జవహర్ నగర్‌లో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన పేరెంట్స్ సమావేశానికి ఆర్జేడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉదయం, సాయంత్రంపూట విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్‌లో ఎటువంటి అవాంతరాలు లేకుండా జాగ్రత్త వహించాలని ఉపాధ్యాయులను ఆమె ఆదేశించారు. విద్యార్థులందరూ పాఠశాలకు విధిగా హాజరై వివిధ సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. పరీక్షా కాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచడానికి తీసుకుంటున్నటువంటి కార్యక్రమాలను ఈ



సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ వివరించారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించటం, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు స్నాక్స్ అందించడం, నిరంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమవుతూ ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రగతిని వివరించడం లాంటి అనేక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సింహాచలం, శైలజ, పద్మావతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర పాల్గొన్నారు.

అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.60లక్షల విలువగల 200కిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర శివార్లో గంజాయి స్మగ్లిగ్ చేస్తున్న అంతరాష్ట్ర ముఠా గుట్టును బోనగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ సివిల్ పోలీసులు రట్టు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.60లక్షల విలువగల 200కిలో గంజాయితోపాటు ట్రాలీ ఆటో, సెల్‌ఫోన్లు, కత్తితోపాటు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేరేడ్‌మెంట్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ నిందితుల వివరాలను వెల్లడించారు. ముంబాయ్‌కి చెందిన షేక్ మొహ్మద్ ఇబ్రాన్, రుక్మద్దీన్ అబ్దుల్ రజాక్ షేక్, అహ్మద్ మొహమ్మద్ ఇషాక్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఒడిస్సానుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న నిందితులు నగర శివారు నుంచి ముంబాయ్‌కి తరలిస్తున్నారు. సమాచారం



అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పరారీలోవున్న ముంబాయ్‌కి చెందిన జిల్లా ఆదిత్య, నుస్రో కోసం గాలిస్తున్నామని సీపీ తెలిపారు. ఇదిలావుండగా మరో ముఠా నుంచి రూ.3లక్షల విలువగల 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. ఎస్‌వోటీ, కీసర పోలీసులు బండ్లగూడకు చెందిన బారిక్ జగన్నాథ్ అనే నిందితున్ని అరెస్టు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ వి.సత్యనారాయణ, డీసీపీ ఆర్.గిరిధర్, ఇన్‌స్పెక్టర్ జీ.నవీన్ కుమార్, ఎస్ఐ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో



రవాణాశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) ఆదిలాబాద్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్‌కి హెచ్ఎస్ఎస్ఐఏ ఫౌండేషన్ 7వ వార్షిక అవార్డు వేడుకల్లో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. హెచ్ఎస్ఎస్ఏఐ ఫౌండేషన్ (ఆరోగ్యం, భద్రత, పర్యావరణం, సుస్థిరత) వార్షిక అవార్డు వేడుకలు శుక్రవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన సందర్భంగా డాక్టర్ పుప్పాల శ్రీనివాస్‌కు ఈ అవార్డు ఇచ్చారు. ఎన్నో ఏండ్లుగా రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా పనిచేయడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో ప్రసంగించి, పరిశోధనలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించి తన అనుభవాన్ని పంచుకోవడంతో పాటు రోడ్డు భద్రత ప్రమాణాలను మెరుగు పరచడంలో, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ఆ ప్రమాదాలు తగ్గించి ప్రాణాలు కాపాడేందుకు గణనీయంగా కృషి చేసినందుకు డాక్టర్ శ్రీనివాస్ పుప్పాలకు ఈ అవార్డు ప్రదానం చేశారు.





ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. వారితో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

-నవతెలంగాణ,బోడుప్పల్

ప్రజా సమస్యలు గాలికొదిలిన కేసీఆర్ సర్కారు

బోడుప్పల్ ప్రజా గోస సభలో బీజేపీ చీఫ్ బండి సంజయ్

నవతెలంగాణ-బోడుప్పల్



ప్రజా సమస్యలు గాలి కొదిలి కమీషన్ల కోసం పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంటున్న కేసీఆర్ సర్కారు త్వరలోనే పతనం కానుందని బీజేపీ తెలంగాణ చీఫ్ బండి సంజయ్ అన్నారు. శనివారం నాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన వక్ఫ్ భూమి బాధితుల గోస - బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల క్రితం లే అవుట్లకు అనుమతులు ఇచ్చి, ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నేడు అదే భూముల వక్ఫ్ స్థలాలు అంటూ రిజిస్ట్రేషన్లు నిలిపి బోడుప్పల్ లోనే సుమారు 7 వేల కుటుంబాలను కేసీఆర్ సర్కారు గోస పెడుతుందని వాపోయారు. వక్ఫ్ భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం కోసం బీజేపీ పక్షాన పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పెద్ది మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు సామల పవన్ రెడ్డి, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బీజేపీ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శులు ఏర్పుల మహేష్, డి.వెంకటాచారీలతో పాటు వక్ఫ్ భూమి బాధితుల జేఏసీ నేతలు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ-సంతోష్‌నగర్

గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ ఆఫీసులో గత మూడు రోజుల ముందు వరంగల్ మెడికల్ కాలేజీలో ప్రీతిబాయ్ అనే విద్యార్థినిపై సీనియర్ విద్యార్థి ఆత్మహత్యకు గురి అయ్యి నిమ్స్ హాస్పిటల్‌లో ఉన్న ప్రీతి ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి నాణ్యమైన వైద్యం అందించి నిందితుడైన సీనియర్ విద్యార్థిపై చట్టపరమైన చర్య తీసుకొని ప్రీతి అనే విద్యార్థినికి న్యాయం చేకూర్చాలని, లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఐక్యం చేసి, కుటుంబానికి ఆదుకునేంతవరకు పోరాటం ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వానికి



హెచ్చరించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్, జిల్లా కార్యదర్శి బాలునాయక్, నాయకులు గిరిజన సంఘం సహా కార్యదర్శి ఆర్.శేఖర్ నాయక్, సంఘ నాయకులు చందులాల్ వంతు నాయక్, మహిళా సంఘం అధ్యక్షులు ఎం.మీనా, సీఐటీయు కార్యదర్శి శ్రావణ్ కుమార్, హాము నాయక్ పాల్గొన్నారు.

ప్రస్తుత రాజకీయాలు, పార్టీ సంస్థాగత విషయాలపై తీర్మానాలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఛత్తీస్‌గడ్ రాష్టం రాయ్‌పూర్‌లో ఫిబ్రవరి 24,25,26 తేదీల్లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు ఏఐసీసీ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలకు టీపీసీసీ ప్రతినిధిగా ఇబ్రహీంపట్నం నియోజికవర్గం నుండి పాల్గొనడం జరిగిందన్నారు. ప్లీనరీ సమావేశాల్లో ప్రస్తుత రాజకీయాలు, పార్టీ సంస్థాగత విషయాలపై తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు, తెలంగాణలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్



రెడ్డి నిర్వహిస్తున్న యాత్రకు ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, కేంద్రంలో, రాష్ట్రంలో వారి నాయకత్వాన కాంగ్రెస్ అధికారంలో రావడం ఖాయమన్నారు.

లింగోజిగూడ డివిజన్ లో ప్రజాగోస-బీజేపీ భరోస

నవతెలంగాణ-ఎల్బీనగర్

రాకేష్ యాదవ్, కృష్ణారెడ్డి శక్తి కేంద్రాల ఇన్‌చార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి కేంద్ర కార్నర్ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి హాజరైనారు. జీహెచ్ఎంసీని దివాళా తీయించిన దగాకోరు ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు.

రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం కోసమే అధికార పార్టీలోకి పోతున్నట్టు చెప్పిన ఎమ్మెల్యే ఇంకా ఆ సమస్య పరిష్కరించలేదు అన్నారు. సమస్య పరిష్కరించకుంటే పదవికి రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే.. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మోసం చేయడం కొరకే తప్పుడు 118 జీవోను తీసుకొచ్చారన్నారు.డబుల్ బెడ్ ఇళ్ల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం పెదలను వంచించిందన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని కూడా రాష్ట్ర ప్రజలకు అందకుండా చేసిన దుర్గార్గపు చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ తీరు పన్నులు ఫుల్ పనులు నిల్ అన్న చందంగా ఉందన్నారు. 58, 59 జీవోల ద్వారా పేదల నుండి ముకు పిండి మరీ డబ్బులు వసూలు చేసి ఖజానా నింపుకోవాలనే దుర్మార్గపు ఆలోచనలో కేసీఆర్ ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సవినియోగం చేసుకోవాలన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పేదలు రూ.5 లక్షల వరకు ప్రభుత్వ, ప్రయివేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ భాస్కర్, కృష్ణం రాజు , హరి ప్రసాద్ , మల్కాజ్గిరి కుమార్, కిరణ్ యాదవ్ , సాయి యాదవ్ తడి తరులు పాల్గొన్నారు.



ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో టీపీసీసీ ప్రతినిధి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ,బడంగ్‌పేట్

జాయింట్ వెంచర్‌లోకి మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్స్, శ్రీ మహాలక్ష్మి ఐ హాస్పిటల్

నవతెలంగాణ-వనస్థలిపురం

నగరంలోని మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్, వనస్థలిపురం డివిజన్‌కి చెందిన ప్రఖ్యాత నేత్ర సంరక్షణ ఆసుపత్రి శ్రీ మహాలక్ష్మి ఐ హాస్పిటల్ నగరంలోని ప్రజలకు నాణ్యమైన కంటి సంరక్షణను అందించేందుకు జాయింట్ వెంచర్‌లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా వనస్థలి పురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్‌లో విస్తరించి ఉన్న 35 ఆసుపత్రులతో మ్యాక్స్ విజన్ కంటి సంరక్షణలో అగ్రగామిగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యులు మహాలక్ష్మి ఐ హాస్పిటల్ డాక్టర్ కోటిపల్లి సుబ్బారావు మాట్లాడుతూ 33 సంవత్సరాల నుంచి సూపర్ స్పెషాలిటీ కంటి సంరక్షణ వనస్థలిపురం ప్రజలకు అందిస్తుందని, ఈ కేంద్రం ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పథకాలతో అనుసంధానం చేయబడిందని, గత మూడు దశాబ్దాలుగా లక్షలాది మంది రోగులకు కంటి శ్లోకంతో పాటు కంటి వ్యాధులకు చికిత్స అందించినట్లు ఆయన తెలియజేశారు. మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సీఈవో సుధీర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం మా బ్రాండ్‌కి పుట్టినిల్లు అని, గత 28



ఏళ్లగా మా వ్యవస్థాపకుడు డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో, ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ టీం అండగా, ప్రముఖ వైద్య బృందాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఇదేవిధంగా ఉన్నతమైన సేవలు వనస్థలిపురంవాసులకు అందించాలన్న ఉద్దేశంతో మహాలక్ష్మి ఐ ఆసుపత్రి డాక్టర్ సుబ్బారావుతో కలిసి ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. సంయుక్తంగా కంటి శుక్లాలు, రిఫ్రక్టివ్ ఎర్రర్స్, పీడియాట్రిక్ ఐ కేర్, లాసిక్, రెటీనా, కార్నియా, ఓక్లియో ప్లాస్ట తదితర వైద్యాలకు చికిత్స ఆధునిక పద్ధతులతో నిర్వహించబడునని తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్స్ జి.లతా, టి.సుభాష్, గుర్రం మురళీమోహన్, విసిటింగ్ కన్సల్టెంట్ డాక్టర్స్ సత్యప్రసాద్, శ్రీదేవి వేణుగోపాల్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

శ్రేయాస్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్-2023 కార్యక్రమం



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం హెచ్‌ఆర్ కాంక్లేవ్ - 2023 కార్యక్రమం నిర్వహించారు. డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈఓ డా.శ్రీరామ్ బిరుదవోలు, యునైటెడ్ హెల్త్ గ్రూప్ హెచ్‌ఆర్ డైరెక్టర్ మిస్టర్ మయాంక్ గుప్త, టెక్ మహీంద్రా గ్లోబల్ హెడ్ వినయ్ అగర్వాల్, ఎడిపి సీనియర్ డైరెక్టర్ సోమసుందర్ కొండూరి, హనీవెల్ ఇంజినీరింగ్ మేనేజర్ ధనుంజయ కుమార్ మొదలగు ఈ పారిశ్రామిక నిపుణులు హాజరై ప్రసంగించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ అండ్ దేర్ ఇంపాక్ట్ ఆన్ ది ఫ్యూచర్ ఆఫ్ వర్క్, ఏ స్కిల్స్ విల్ ఇన్ డిమాండ్, అనే అంశాన్ని అన్వేషించడం ద్వారా అంతర్ దృష్టి, ఆలోచింపజేసే అనుభవాన్ని లక్ష్యంగా ఉపన్యాసించారు. ప్రపంచీకరణ కేంద్రంగా సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తూ లక్ష్య సాధనలో ముందుండాలన్నారు. క్రమంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఆధునికీకరణించుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ హృదయ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచి నైపుణ్యంతో కూడిన విద్య శివాని కళాశాల సొంతం

చైర్మెన్ డా.పి.రాంరెడ్డి

నవతెలంగాణ-సరూర్‌నగర్

మంచి నైపుణ్యంతో కూడిన విద్యను విద్యార్థులకు అందజేయడం శివాని మహిళా కళాశాలల సొంతమని చైర్మెన్ డాక్టర్ పి.రామ్ రెడ్డి అన్నారు. శివాని జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆర్కే పురం లోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి చైర్మెన్ రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాని కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ నగరం అంతా శివాని గ్రూప్ ఆఫ్ సంస్థలు స్థాపిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ కళాశాల దీటుగా శివాని కళాశాలలో విద్యను అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో తమ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా



చాటుతున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాలలో కూడా మంచి నైపుణ్యత కూడిన విద్యను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ వేదిరే సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు కిడ్నాపైన బాలుడు

మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఐదేండ్ల బాలుడి అపహరణ కేసును సైదాబాద్ పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. రూ.10 వేలకు విక్రయించిన వ్యక్తిని అరెస్టు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. సైదాబాద్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ రూపేశ్ వివరాలు వెల్లడించారు.



శివరాత్రి పండుగ సందర్భంగా శంకేశ్వరబజార్లోని శివాలయం వద్ద పార్ధ జంగయ్య, లక్ష్మి బిక్షాటన చేసుకోవడానికి వచ్చారు. బిక్షాటన చేసుకునే క్రమంలో వీరికి నల్గొండ జిల్లా లింగోటం గ్రామానికి చెందిన కడ మంచి పాండు (28) పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో అతను మద్యం ఇప్పిస్తానని చెప్పడంతో లక్ష్మి తన కుమారుడు రాంచరణ్‌ను తీసుకొని చంపాపేట రాఘవేంద్ర వైన్స్ వద్దకు వెళ్లింది. మద్యం సేవించిన మత్తులో లక్ష్మి ఉండగా, ఆమె వద్ద ఉన్న ఐదేండ్ల రాంచరణ్‌ను పాండు తనతోపాటు ఎత్తుకెళ్లాడు. తన కుమారుడు కన్పించటం లేదని బాధితురాలు సైబాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అడిషనల్ ఇన్స్‌పెక్టర్ బండారు చంద్రమోహన్ నాలుగు ప్రత్యేక టీంలను రంగంలోకి దింపారు. సీసీ ఫుటేజ్ దృశ్యాల ఆధారంగా బాలుడి ఆచూకీ తెలుసుకున్నారు. నల్గొండ జిల్లా మామిళ్లగూడెం ఎస్ఎల్బీసీ కతల్గాడకు చెందిన స్క్రాప్ వ్యాపారి నర్సింహకు రూ.10వేలకు విక్రయించి, తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. పాండును అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో బాలుడిని విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. ఈ కేసును ఛేదించడంలో పోలీసులకు సహకరించిన మణితేజ, జెస్పాల్ సింగ్, కిశోర్లను డీసీపీ అభినందించారు. నిందితుడు కడమంచి పాండు, నర్సింహ్మాను అరెస్ట్ చేశారు. బాలుడిని తల్లి లక్ష్మికి అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది. ఈ సమావేశంలో మలక్‌పేట ఏసీపీ శివశంకర్, సైదాబాద్ ఇన్స్‌పెక్టర్ సుబ్బరామిరెడ్డి, అడిషనల్ ఇన్స్‌పెక్టర్ బండారు చంద్రమోహన్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోల్

తెలంగాణా రాష్ట్రంలో సీఎం కే.సీ.ఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలల కు ధీటుగా అభివృద్ధి చెందుతూ పేద విద్యార్థుల పట్ల వరంగా మారుతున్నాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. శనివారం హైదరాబాద్ బ్లూమ్స్ హైస్కూల్లో అన్యువల్ డే సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద, కొత్తపేట డివిజన్ టిఆర్ఎస్ పార్టీ మహిళా ప్రెసిడెంట్ శ్వేతా రెడ్డి, స్కూలు యజమాన్యం సునీల్ రెడ్డి, భాష మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకులు వరుణ్, స్టూడెంట్స్ పేరెంట్స్ కి పేరెంట్స్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ స్కూల్లను కూడా ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. మన ఊరు మనబడి కార్యక్రమం దేశంలోని ఎక్కడలేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను పేదరికంలో ఉన్న విద్యార్థులు అందరూ కూడా పొందుతిన్నారని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి భావి పౌరులు పుట్టిన ఊరును మరువద్దు చదువు చెప్పిన గురువును మరవద్దు కన్న తల్లిదండ్రులను మరవద్దు అనే సంకల్పంతోటి ప్రతి ఒక్క విద్యార్థి కూడా నిర్వహించుకోవాలని సూచించారు. మీరందరూ కూడా తల్లిదండ్రులకు మంచి పేరు వచ్చే విధంగా ఒక పైలట్గా ఒక డాక్టర్ గా ఒక ఇంజనీర్గా ఒక స్పోర్ట్స్ మెన్‌గా రాబోయే రోజులలో మీరందరూ కూడా కావాలని ఆకాంక్షిస్తూ పిల్లలందరినీ ఆశీర్వదిస్తూ విద్యతోపాటు అన్ని రంగాలలో ముఖ్యంగా స్పోర్ట్స్ లో కూడా ముందుండాలని అన్నారు.

ఉమెన్ ఎంట్రెప్రెన్యూర్ సమ్మిట్-2023



నవతెలంగాణ-కాప్రా

అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలోనైక్ బిజినెస్ పార్క్ ఈసీఎల్‌లో జరిగిన ఉమెన్ ఎంట్రెప్రెన్యూర్ సమ్మిట్ -2023 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో ఈ సమ్మిట్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మహిళలు పురుషులతోపాటు అన్ని రంగాల్లో వారికి దీటుగా రాణించాలన్నారు. అనేక ఉద్యోగ అవకాశాల్లో సమానంగా వారితో పాటు పని చేయాలనీ, ఇలాంటి అనేక సదస్సులు నిర్వహించుకుని మీలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ప్రెసిడెంట్ ఉషా దేరం, తెలంగాణ ఇండస్ట్రియల్ లిస్ట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, బీజేపీ స్టేట్ సెక్రెటరీ కొల్లి మాధవి, జ్యోత్స్న, ఈక్విటస్ బ్యాంక్ మేనేజర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్‌కు సన్మానం

నవతెలంగాణ-నాచారం

కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం పాలక మండల సభ్యుడిగా ఎన్నికైన నాచారంకు చెందిన ఎర్ర గొల్ల మల్లేష్ యాదవ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమం నేడు 12 గంటలకు నాచారం భద్ర గార్డెన్ వైద కన్వెన్షన్ హాల్ నిర్వహిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హాజరవుతున్నట్టు వెల్లడించారు. యాదవ సోదరులు, స్థానిక బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే సాయన్న కుమార్తె, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన 16 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్

మన ఊరు-మన బడి పనులను పూర్తి చేయాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా మన ఊరు-మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారితో కలిసి మన ఊరు-మన కార్యక్రమంలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు-మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన మార్చి నాటికి పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 176 పాఠశాలలను మన ఊరు-మన బడి కార్యక్రమానికి ఎంపిక చేసినట్టు తెలిపారు. పనుల పురోగతిపై మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పనులు పూర్తి కాలేదనీ, ఈ విషయంలో అధికారుల అలసత్వంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. పనులు జరుతున్న వివరాలను ఎప్పకటిప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలనీ, ఈ విషయంలో నిర్లక్ష్యం చేయరాదని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి నిధుల కొరతలేదనీ, పర్యవేక్షణ లోపంతోనే ఆలస్యం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రతి శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పురోగతి గురించి తెలుసుకుంటామనీ, అధికారులు సమన్వయంతో పని చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తేనే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. వేగవంతంగా పనులు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ కుమారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్మోహన్ రావు, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోలను సవరించాలి



నవతెలంగాణ-నాచారం

కనీస వేతనాల జీవోను సవరించాలనీ, కార్మికులకు రూ.26 వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాచారం ప్రధాన కార్యదర్శి పి.గణేష్, కార్యదర్శి అధ్యక్షతన నాచారం చౌరస్తాలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్ర శేఖర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 73 రకాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ జీవోలు కాలం పరిమితి ముగిసి ఏండ్లు గడుస్తున్నా ఒక్క జీవోను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సవరించలేదన్నారు. 2021లో ఐదు జీవోలను సవరించి కనీస వేతనం రూ.19 వేలుగా నిర్ణయించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారనీ, వాటిని కూడా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం పక్కకు పెట్టినట్టు తెలిపారు. కార్మిక వర్గం హక్కుల కోసం, చట్టాల పరిరక్షణ కోసం మార్చి 1వ తేదీన చలో కలెక్టర్ ముట్టడి మహా ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. సీఐటీయూ నాచారం కమిటీ అధ్యక్షులు వైస్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ నాచారం పారిశ్రామిక ప్రాంతంలో కనీస వేతనం ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను ఏ ఒక్క పరిశ్రమల్లో అమలు చేయడం లేదన్నారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు చేసే పనుల్లో వినియోగిస్తూ తప్ప కొత్తగా పర్మినెంట్ కార్మికులను తీసుకోవడం లేదన్నారు. 12 గంటల పని విధానం ఎక్కువ పరిశ్రమల్లో అమలు చేస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను భంగం కలిగిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం కార్మికుల ఛలో ఢిల్లీ ఏప్రిల్ 5వ తేదీన 10 లక్షల కార్మికులతో పెద్ద ఎత్తున జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించి కార్మికులను ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యం గౌడ్, ఎండీ అబ్దుల్లా, పి.బాబు, మహంకాళి శ్రీనివాస్, బి.శ్రీనివాస్, బాబు రెడ్డి, ఉపేందర్, పల్లవి, లలిత, లక్ష్మీ, కవిత, నాగమణి, బుజ్జమ్మ, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీస్ ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

యశోదా గ్రూపు ఆస్పత్రుల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మలక్‌పేట యశోదా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను నేషనల్ హైవే 65పై, హైదరాబాద్ నుంచి విజయవాడ మధ్య నల్లగొండ జిల్లాలో రెండు అంబులెన్సులను ఒకటి గుండ్రాంపల్లి వద్ద, మరొకటి కట్టంగూర్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌లను శనివారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించి మాట్లాడారు. 'హైవే' పై తరచు జరిగే రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కొంతమంది ఘటనా స్థలంలో ప్రాణాలు కోల్పోతే, చాలా మంది సకాలంలో ఆస్పత్రికి వెళ్ళలేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ముఖ్యంగా ప్రమాదాల్లో గాయపడిన బాధితులను 30 నుంచి 60 నిమిషాల లోపు దగ్గరలోని హాస్పటల్ కు తరలించాలనీ, దీన్ని గోల్డెన్ అవర్ అంటారని చెప్పారు. ఈ సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకుని వెళ్తే.. వైద్యులు తగిన చికిత్సనందించి బతికించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇలాంటి ఘటనలను దృష్టిలోపెట్టుకుని యశోదా హాస్పిటల్స్ యాజమాన్యం మంచి సదుద్దేశంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో దగ్గరలోని ఆస్పత్రికి తరలించేందుకు పూర్తి ఉచితంగా "అంబులెన్స్ సర్వీస్"ను అందుబాటులోకి తీసుకురావడం అభినందించాల్సిన విషయం అని ఎమ్మెల్యే తెలిపారు.

కేపీవీఎస్ మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కాప్రా

ఈ నెల 27, 28 తేదీల్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాలు జనగామలో జరుగనున్నందున మనువాదం రాజ్యాంగం అనే అంశంపై రాష్ట్రస్థాయి సెమినారు నిర్వహిస్తున్నట్టు కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళల బాలపీరు తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఖాసిం, రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు హాజరవుతున్నట్టు తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని తెలియజేస్తున్నా పరిస్థితి ఉందన్నారు. రాజ్యాంగాన్ని మార్చుటకు అనేక కుట్రలకు పాల్పడుతున్న మత ఉన్మాద ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. మనిషిని మనిషిగా చూడని పచ్చి ఫాసిస్ట్ వాద మను స్మృతినీ ప్రవేశపెట్టాలని చూస్తున్నారన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రాచీన భారత రాజ్యాంగం అనే దానిపైన రాష్ట్రస్థాయిలో సభలు సమావేశాలు పెట్టే నీచమైన సంస్కృతిని తెరపైకి తేవడం సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాలకు పాల్పడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వారిని సమాజం నుంచి తరిమేయాలన్నారు. ఏప్రిల్‌లో జరిగే మహనీయుల జయంతుల సందర్భంగా పూలే అంబేద్కర్ జాతరలు నిర్వహించుటకు ప్రణాళిక రూపొందించనున్నట్టు తెలిపారు. పత్రికా ప్రకటన విడుదల చేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కృపాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, అశోక్, బాలయ్య, సాయిచంద్, మహేశ్వరి, మోహన్, నరసింహ, మల్లికార్జున్, స్వామి పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలి

తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) 59 నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు ఇంకా పూర్తి కాని దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలనీ, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 59, రెండు పడకల ఇండ్ల ప్రగతిపై, జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయా మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 59 జీవోకు సంబంధించి ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు సమన్వయంతో వేగవంతం చేసి పూర్తి చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి 59 జీవోలో ఎలాంటి పెండింగ్‌లో ఉండకుండా అర్హులను గుర్తించాలనీ, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ జీవోలో అర్హులైన వారిని గుర్తించిన తర్వాత క్రమబద్ధీకరణకు సంబంధించి వారికి మూడు విడతలుగా డబ్బులు చెల్లించుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఒకేసారి మొత్తం డబ్బులు చెల్లిస్తే 5శాతం డిస్కౌంట్ ఇస్తున్నారనీ, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. రెండు పడకల ఇండ్ల ప్రగతిని సమీక్షిస్తూ ఇండ్ల పట్టాలు అందించిన వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ముగింపు దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆయా మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-నాచారం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మేడ్చల్ జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు జ్యోతి ఉపేందర్ తెలిపారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి, దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సీఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. 2023- 24 ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన ధరలు, సబ్సిడీ, సర్ చార్జీలపై రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలు, పరిస్థితుల ప్రభావంతో వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వృత్తిదారులకు జీవన భారం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం నాయకులు రాపర్తి అశోక్, చంద్రపాల్, వెంకటేష్, అల్వాల బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్ రాజు అన్నారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది సీహెచ్ జ్యోతి, డబ్ల్యుఎస్ఐ మార్గదర్శకత్వంతో పాటు, లక్ష్య జూనియర్ కళాశాలలో చైర్మన్ సిఎ మురళీ వైట్ల, డైరెక్టర్ ఎన్ శివ ప్రసాద్, కళాశాలలో మాజిద్ ఖాన్, చిరంజీవి, చక్రధర్ లు ఎస్ ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ కళాశాలలో రోడ్డు భద్రత, సేఫ్టీ ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్టాఫ్ లైన్ ద్వారా మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్, ట్రిబల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 130 మంది కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల సిబ్బందికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహనను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ప్రస్తుత నేరాలు ముఖ్యంగా సమాజంలో ఆడపిల్లల వల్ల కలిగే మంచి, చెడు పరిణామాల గురించి, క్రమశిక్షణ, ఐక్యత ను వ్యర్థం కాకుండా ఉండేలన్నారు. చిన్నప్పటి నుండి సమయం, వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఉప్పల్ బీ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా రాజన్న



నవతెలంగాణ-నాచారం

కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బీ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పొన్నాల రాజన్న నియమిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు ప్రీతం ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పొన్నాల రాజన్న మాట్లాడుతూ నిక్కార్సైన పార్టీ కార్యకర్తగా నిబద్ధతతో పార్టీ కోసం చేస్తూ ఎందరు ప్రలోభ పెట్టిన పార్టీని వీడకుండా జెండా మోస్తున్న నాయకులను గుర్తించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాబోయే కాలంలో మరింత ఉత్సాహంగా పని చేస్తామన్నారు. నాయకులకు, కార్యకర్తలకు భరోసా భద్రత కాంగ్రెస్ ద్వారానే సాధ్యమన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన పార్టీ రాష్ట్ర జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు ప్రీతం, పత్తికుమార్, బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థులకు స్వచ్ఛందంగా దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

బోగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు తీన్మార్ మల్లన్న టీం స్వచ్ఛంగా దుస్తులను పంపిణీ చేశారు. శనివారం బోగారం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన తీన్మార్ మల్లన్న టీం బృందం పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అక్కడి ఉపాధ్యాయులతో చర్చించారు. పేద విద్యార్థులు, పాఠశాలకు ఎలాంటి సహకారం అవసరం ఉన్నా మల్లన్న టీమ్ దృష్టికి తీసుకువస్తే అందుబాటులో ఉందని తెలిపారు. పేద విద్యార్థులకు మంచి దుస్తులను అందించాలనే తీన్మార్ మల్లన్న సహృదయంతో బోగారం పాఠశాలకు దుస్తులను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు జగదీష్ పాఠశాలకు నాలుగు ఫ్యాన్లు, ఒక్క ప్రొజెక్టర్ కావాలని కోరగా వారంలోగా సమకూరుస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గణేష్, స్టేట్ కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి, సభ్యులు భాను, సందీప్, మహేష్, నవీన్, కృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిస్తున్న బీఎల్ఆర్ ట్రస్ట్



నవతెలంగాణ-నాచారం

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పేద విద్యార్థులకు అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటానని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ భవాని నగర్ కు చెందిన మోహన్ రావు కుమార్తె పిల్లి శ్రావణి నల్లగొండ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో తృతీయ సంవత్సరం మెడికల్ విద్యను అభ్యసిస్తుంది. తండ్రి అకాల మరణం నిరుపేద కుటుంబం కావడంతో తన మెడికల్ విద్యను అయ్యే ఫీజులు మొత్తం బీఎల్ఆర్ ట్రస్టు స్వీకరించిన సందర్భంగా అభినందనీయమని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తెలియజేస్తూ లక్ష్మారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలను ఉన్నత విద్యావంతుడుగా తీర్చిదిద్దాలని లక్ష్యం కోసం బీఎల్ఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరుద్యోగ యువతకు శిక్షణా తరగతులు ఇస్తూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కటార్ల భాస్కర్, అల్లాడి కృష్ణ యాదవ్, కుమార్ యాదవ్, పాస్టర్ సాయిలు పాల్గొన్నారు.

అక్షర అంతర్జాతీయ పాఠశాల ప్రైమరీ స్కూల్ స్పోర్ట్స్ మీట్



నవతెలంగాణ-కాప్రా

ఏ ఎస్ రావు నగర్, అక్షర అంతర్జాతీయ పాఠశాలలో ప్రైమరీ స్కూల్ విద్యార్థినీ విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ అత్యంత ఆహ్లా తభరితంగా జరిగింది. ఈ కార్యక్రమం అక్షర అంతర్జాతీయ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కను ప్రియా వాహి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సీఈఓ మదన్మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల ఆటలు ప్రదర్శించి, అటు తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, పాఠశాల యాజమాన్యాన్ని ఆనంద పరవశంలో ముంచెత్తారు. పాఠశాల సీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలందు తమ ప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే అక్షర అంతర్జాతీయ పాఠశాల, అన్ని బ్రాంచీలలో స్పోర్ట్స్ మీట్ పెట్టి విద్యార్థులలోని ప్రజ్ఞ పాటవాలను, శారీరక మానసిక దారుఢ్యాన్ని పెంపొందింపజేస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కను ప్రియా వాహి మాట్లాడుతూ విద్యార్థులను అన్ని విధాల తీర్చిదిద్దగలిగినప్పుడే పాఠశాల ఉద్దేశం నెరవేరుతుందన్నారు. అందుకు అక్షర పాఠశాల ప్రతినిత్యం పాటుపడుతుందన్నారు. ఆ తర్వాత ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు తదనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టండి



నవతెలంగాణ-నాచారం


మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ బ్లాక్ 1,2,3 కమ్యూనిటీ హాల్ చేపట్టాలని నెహ్రూ నగర్ కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని కొందరు ఆలయాలు, అక్రమ పార్కింగ్ చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తే ప్రజలందరూ ఉపయోగించుకుంటారని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్లినట్టు తెలిపారు. తక్షణమే స్థలంలో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కార్పొరేటర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ నగర్ స్థానికులు బోదాస్ లక్ష్మీనారాయణ, నాగారం బాబు, దుర్గయ్య, రాంపల్లి మల్లేష్ గౌడ్, లింగమ్మ, గోపాల్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడిని ఖండించండి : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

నవతెలంగాణ-కాప్రా

ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడిని ఖండించంచాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ కోరింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలు ఇటీవల జరిగాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్యానెల్ ఎన్నికల పోస్టర్లను ఏబీవీపికి చెందిన రాజేందర్ నాయక్, ఆకాశ్ బాటి, సిద్ధం శుక్లా అనే విద్యార్థులు చింపివేశారు. ఈ పోస్టర్లను చింపవద్దని అడిగిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఆకాశ్ ను మద్యం మత్తులో విచక్షణా రహితంగా దాడి చేసినట్టు తెలిపారు. వారే కర్రలు, రాళ్ళతో యూనివర్శిటీ హాస్టల్స్ కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. వారికి వారే అద్దాలను బద్దలు కొట్టుకుని గాయాలు చేసుకోని ఎస్ఎఫ్ఐ దాడి చేసిందని ప్రకటించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కరోనా సమయంలో విద్యార్థులకు హాస్టల్స్ ఇవ్వాలనీ, యూనివర్శిటిలో ఉన్న హాస్టల్స్, డిపార్ట్మెంట్ సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడిందన్నారు. ఎన్నికలకు ముందే నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్ కూడా ఏబీవీపీ అడ్డుకుందన్నారు. అదే రోజు ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై దాడికి ప్రయత్నం చేశారన్నారు. మళ్ళీ ఎన్నికల ముందు ఈ చర్యకు పాల్పడారు. యూనివర్శిటీలో శాంతియుతంగా ఉన్న వాతవరణాన్ని ఏబీవీపీ ఉద్రిక్తంగా మార్చుతుందన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో విద్యార్థులపై ఏబీవీపీ దాడి చేస్తుందన్నారు. ఒక్క హెచ్‌సీయూలోనే కాదు గతంలో ఢిల్లీ జేఎన్‌యూలో, ఎ.ఎం.యులో కూడా కర్రలు, కత్తులతో దాడి చేశారని గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో శాంతియత వాతవరణం, విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతవరణాన్ని ఏబీవీపీ రెచ్చగొట్టి చెడిపే ప్రయత్నం చేస్తుందన్నారు. దళిత, సామాజిక విద్యార్థుల కూటమితో ఎన్నికల్లో ఉన్న ఎస్ఎఫ్ఐ ప్యానెల్ పై దాడి చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ దాడిని విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు, మేథావులు ఖండించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ కోరుతుందని తెలిపారు.

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-అంబర్‌పేట

12 ఏండ్ల నుంచి దేశంలో వినూత్న కార్యక్రమాలతో పని చేస్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కొత్త కమిటీలను ఎన్నుకుంది. సంస్థ సలహాదారులు శ్రీనువాస్ మాధవ్ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడిగా రాజేంద్ర పల్నాటి, గౌరవ కార్యదర్శిగా వాసిరెడ్డి గిరిధర్, జాతీయ కార్యవర్గసభ్యులుగా కొమటి రమేశ్ బాబు, వరికుప్పల గంగాధర్, జి.హరి ప్రకాశ్, అంజుకర్, జయరాం, ప్రదీప్ రెడ్డి, రమేశ్ నాయక్, చెరుకూరి జంగయ్య, సురేంద్ర, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులుగా కొన్నె దేవేందర్, మారియా అంతోని, బి.రాజేష్, పిడమర్తి స్నిగ్ధ, బి.శ్రీజ, మంత్రి భాస్కర్, చింత శ్రీనువాస్, తెలంగాణ సలహాదారులుగా డా. ప్రతిభాలక్ష్మి, డా.ఇందిరా ప్రియదర్శిని, కానుగంటి రాజు, డా.స్రవంతి, డా.అన్నపూర్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా గంట గీత, సత్తార్, డా.శ్రీవాణి, ప్రసన్న లక్ష్మి, నిహారిక, ఝాన్సీ, సునిత, సంతోషిణి, ప్రగతి, నాగేంద్ర, చింతల్ రమేశ్, శ్రీనువాస్ రావు, లీగల్ కమిటీ కార్యదర్శులుగా కొల్లె భవాని, పంతగాని లక్ష్మికళ, మణిదీప్, మీడియా కార్యదర్శిగా జయరాం, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా శ్రీనివాసరావు, సంపత్, హరి ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సంస్థను బలోపేతం చేయనున్నామని అధ్యక్షుడు రాజేంద్ర పల్నాటి తెలిపారు. సంస్థ సలహాదారుల సలహాలతో మరిన్ని కార్యక్రమాలు చేస్తూ అవినీతి రహిత సమాజం కోసం తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. జాతీయ సలహాదారులుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, మాజీ అడిషనల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా, మాజీ ఆర్టీఐ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, రాజు ఐపీఎస్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, మాజీ ఐఎఎస్ ఆకునూరి మురళితో పాటు మరికొంతమంది ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు సలహాదారులుగా ఉన్నారని తెలిపారు. జిల్లాల కమిటీలను, రెండు తెలుగు రాష్ట్రాల కమిటీలను మార్చిలో ఎన్నుకుంటామని వారు తెలిపారు.

ఘనంగా తొలి వంశ వైద్య అవార్డుల కార్యక్రమం



నవతెలంగాణ-అంబర్‌పేట

తరతరాలుగా ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాచీన విజ్ఞానాన్ని పెంపొందించుకున్న వైద్యుల కృషికి ప్రతిఫలంగా శ్రీ ఆయుర్వేద సంస్థ వంశ వైద్య అవార్డులను నిర్వహించింది. ఈ అవార్డులను తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుధా శేషయ్యన్ అందజేశారు. ప్రముఖ జ్యూరీ ఎంపిక చేసిన వంశ శ్రీ, వంశ రత్న, భైసజ్య విభూషణ్ అవార్డులను ఎంపికైన వారికి ప్రదానం చేశారు. వంశ శ్రీ, వంశ రత్న, భైసజ్య విభూషణ్, వంశ విభూషణ్, భైసజ్య భూషణ్, వంశ భూషణ్ మరియు వంశోదయ అనే 7 విభాగాల కింద అవార్డులను పంపిణీ చేశారు. వంశశ్రీ అవార్డులను హైదరాబాద్‌లోని చరక ఆయుర్వేద ఆశ్రమానికి చెందిన డాక్టర్ గంజాం కృష్ణ ప్రసాద్, ఆయుష్ విభాగం డాక్టర్ గంజాం గాయత్రీ దేవి అందుకున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ గాయత్రీ ఆయుర్వేదిక్ క్లినిక్‌కి చెందిన డాక్టర్ దాసది అవినాష్ కుమార్‌కు వంశ విభూషణ్ లభించింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్ కరతాళధ్వనుల మధ్య అర్హులైన వారికి అవార్డులను అందజేశారు. విజేతలకు అభినందనలు తెలిపిన ఆయన, భారతీయులు సంప్రదాయ జ్ఞానంతో పాటు ఆయుర్వేదం, సిద్ధ వంటి వైద్య విధానాలను అలవర్చుకుంటున్నారన్నారు. ఆయుర్వేదిక్ హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్ కూడా చాలా కొద్ది మందికి అందుబాటులో ఉండే సముచిత కార్యాచరణ నుంచి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రత్యామ్నాయ ఔషధ స్రవంతి వరకు అభివృద్ధి చెందిందనీ, ఇది వ్యాధులు, వ్యాధులకు ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందించిందని తెలిపారు. గౌరవ అతిథి డాక్టర్ సుధా శేషయ్యన్ మాట్లాడుతూ ప్రేరణ, వనరుల కొరత కారణంగా, అనేక వైదిక కుటుంబాలు తమ వారసత్వాన్ని మరచిపోయి ఇతర లాభదాయకమైన వృత్తుల వైపు మళ్లాయన్నారు.



అల్వాల్‌లోని ప్రముఖ ఆలయం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ వంశపారంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైన్వార్, వినయ్ గోపాల్ సైన్ చర్ల తండ్రి రాజా రతన్ గోపాల్ 42వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన పేరిట పూజలు నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్, శివరామ కృష్ణ, సురేందర్ రెడ్డి, రామ్మోహన్, రామారావు పాల్గొన్నారు. -నేరేడ్‌మెట్

విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

నవతెలంగాణ-మెహిదీపట్నం



తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని టీఎస్పీఈజేఏసీ నాయకులు రాజేశ్వర్, యూసుఫ్ బాబా, పిరయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించకుండా ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా రేతి బౌలిలోని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం వద్ద టీఎస్పీఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నుంచే విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్పీఈజేఏసీ నాయకులు మహమూదుల్లా, ఫైజుల్ల ఖాన్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని వినతి

నవతెలంగాణ-ఓయూ



పెంచిన పీజీ మెదటి సెమిస్టర్ పరీక్ష ఫీజులు తగ్గించాలని శుక్రవారం విద్యార్థులు ఓయూలో లేడీస్ హాస్టల్ ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు డీన్ ప్రొ.రాజేందర్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. గతంలో సెల్ఫ్ ఫైనాన్స్ విద్యార్థులకు 2100 నుంచి నేడు రూ.3,250 పెంచడం, రెగ్యులర్ విద్యార్థులకు రూ.1,100 నుంచి రూ.2వేల వరకు మెదటి సంవత్సరం పీజీ విద్యార్థుల మెదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు పెంచడం బాధాకరం అన్నారు. పెంచిన ఫిజులు తగ్గించే వరకు ఉద్యమిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రమంజిల్ కాలనీ పేదల ఇండ్లు కూల్చివేత అక్రమం

సర్కారే ఇండ్ల పట్టాలిచ్చి..

నోటీసు ఇవ్వకుండా ఎలా కూలుస్తారు?

అదనపు కలెక్టర్‌కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

ఎర్రమంజిల్ కాలనీ పేదల ఇండ్లను ఈ నెల 21వ తేదీన అర్ధరాత్రి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వమే కూల్చి వేయడం అత్యంత దుర్మార్గం అనీ, సర్కారే ఇండ్ల పట్టాలిచ్చి.. కనీస నోటీసు కూడా ఇవ్వకుండా ఎలా కూలుస్తారని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. శుక్రవారం సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఖైరతాబాద్ జోన్ కన్వీనర్ జి.కిరణ్, బస్తీవాసులతో కలిసి



హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరేడు దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు 2015లో జీవో 58 కింద బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇండ్ల పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. నిమ్స్ ఆస్పత్రి విస్తరణకు స్థలం అవసరమనే పేరుతో పేదల ఇండ్లను కూల్చి నిలువ నీడ లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంట్లో సామాన్లనూ తీసుకోనివ్వకుండా ముసలి, పిల్లలు అని చూడకుండా అందరినీ రోడ్డు మీద పడేయడం అమానుషం కాదా? అని ప్రశ్నించారు. ఆస్పత్రికి స్థలం అవసరమైతే పేదలకు ప్రత్యామ్నాయం చూపించి తీసుకోవచ్చు కదా? అన్నారు. ఎర్రమంజిల్ కాలనీలో తొలగించిన 30 పేద కుటుంబాలకు తక్షణమే సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలనీ, కూల్చివేతతో నష్టపోయిన కుటుంబాలకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం చేయకపోతే.. పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ఇండ్లు కోల్పోయిన బస్తీవాసులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఏరియా టు హైదరాబాద్



యదేచ్ఛగా గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా

ఆరుగురు ముఠా సభ్యుల్లో నలుగురు నిందితుల అరెస్టు

15 గ్రాముల ఎండీఎంఏ, రెండుకిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గుట్టుచప్పుడు కాకుండా ఏజెన్సీ ఏరియా నుంచి హైదరాబాద్‌కు గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఆరుగురు ముఠా సభ్యుల్లో నలుగురు నిందితులను ఎల్బీనగర్ ఎస్వోటీ, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, రెండుకిలోల గంజాయి, కారుతోపాటు రూ.4,040 నగదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేరెడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ నిందితుల వివరాలను వెల్లడించారు. సరూర్‌నగర్‌కు చెందిన జక్కా సునీల్ సంతోష్‌నగర్‌కు చెందిన ఆరీఫ్ ఖాన్, పహాడిషరీఫ్‌కు చెందిన మాహ్మద్ జాబర్ క్వాడి, సంతోష్‌నగర్‌కు చెందిన మీర్జా ఇస్మాయిల్ అలీ బేగ్, వనస్థలిపురంకు చెందిన షేక్ నోమాన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శత్రు ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కా సునీల్ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, ఆరకులో రూ.2, రూ.4వేలకు కిలో చొప్పున కొనుగోలు చేస్తున్న షేక్ నోమాకు, శత్రుకు పంపిస్తున్నాడు. వారు నగరంలో రూ.15 వేల నుంచి రూ.20వేలకు కిలో గంజాయి చొప్పున మిగితా ముఠా సభ్యులకు, కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్వోటీ, సివిల్ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. విచారణలో ఈ ముఠా సభ్యులు పాత నేరస్తులుగా తేలిందని, గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న షేక్ నోమాన్, శత్రుల కోసం గాలిస్తున్నామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ కే.మురళీధర్, ఏసీపీ డీ.వెంకన్న నాయక్, ఎస్వోటీ ఇన్‌స్పెక్టర్ ఏ.సుధాకర్, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఐ ప్రతాప్ పాల్గొన్నారు.

మతతత్వ ఎజెండాతో దేశ లౌకిక-ప్రజాస్వామ్య వ్యవస్థ, విలువలు, సమాఖ్య వాదానికి విఘాతం



అదానీ, అంబానీలకు దేశ సంపదను దాచుకోగలిగే సౌలభ్యం కల్పిస్తున్న మోడీ

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవా రాజన్

నవతెలంగాణ-ముషీరాబాద్

మతతత్వ ఎజెండా దేశ లౌకిక-ప్రజాస్వామ్య వ్యవస్థకు, విలువలకు, సమాఖ్య వాదానికి విఘాతం కలిగిస్తున్నాయని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవా రాజన్ అన్నారు. కొత్త మాఫియా, క్యాపిటలిజం నిర్మాతలు అదానీ, అంబానీలకు దేశ సంపదను దాచుకోగలిగే సౌలభ్యం ప్రధాని నరేంద్ర మోడీ కల్పిస్తున్నారన్నారు. మోడీ ఒత్తిడితో ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీలు సామాన్య ప్రజల సొమ్మును తీసుకెళ్లి అదానీ కంపెనీల్లో రూ.వేల కోట్లు పెట్టుబడి పెట్టాయనీ, ఇప్పుడు అదానీ కంపెనీలు ఒక్కొకటి దివాళా తీస్తుండటంతో బ్యాంకులు, ఎల్ఐసీ కూడా తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. బ్యాంకులు, ఎల్ఐసీలలో ప్రజలు భద్రపరుచుకున్న వారి కష్టార్జితం సొమ్ముకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ప్రధాని మోడీ మౌనం విడి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభల మూడో సభలో జి.దేవా రాజన్ ప్రారంభోపన్యాసం చేసి మాట్లాడారు. ఈ కాలంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ మరింత బలపడి దేశ ప్రజల ప్రయోజనాల కోసం అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. ప్రజల జీవనోపాధి, జీవన ప్రమాణాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, నిరాశ్రయత దేశ ప్రజలను కోలుకోలేని విధంగా చేస్తున్నాయన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ మితవాద, నయా ఉదారవాద విధానాలు, మతతత్వ ఎజెండా దేశ లౌకిక-ప్రజాస్వామ్య వ్యవస్థకు, విలువలకు, సమాఖ్య వాదానికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. మోడీ నిరంకుశ విధానాలను వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు మాత్రమే గట్టిగా ప్రతిఘటించగలవని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని క్రమబద్ధీకరించడానికి వామపక్ష-ప్రజాస్వామ్య-లౌకిక వేదికను బలోపేతం చేయడం తక్షణ అవసరం అన్నారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికులు, యువకులు, ఇతర శ్రామికుల అన్ని వర్గాల సమస్యలపై, సామాజిక అణచివేతతో బాధపడుతున్న దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీల కోసం నిర్విరామంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఏ.ఐ.ఎఫ్.బి జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిస్వాస్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాలపై వివిధ రాష్ట్ర ప్రతినిధులు చర్చించారు. ఏ.ఐ.ఎఫ్.బి పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి నరేన్ ఛటర్జీ, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి, లక్ష్మీ పాధి (ఒడిశా), కలాథిల్ విజయన్ (కేరళ), కొంబయ్య పాండియన్ (తమిళనాడు), అమెరికా మహతో (బీహార్), కైలాష్ మిశ్రా (యుపి), సిమంత మిత్ర (బెంగాల్), హరేన్ బోర్గోహెయిన్ (అస్సాం), ఎస్.ఎస్.చౌహాన్. (ఢిల్లీ) షాహిద్ మంజూర్ (కాశ్మీర్) తదితరులు ప్రతినిధులు మహాసభ చర్చల్లో పాల్గొని విభజన శక్తుల బారి నుంచి మన దేశాన్ని రక్షించేందుకు 2024లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు తక్షణ అవకాశంగా నిలుస్తాయని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షులు, మహాసభల ఆహ్వాన సంఘం సభ్యులు సుందర రామరాజు, కె.తేజదీప్‌రెడ్డి, బి.రాములు యాదవ్, గవ్వ వంశీధర్ రెడ్డి, ఫిరంగి రాములు, కొత్తపల్లి రాజు, అందే బీరయ్య, కొమ్మూరి వెంకటేష్ యాదవ్, ఆవుల శ్రీకాంత్ యాదవ్, సయ్యిద్ తౌఫిక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

బావ ప్రకటన స్వేచ్ఛపై దాడి తీవ్రమైనది

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బావ ప్రకటన స్వేచ్ఛపై దాడి తీవ్రతరమైందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆజాం అలీ సంస్మరణ సందర్భంగా భావ ప్రకటన స్వేచ్ఛపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ నిఘా పెరిగిపోయిందనీ, ఇందులో భాగంగానే బీబీసీ డాక్యుమెంటరీని నిషేధించడం భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. 20 ఏండ్ల క్రితం గుజరాత్‌లో ఏం జరిగిందో ఇప్పటికైనా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలు రాజ్యాంగస్ఫూర్తిని గౌరవించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఉన్న మేధావులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 200 కు పైగా ఊపా కేసులను మోపటంతో పాటు 60 మందిని జైల్లో పెట్టారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రజలకు స్వేచ్ఛ కల్పించినప్పుడే నిజమైన స్వాతంత్రం లభించినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పీఎంఎం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీక్షణం ఎడిటర్ ఎం.వేణుగోపాల్, సియాసత్ ప్రతినిధి మహమ్మద్ రియాద్ అహ్మద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, అడ్వకేట్ డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం వినతి

నవతెలంగాణ-అంబర్‌పేట



అంబర్‌పేట క్రైస్తవ సంఘాలు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి క్రైస్తవ సంఘాలకు శ్మశాన వాటిక స్థలం కోసం వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటిక స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామనీ, ఎవరైనా చనిపోతే దూర ప్రాంతాలకు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని శ్రీనివాస్ గౌడ్ కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన శ్రీనివాస్ గౌడ్ సమస్యను మంత్రులు కేటీఆర్, హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లి క్రైస్తవ శ్మశాన వాటిక స్థలం ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాసన్ రాజ్, ఉపాధ్యక్షుడు వల్లభ, వర కుమార్, చంద్రమోహన్, విలియం, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ సెంటర్నరీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఓయూ



సెంటినరి హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఓయూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం స్టూడెంట్ డీన్ ప్రొఫెసర్ రాజేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓయూ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ ఓయూ సెంటర్నరీ హాస్టల్ మహిళ విద్యార్థులకు సరిపడా బెడ్స్ లేక విద్యార్థులు పడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారనీ, దాదాపు హాస్టల్ ప్రారంభించినప్పటి నుంచి 3 నెలలుగా సరిపడా బెడ్స్ లేక విద్యార్థులు ఒక రూమ్‌లో 3 బెడ్స్‌లో 5 మంది విద్యార్థులు పడుకుంటున్నారన్నారు. ఇలా హాస్టల్ మొత్తం దాదాపు 90 విద్యార్థినులు బెడ్స్ లేక కింద పడుకుంటున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం బాధాకరం అనీ, విద్యార్థులకు వైఫై కనెక్షన్ లేక, ఫుడ్ నాణ్యత లేక, హాస్టల్లో లిఫ్ట్, పని చేయకపోవడంతో అనేక సమస్యలతో సతమతమవుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే మహిళా విద్యార్థినులను అందర్నీ సంఘటిత పరిచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహ కారదర్శి అనంత్ శర్మ, అశ్విని, నాయకులు శ్రీనాథ్, రాకేస్, సంఘవి, శ్రావణి, కీర్తి, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.42 లక్షలతో నరేంద్ర పార్కు అభివృద్ధి : ఎమ్మెల్యే కాలేరు



నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్‌లోని నరేంద్ర పార్కును రూ.42 లక్షలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ఆయన పార్కు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్నేండ్ల క్రితం ఏర్పాటు చేసిన నరేంద్ర పార్కును ప్రస్తుతం కాలనీవాసుల అభిప్రాయాలకు అనుగుణంగా అందంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. పార్కు చుట్టూ కొత్త ప్రహరీగోడ, కొత్త పాత్ వే, చిన్న పిల్లలకు ఆట పరికరాలు, అందమైన గ్రీనరీ పూల మొక్కలు వంటి వాటితో పాటు సీనియర్ సిటిజన్స్, వృద్ధులు సాయంకాలం సేద తీరేందుకు ప్రత్యేకమైన వసతిని కల్పిస్తున్నట్టు చెప్పారు. కాలనీవాసుల ఆలోచనకు అనుగుణంగా ఈ పార్కును తయారు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలోనే మరోసారి కాలనీవాసులతో కలిసి చర్చించి పూర్తి నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర పార్కు అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు నిత్యం విద్యలో రాణించాలి'

నవతెలంగాణ-ఓయూ



విద్యార్థులు విద్య ద్వారానే అభివృద్ధి అనీ, విద్యార్థులు నిత్యం విద్యలో రాణించాలని అని పలువురు అన్నారు. లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో లిటిల్ ఫ్లవర్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల చైర్మన్ డా.కె.సదానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థుల కు ప్రధానంగా సెల్ ఫోన్స్ దూరంగా ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఎదుగుదల వెనుక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి ఉంటున్నారు. తమ విద్యా సంస్థల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రమశిక్షణతో పాటు విద్యార్థుల వికాసానికి తోడ్పాటు ఇస్తామన్నారు. శనివారం జరిగిన లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో అన్నారు. స్వచ్ఛ వాతావరణం విద్యార్థులు అభిరుచి అనుగుణంగా విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.జ్యోతి సదానంద్, హెచ్ఎం.నాగ జ్యోతి, విద్యార్థులు, అధ్యాపకులు, తల్లి తండ్రులు, విద్య ప్రాముఖ్యత చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థిని అన్వికకు అభినందనల వెల్లువ

నవతెలంగాణ-అంబర్‌పేట/బడంగ్‌పేట



మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న వెల్దండ అన్విక ఆలిండియా సైనిక్ స్కూల్ వెల్లడించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆరో తరగతిలో సీటు సంపాదించింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి సీటు సంపాదించిన సందర్భంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి సైనిక్ స్కూల్ ఆరో తరగతిలో సీటు సంపాదించిన విద్యార్థిని అన్వికను అభినందించారు. వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి, స్వరూప, రమాదేవి కల్యాణి, అరుణ, ఝాన్సీ, వనజ తల్లిదండ్రులు రవీంద్ర చారి, మేఘనతోపాటు కుటుంబ సభ్యులు అన్వికను అభినందించారు.

'అక్షర నైవేద్యం పుస్తకం' చరిత్రలో నిలుస్తుంది

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-ధూల్‌పేట్



అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మహంకాళి మహేష్ గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు జి.అరవింద్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్ శనివారం దత్తాత్రేయను రాంనగర్ లోని అయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణ చారిత్రిక నేపథ్యం, బోనాల సంస్కృతి, లాల్ దర్వాజా సింహ వాహినీ శ్రీ మహాకాళి అమ్మవారిని కీర్తిస్తూ దేశ విదేశాల్లో ఉన్న జగద్గురువులు, పండితులు కవులు, కవయిత్రులు, ఎందరో మహానుభావులు రాసిన దాదాపు 526 కవితలతో కూడిన పుస్తక సంకలనం చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు.

బీసీ నాయకులు వ్యూహం ప్రకారం ముందుకెళ్లాలి



జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ నాయకులు వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన చట్ట సభల్లో రిజర్వేషన్లు బీసీ నాయకుల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మార్చి 13వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ నాయకులు వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఉన్న బీసీ పార్లమెంట్ సభ్యులందరినీ ఐక్యం చేస్తూ భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేయడానికి బీసీ నాయకులకి రౌండ్ టేబుల్ సమావేశంలో శిక్షణ ఇచ్చాం అని తెలిపారు. ఇప్పటికే అనేక పార్టీలు చట్టసభల్లో రిజర్వేషన్ కోసం రాష్ట్ర స్థాయిలో తీర్మానాలు అసెంబ్లీలో చేసి పంపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, తాటికొండ రంగబాబు, కుర్లపల్లి పవన్ నల్లారి, అశోక్ కుమార్, అన్నపూర్ణ పాల్గొన్నారు.



వైద్య పరికరాల పనితీరుపై సెమినార్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం హెచ్‌సీడీసీ ఇంజినీరింగ్ కళాశాల బయోమెడికల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ డే సందర్భంగా " వైద్య పరికారల్లో వస్తువుల నాణ్యత ఆవిష్కరణలు పనితనం నూతన ఆవిష్కరణ" అనే అంశంపై ఒక్క రోజు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నైపర్ సైంటిస్ట్ డా.ఎన్.నరసింహయ్య, ఓయూ హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొ.స్టీవెన్ సన్ మాట్లాడుతూ వైద్య పరికరాల అనుమతులకు సంబంధించిన నిబంధనలు 2017లో గవర్నర్ మెంట్ ఆఫ్ ఇండియా తీసుకు వచ్చిందన్నారు. యూఎస్‌లో ఎఫ్‌డీఏ, యూరప్‌లో సీఈ, కెనడాలో సీఎండీఆర్ ఇండియాలో సీడీసీఓలు వీటికి నిబంధనలు రూపొందించి అనుమతులు ఇస్తున్నట్టు చెప్పారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రిపోర్ట్ ప్రకారం వైద్య పరికరాలకు ప్రత్యేక విధానం ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్మాసిటికల్స్, వైద్య పరికరాల విభాగం వేరు వేరు చేసేందుకు కమిటీ సూచించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, పోస్టర్స్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు సాయంత్రం ఓయూ యూజీసీ డీన్ ప్రొ.జి.మల్లేశం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీడీసీ కో-ఆర్డినేటర్ డా.పి.మురళీ దర్ రెడ్డి, బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డా.డి.సుమన్, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.పి.చంద్రశేఖర్ డా.మేడి శ్రీనివాస్, డా.సాగర్, డా.విద్యా సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ ఎగ్జామ్‌ను తెలుగులో నిర్వహించాలి



నవతెలంగాణ-ఓయూ

ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఎగ్జామ్ పేపర్ 1 ను తెలుగులో పేపర్ 2ను కేవలం ఇంగ్లీషులో మాత్రమే నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారనీ, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఎగ్జామ్‌ను ఇంగ్లీష్‌తోపాటు తెలుగులో కూడా నిర్వహించాలని తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్ కుమార్‌కి ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన వినోద్ కుమార్ వెంటనే టీఎస్పీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డికి కాల్ చేసి విషయం పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ గతంలో జూనియర్ లెక్చరర్ సంబంధిత సబ్జెక్టు ఎగ్జామ్‌ను తెలుగులోనే నిర్వహించి ఉద్యోగ నియామకాలు జరిపే వారనీ, ఇప్పుడు దానికి భిన్నంగా కేవలం ఇంగ్లీష్‌లో నిర్వహించడం వల్ల తెలుగు మీడియంలో చదువుకున్న గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులు తను చదువుకున్న సబ్జెక్టు పట్ల విషయ పరిజ్ఞానం, అవగాహన కలిగి ఉన్న సంబంధిత సబ్జెక్టు పేపర్ ఇంగ్లీష్‌లో ఉండటం వల్ల అర్థం చేసుకోలేక నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎగ్జామ్‌ని తెలుగులో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి ఆ డిమాండ్‌ని సఫలీకృతం చేశామని చెప్పుకుంటున్నట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ ఎగ్జామ్ ను కేవలం ఇంగ్లీషులోనే ఎందుకు నిర్వహిస్తుందో సమాధానం చెప్పాలన్నారు. టీఎస్పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు తెలుగులో నిర్వహిస్తున్నారు వాటి మాదిరిగానే జూనియర్ లెక్చరర్ సెకండ్ పేపర్ ఎగ్జామ్‌ను కూడా తెలుగులో నిర్వహించి అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి నెల్లి సత్య, ఉపాధ్యక్షులు ఇరిగి బాలరాజు, నాయకులు కళ్యాణ్, వినోద్ పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్ల విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

డిప్యూటీ కమిషన్ డిడి నాయక్

విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వీధి కుక్కల పట్ల విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్- 14 డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్ సూచించారు. శనివారం గోషామహల్-14 సర్కిల్ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు వీధి కుక్కల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్ మాట్లాడుతూ కుక్కలు గుంపులుగా ఉన్నచోటికి వెళ్లకూడదని సూచించారు. కుక్కలపై రాళ్లు విసరడం, వాటి దగ్గరికి వెళ్లడం లాంటివి చేయకూడదన్నారు. కుక్క మీదికి వస్తున్నప్పుడు పారిపోకూడదని చెప్పారు. వీధి కుక్కలకు దూరంగా ఉండాలన్నారు. వీధి కుక్కలను తిడుతూ, కేకలు వేస్తూ, కుక్కల నిద్రకు భంగం కలిగించకూడదన్నారు. భంగం కలిగిస్తే అవి మీదికి వచ్చే ప్రమాదం ఉందని సూచించారు. కుక్క పిల్లలతో ఉన్న తల్లి కుక్కలకు దూరంగా ఉండాలని సూచించారు. కుక్క పిల్లలతో చిన్నారులు ఎలాంటి సంబంధాలు కలిగి ఉండొద్దన్నారు. గుంపుగా ఉన్న కుక్కల వద్దకు వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వెటర్నటీ ఆఫీసర్ డాక్టర్ సబిత, వెటర్నరీ బృందం, తదితరులు పాల్గొన్నారు.

సెంట్ ఆన్స్ స్కూల్ యానువల్ వేడుకలు

నవతెలంగాణ-ఓయూ



తార్నాకలోని సెంట్ ఆన్స్ స్కూల్ యానువల్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఒంటరిగా రోడ్డు మీదకు పంపొద్దు అన్నారు. పిల్లలు వీధి కుక్కలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ స్కూల్ విద్యా విధానంతో పాటు విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు క్రమశిక్షణ భేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, టీచర్స్, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత వేగవంతం చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

నాలాలో పూడికతీత వేగవంతం చేయాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయకుమార్ గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ సీపీఎల్‌లో 600 ఎంఎం పైపు మరమ్మతు పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలిస్తున్న అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పైపు మరమ్మతు పనులు త్వరితగతిన చేయాలని సీపీఏ లలో గల నాలాలో పూడికతీత పనులు ఎప్పటికప్పుడు వేగవంతంగా చేస్తూ ఉండాలనీ, తద్వారా కింది ప్రాంతాల్లో నీరు సాఫీగా పోతుందనీ, పనుల్లో అలసత్వం వహించవద్దని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్, రంగు ఉదయ్ గౌడ్, సంతోష్ చారి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



ఫూల్‌బాగ్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి

కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫూల్‌బాగ్ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం వాటర్ వర్క్స్ సీజీఎం విజయరావు, జీ.ఎం ప్రభాకర్, డీజీఎం. షంషీర్ తో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై కార్పొరేటర్ శ్రీ ఆవుల రవీందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొంత కాలంగా కాలనీలో దీర్ఘకాలికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను సాధ్యమైనంత త్వరగా డ్రైనేజీ వ్యవస్థను పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, కాలనీ అధ్యక్షులు సభాపతి రెడ్డి, పార్టీ నాయకులు నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, శంకర్ గౌడ్, ఎం.సుధాకర్, శేఖర్ గుప్త, స్వామీ గౌడ్, మహేందర్ రెడ్డి, గౌతమ్ తో పాటు వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రవల్లి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి ఘన నివాళి

నవ తెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,రాజకీయ కురువృద్ధుడు ఎర్రవల్లి శ్రీనివాస్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకొని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి శనివారం మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలోని వారి నివాసంలో భౌతిక దేహానికి ఘన నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.సంతాపని తెలియజేసిన వారిలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నందా రెడ్డి,ఎంపీపీ రజిత రాజ మల్లా రెడ్డి, సర్పంచ్ గీత భాగ్య రెడ్డి, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, పిఏసిఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి,అప్పంగారి రాంరెడ్డి, మర్రి నర్సింహ రెడ్డి, బీఆర్ ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్,నాయకులు యూనిస్ పాషా,అశోక్ ముదిరాజ్, నడి కొప్పు నాగరాజు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- ప్రగతి యాత్ర'లో భాగంగా జగద్గిరిగుట్టలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకతీతంగా అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా రాజీవ్ గృహకల్ప కాలనీ, కూన మహాలక్ష్మీ నగర్, గాజులరామారం డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్ లలో పాదయాత్ర చేస్తూ పూర్తైన అభివృద్ధి పనులు స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. ఆయా డివిజన్లో పెండింగ్‌లో ఉన్న పనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. త్వరలోనే వాటిని పూర్తి చేయిస్తానని చెప్పారు. అనంతరం లెనిన్ నగర్‌లో హిందూ శ్మశాన వాటికను పరిశీలించి అభివృద్ధి చేయిస్తానని స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, కృష్ణ గౌడ్, ఎత్తరి, మారయ్య, వేణు యాదవ్, హజ్రత్ అలీ, బాబు గౌడ్, ఇందిరాగౌడ్, బండ మహేందర్, లక్ష్మయ్య, శశిధర్, విఠల్, హనుమంత్, చారి, మనోజ్, ప్రభాకర్, సంతోష్, సయ్యద్ సాజిద్, తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి

పీసీసీ సభ్యులు డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ - బాలానగర్



ఛత్తీస్ ఘడ్ రాయపూర్ వేదికగా జరుగుతున్న ఏఐసీసీ 85 వ ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, నిరంజన్, మేడ్చెల్ మల్కాజీ గిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్, హరివర్ధన్ రెడ్డి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం, భూపతి రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్, స్థానిక తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాయపూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలు క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయన్నారు. పార్టీ రాజ్యాంగంలోని 32 నియమ నిబంధనలకు 16 సవరణలు తీసుకురావాలన్న ప్రతిపాదనలపై ప్లీనరీలో నిర్ణయం తీసుకున్నారని తెలియచేశారు. రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసేలా సమావేశాలు కొనసాగుతున్నా యన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో సుదీర్ఘ కాలం పార్టీకి అధినేతగా సేవలందించిన సోనియా గాంధీకి ప్లీనరీ సమావేశంలో కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ద్వారా, ఇప్పుడు జరుగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీకి మంచి ప్రజాదరణ వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేసారు.

వీధి కుక్కల నుంచి చిన్నారులు దూరంగా ఉంచాలి



కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బి

వీధి కుక్కల నుంచి చిన్నారులు కాపాడుకునేందుకు దూరంగా ఉంచాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీధి కుక్కలపై పిల్లలకు అవగాహన కల్పించారు. జిహెచ్ఎంసి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కుక్క పిల్లలు ఉన్న చోట చాలా దూరంగా ఉండడం వల్ల పిల్లల తల్లి అయిన కుక్క కు కోపం తేపించకుండ మసలుకోవాలన్నారు. పిల్లలు వీధులలో ఉండే కుక్కలను చూసినప్పుడు వాటిని చూసి పరిగెత్తడం కాని, వాటి జోలికి వెళ్ళడం కానీ చేయరాదని, వాటికి దూరంగా ఉండాలన్నారు. వాటి మీద రాళ్లు వేయడం కానీ, అదిలించడం కానీ చేయరాదన్నారు. జిహెచ్ఎంసి అధికారులు పిల్లలకు, ప్రజలకు అవగాహన కల్పించడం మంచి పరిణామమ న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని బస్తీ దవాఖానల్లో కుక్క కాటు మందును ఉచితంగా అందుబాటులో ఉంచిందని, ఎవరిపైనన్న వీధి కుక్కలు కరిచినచో వెంటనే కుక్క కాటు మందు వేయించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డాక్టర్ మమత, ఈ ఎస్ అశ్విని, పి ఓ ఇంద్రసేన, సి ఓ ముస్తఫా, ఎస్ ఆర్ పి సత్యనారాయణ, ఎస్ ఎఫ్ ఐ సంజీవరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంఛార్జి, టీచర్లు, హైదర్ నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు పోతుల రాజేందర్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్ రాజు లేని లోటు తీరనిది

మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ సంఘ సేవకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమాదేవి నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ భట్రాజు సంఘ సలహాదారులు, కీర్తిశేషులు కూరపాటి వెంకటేశ్వర్ రాజు (భట్రాజు, కె.వి.రాజు) లేని లోటు తీరనిదని మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గాజులరామారం డివిజన్ ఉమాదేవి నగర్‌లోని ఆయన నివాసం వద్ద ఏర్పాటుచేసిన ప్రథమ వర్ధంతిలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు, బస్తీవాసులతో, కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తోపాటు బస్తీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడేవాడని ఈ రోజున మన మధ్యలో లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కుమారులు కూరపాటి శివకృష్ణ, కూరపాటి వంశీకృష్ణ, ఉమాదేవి నగర్ బస్తి కమిటీ నాయకులు ఎస్. కృష్ణమూర్తి గుప్తా, కుమారస్వామి, చందర్ యాదవ్ ,ఎం. అశోక్ చారి, భట్రాజు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తంగెళ్ల రాధాకృష్ణ భట్ ప్రచార కార్యదర్శి కూరపాటి శ్రీ రామరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ మండల కమిటీల ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే

నవతెలంగాణ - బాలానగర్



ఫిబ్రవరి 20 నుండి భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23 వరకు రెడ్ బుక్ డేలుగా తెలంగాణ రాష్ట్ర కమిటీలు ప్రకటించిన సందర్భంగా బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ విద్యార్థులతో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల నుద్దేశించి డీవైఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పుదూరు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ కూకట్ పల్లి జోన్ ఉపాధ్యక్షుడు జి. కార్తిక్ లు మాట్లాడుతూ భగత్ సింగ్ జీవిత చరిత్రను వారికి వివరించారు. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదిలాడని, ఆయన కోరుకున్న ఉచిత విద్య ఉచిత వైద్యం వివక్షలేని సమాజం, మతాలకు అతీతంగా సోదరీ, సోదరులుగా కలిసిమెలిసి ఉంటూ సమ సమాజాన్ని ఏర్పాటు చేసుకుని కోరుకున్న ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం భగత్ సింగ్ జీవిత చరిత్ర పుస్తకాలను యువతకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బి



పనులలో జాప్యం వహించకుండ త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ లో రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే రాక్ గార్డెన్ పార్క్ నిర్మాణ పనులను జిహెచ్ఎంసి అధికారులు, కాలనీవాసులతో కలసి స్థానిక కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో, ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో హైదర్ నగర్ డివిజన్ లో నే ప్రత్యేకంగా రాక్ గార్డెన్ పార్క్ పనులు మొదలుపెట్టామని తెలిపారు. కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదన్నారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏ ఈ రాజీవ్, హైదర్ నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు పోతుల రాజేందర్, సమత నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు అందరూ పాల్గొన్నారు.

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా వి.రాములు

నవతెలంగాణ-మేడ్చల్



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.రాములు మేడ్చల్ మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా శనివారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు కమిషనర్ గా విధులు నిర్వహించిన అహ్మద్ షఫీ ఉల్లా ఖాన్ బదిలీపై వెళ్లడంతో రాములు ఇంఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

'టీ హోమ్' ను ప్రారంభించిన సురేష్ రెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ మార్కెట్ రోడ్‌లో పృధ్వితేజ శ్రీకాంత్ ఏర్పాటు చేసిన 'టీ హోమ్' ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ...'టీ హోమ్'కు వచ్చే కస్టమర్లకు క్వాలిటీ 'టీ'ని అందించాలని సూచించారు. 'టీ హోమ్' యజమానానికి అభినందించారు. సురేష్ రెడ్డిని, పోలే శ్రీకాంత్ లను పృథ్వీతేజ శ్రీకాంత్ పుష్పగుచ్ఛమిచ్చి, శాలువతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో విజయ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మహిళా ప్రధాన కార్యదర్శి పద్మావతి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడపా శేషు, మహిళ నాయకురాలు పద్మజ రెడ్డి, కృష్ణవేణి, బసవరాజు ,కటింగ్ శ్రీను, ఇస్మాయిల్ ,భద్రయ్య పరశురాం, వెంకట్, సంతోష్ రెడ్డి, మార్కెట్ ప్రకాష్, అడపా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైతు రైతు బజార్‌పై అవగాహన

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



రైతులు పడే కష్టాల గురించి తెలుసుకొని రైతులు పండించే పంటలను అమ్ముకోవడానికి ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేశారు. వాస్తవానికి రైతు పండించే పంట ఏమవుతుంది ? అసలు రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర ఉందా, లేదా? నిజానికి లేదా అనే చెప్పుకోవాలి ! ఎందుకంటే రైతు పండించిన పంట మధ్యవర్తులు వారి సొంత నిర్ణయానికి ఖరీదు చేస్తారు. మధ్యవర్తులు నుండి వ్యాపారులు అవి కొని మార్కెట్లో అమ్ముకోవలసి వస్తుంది. దీనివల్ల వ్యాపారులకు కూడా సరైన ధర లేక పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. దీని గురించి విద్యార్థులు రైతు వేషధారణలో శనివారం రైతుబజార్ ఏర్పాటు చేసి రైతుల పండించే ప్రతి ఒకటి విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మడం జరిగింది. దీనివల్ల వారి సాధక బాధకాలు, లాభనష్టాల గురించి మరియు వారి కష్టాల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్‌గౌడ్, పాల్గొని రైతులు పడే కష్టాల గురించి అతివృష్టి, అనావృష్టి గురించి దళారులు పొందే లాభాల గురించి క్షుణంగా విద్యార్థులకు తెలియజేశారు. కరస్పాండెంట్స్ ఎం సునీత, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ , మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణా రావు , తోకలసి కౌసల్య కాలనీ సాయి కృష్ణజా హిల్స్ కాలనీ లో శనివారం ఎస్ ఎన్ డి పి నాలా నిర్మాణ పనులను, లైబ్రెరీ డ్వాక్రా భవన నిర్మాణ పనులను, బనియన్ ట్రీ పార్క్ , రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాలనీ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలియచేస్తూ, కాలనీలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- సర్పంచ్ సింగం ఆంజనేయులు
- ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన వైద్యం
- యువ నాయకులు క్యాతం మధుక్రిష్ణ
- అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్లు వితరణ

నవతెలంగాణ-శామీర్‌పేట




ఆరోగ్యమే మహాభాగ్యం అని లక్ష్మాపూర్ సర్పంచ్ సింగం ఆంజనేయులు అన్నారు. మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం యువ నాయకులు ఉన్నత విద్యావంతులు క్యాతం మధుక్రిష్ణ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ అఫ్ సైనిక్ పురి మరియు తులసి హాస్పిటల్ ఇసిఐఎల్ వారి సౌజన్యముతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా సర్పంచ్ సింగం ఆంజనేయులు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్యాతం మధుకృష్ణ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం కోసం ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిమేరకు ఉచిత వైద్యశిభిరానికి అంగీకరించి పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినందుకు రోటరీ క్లబ్ మరియు తులసి హాస్పిటల్ వారికి అలాగే ఈ కార్యక్రమ ఏర్పాటుకు సహకరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పుట్ల శ్రీనివాస్, రవి ప్రకాష్, డాక్టర్ దమయంతి కి ఈ సందర్భంగా మధుకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో తులసి హాస్పిటల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో వైద్యబృందం ఈ సి జి, బిపి, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాగా వైద్యశిభిరాబికి అనూహ్య స్పందన వచ్చింది. వైద్య శిబిరం నిర్వాహకులు క్యాతం మధు క్రిష్ణ విజ్ఞప్తి మేరకు రోటరీ క్లబ్ సైనిక్ పురి ప్రెసిడెంట్ రిటైర్డ్ కల్నల్ కామేశ్ బృందం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్లు అందజేశారు. గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం టాయిలెట్స్, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, లక్ష్మాపూర్ తండా లో బస్ షెల్టర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తుల తరపున సర్పంచ్ రోటరీ క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీ పల్లి సర్పంచ్ జామ్ రవి, స్థానిక ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షులు కటికెల శ్యామల, వార్డు సభ్యులు ఎల్లగౌని బాలేష్, డప్పు సురేష్, వినితఎల్లం , నాయకులు బండి జగన్నాథం, మాడబోయిన సత్యనారాయణ, గౌటే గోపాల్, సింగం నర్సింగ్ రావు, నందగిరి ఉపేందర్ రావు, వెంకటేష్ నాయక్, సాయి శ్రీనివాస్ చారి , బండి నవిందర్, రోటరీ ప్రతినిధులు, తులసి హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రెండోదశకు

మోక్షమెప్పుడు..?

4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పెండింగ్

- చెప్పిందొకటి..చేస్తున్నదొకటి !
- అధికమవుతున్న అంచనా వ్యయం
- ఉమ్మడి రాష్ట్ర ప్రాజెక్టు పట్ల అలక్ష్యం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్నారు దాశరథి. అదే తెలంగాణ ఉద్యమ నినాదమై మార్మోగింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే పోరాటం చేపట్టిన మాట అందరికీ ఎరుకే. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులకే తెలంగాణ సర్కారు ప్రాధాన్యతనిస్తున్న మాటా వాస్తవమే. ఆయకట్టును పెంచడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామంటూ సభలు, సమావేశాల్లో ఎప్పుడూ ఘంటాపథంగా చెబుతూనే ఉంటారు. ఉమ్మడి రాష్ట్ర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయబోమనీ, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా పూర్తిచేస్తామనే హామీని సైతం గతంలో టీఆర్ఎస్ సర్కారు ఇచ్చింది. కానీ, అది ఆచరణలో అడుగుదూరం కూడా పడలేదు. ఆ ప్రాజెక్టుల పట్ల అలసత్వం కనిపిస్తున్నది. టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రతియేటా రూ. 25 వేల కోట్లను సాగునీటి ప్రాజెక్టులకు కేటాయిస్తామని చెప్పారు. ఈ ఏడాదితో రెండుసార్లు మాత్రమే అలా చేయగలిగారు. మిగతా సంవత్స రాల్లో తగ్గించారు. కార్పొరేషన్ల ద్వారా నిధులు సమకూర్చుకుంటున్నారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆ తరహాలోనే కాసులు తెచ్చారు. మిగతా 18 భారీ, 31 మధ్యతరహా ప్రాజెక్టులపై మాత్రం శీతకన్నేశారు. కేటాయింపులు చేస్తున్నామంటూనే ఏ ఒక్క ప్రాజెక్టునూ ఏడేండ్లుగా పూర్తిచేయకపోవడం గమనార్హం. కొన్ని ప్రాజెక్టులకు రీడిజైన్ చేశారు. గత ఏడేండ్లల్లో మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తిచేసే అవకాశం ఉన్నా, ఆ ప్రణాళికే లేకపోవడం చర్చనీయాంశ మవుతున్నది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో 4.40 లక్షల ఎకరాలకు సాగునీరందించే శ్రీరాంసాగర్(ఎస్ఆర్ఎస్పీ) ప్రాజెక్టు రెండో దశ పనుల్లో తీవ్ర ఆలస్యమే ఇందుకు సాక్ష్యం.



ఇలా చేయాలి

శ్రీరాంసాగర్ రెండో దశకు నీటి గ్యారంటీ లేదు. పంపిణీచేసే కాలువల పనులు చేయాల్సి ఉంది. అదనంగా నిధులూ అవసరమవు తాయి. మరో రూ. 1000 నుంచి రూ. 1200 కోట్లు కావాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వీటిని కేటాయించాల్సి ఉంది. అది పూర్తిచేయకుండానే వరదనీటితో నీళ్లు ఇస్తామని చెప్పడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం కర్నాటక, మహారాష్ట్ర, ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్క రించాలి. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌ను రద్దు చేయాలి. కొత్తది వేయాలి. అనవసరంగా ఆలస్యం చేయడం సరికాదు.

సారంపల్లి మల్లారెడ్డి, సాగునీటిరంగ నిపుణులు

రెండోదశ ..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ పనులు పూర్తిచేస్తే ఖమ్మం జిల్లాలోని 68,914 ఎకరాలు, వరంగల్‌లోని 1,13,575 ఎకరాలు, నల్లగొండ జిల్లాలోని 2,57,508 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. తద్వారా ఈ మూడు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులు పూర్తయినా, నీటిని పంపిణీ చేసే ఉపకాలువల పనులు ఇంకా ఆలస్యమవుతూనే ఉన్నాయి. ఈ రెండో దశకు 40 టీఎంసీల నీరు అవసరం. ఈ నీరు శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ద్వారా దిగువకు రావడం గత దశాబ్దకాలంలో సాధ్యం కానిది. కాకతీయ కాలువకు 234వ కిలోమీటర్ వరకే నీరు వస్తున్నది. మొదటి దశలోని 234-284 కిలోమీటర్లకు కూడా నీరందడంలేదు. పై 50 కిలోమీటర్లల్లో మోరంచ, తీగలవేని, వెన్నవరం కాలువలకు కూడా నీరు రావడం లేదు. 284 నుంచి 343 కిలోమీటర్ల వరకు గత రెండు దశాబ్దాలుగా నీళ్లు రాలేదు. కాళేశ్వరం ద్వారా స్థిరీకరిస్తామని చెప్పినా, అమలుకాలేదు. కాలువలు పూర్తయినా ఇప్పుడవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాకతీయ కాలువ మొదటి దశ 50 కిలోమీటర్లతోపాటు రెండో దశకు 70 టీఎంసీల నీరు కావాల్సి ఉంటుంది. ఈ నీటిని దేవాదుల లిఫ్ట్ ద్వారా గానీ, లేదా కాంతాలపల్లి ఎత్తిపోతల ద్వారాగానీ సరఫరా చేయడానికి వీలుంది. ఇదొక్కటే మార్గం. ఈ ప్రాజెక్టులతో రెండో దశకు నీటిని అందించడం ద్వారా మాత్రమే శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. అలాగే రెండో దశలోనే సరస్వతి కాలువ ద్వారా 79000 ఎకరాలు(77-144 కిలోమీటర్లు), కడెం ఆయకట్టు స్థిరీకరణ 68000 ఎకరాలనూ చేర్చారు.

శంకుస్థాపనలు


ఈ ప్రాజెక్టు రెండోదశకు మూడుసార్లు శంకుస్థాపనలు జరిగాయి. అప్పటి మాజీ ప్రధాని కీ.శే ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి కీ.శే ఎన్టీ ఆర్‌తో కలిసి 1984, మే నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కాగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం 1996, మార్చి ఆరున ఒకసారి, 2002 మే తొమ్మిదిన రెండోసారి శంకుస్థాపన చేయడం గమనార్హం. తొలుత ఈ ప్రాజెక్టు వ్యయం సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ రూ. 1258 కోట్లుగా నిర్ధారించింది. ప్రధాన ఉపకాలువలు డీబీఎం 30, డీబీఎం 40, డీబీఎం 48 కాలువలు తవ్వినా లైనింగ్ చేయలేదు. చేసినవీ కూలిపోయాయి. ఇప్పటికీ వీటి పునరుద్ధరణకు ప్రణాళికలే లేవు. పదేండ్లపాటు కాలువల తవ్వకాలను నిర్లక్ష్యం చేశారు. అనంతరం కొద్దిమేర కదలిక వచ్చింది. నిధులిచ్చారు. వాటినీ కాంట్రాక్టర్లు, అవినీతి అధికారులు కాజేశారు. పనులు చేయకుండానే చేసినట్టు ఎంబీలు నమోదు చేసి విలువైన ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో దాదాపు 12 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)ను అప్పట్లో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కాగా ఎలాంటి విచారణ చేయకుండానే సస్పెండైన ఏఈలను మూడేండ్ల తర్వాత మళ్లీ విధుల్లోకి తీసుకోవడం అప్పట్లో భారీ చర్చకు దారితీసింది.

ఇది పరిస్థితి

ఖమ్మం జిల్లా 68,914 ఎకరాలకు నీరిచ్చేందుకు పాలేరు నుంచి భక్తరామదాసు లిఫ్ట్‌పెట్టారు. పాలేరు ఆయకట్టుకు కృష్ణానది నుంచి ఇస్తున్నారు. కానీ, భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలోని గోదావరి ఆయకట్టుకు మళ్లించారు. గోదావరిలో సరిపోను నీళ్లు ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా ఇచ్చే అవకాశం ఉంది. కృష్ణాకు లింకుపెట్టి ఖమ్మంలో పబ్బంగడిపారు. రెండోదశకు ఇప్పటికీ నీటి కేటాయింపుల గ్యారంటీ లేదు. కరీంనగర్, వరంగల్ సరిహద్దు వరకు మొదటిదశ శ్రీరాంసాగర్ నీళ్లు వస్తున్నాయి. కిందకు వదలడంతో వరంగల్ నగరానికి తాగునీటిని అందిస్తున్నారు. వడ్డేపల్లి, భద్రకాళి చెరువును నింపుతున్నారు. దేవాదుల ప్రాజెక్టుతో ధర్మసాగర్ చెరువు నీటిసమస్య తీరుతున్నది. కానీ రెండో దశకు నీళ్లివ్వడంపై 1984 నుంచి దృష్టిపెట్టలేదు. డీబీఎం 48ని నిర్మించాల్సి ఉంది. 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రాంతం నిరంతరం నీటి కరువుతో ఉంది. వర్ధన్నపేట, తిరుమలగిరి, వరంగల్, ఖమ్మం మూసీ ప్రాంతానికి ఇప్పటికీ సక్రమంగా తాగు, సాగనీరు అందడం లేదంటే ప్రణాళికబద్ధమైన వ్యవహారం లేకపోవడమే కారణం.

విఫల నాయకుడు!

- నా కెప్టెన్సీని అలాగే చూశారు
- విరాట్ కోహ్లి ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : భారత క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించటం గొప్ప గౌరవంతో పాటు అంతకుమించిన కఠిన పరీక్ష. ఈ సవాల్‌ను కొందరు అలవోకగా స్వీకరిస్తే, కొందరు కష్టసాధ్యంగా చూశారు. నాయకత్వంలో విజయవంతమైనా.. విఫల నాయకుడిగా మిగిలిన సారథుల్లో విరాట్ కోహ్లి ముందుంటారు!. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో తిరుగులేని రికార్డుకు తోడు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్స్ వరకు చేరినా.. విరాట్ కోహ్లి కెప్టెన్‌గా విఫలమైనట్టే పరిగణించారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పాడ్‌కాస్ట్‌లో విరాట్ కోహ్లి ఇదే విషయాన్ని వెల్లడించారు. జాతీయ జట్టుకు సుదీర్ఘ కాలం ప్రాతినిథ్యం వహించినా కెరీర్‌లో ఓ ఐసీసీ టైటిల్ అందుకోని క్రికెటర్లు ఉన్నారు. కానీ నేను ఆటగాడిగా ఐసీసీ ప్రపంచకప్, ఐసీసీ చాంపియన్‌షిప్ ట్రోఫీ, ఐసీసీ టెస్టు గదలను సొంతం చేసుకున్నాను. అయినా, నన్ను వైఫల్య నాయకుడిగానే చూశారని కోహ్లి అన్నారు.

' ఏ టోర్నీలోనైనా విజయం కోసమే ఆడతాం. చాంపియన్స్ ట్రోఫీ 2017 ఫైనల్లో, 2019 వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2021 ఫైనల్లో భారత జట్టుకు సారథ్యం వహించాను. ఓ నాలుగు ఐసీసీ టోర్నీల అనంతరం నన్ను విఫల నాయకుడిగా పరిగణించారు. అయితే, నన్ను నేను ఆ కోణంలో ఎప్పుడూ బేరీజు వేసుకోను. నా కెప్టెన్సీ సమయంలోనే భారత జట్టులో ఓ కల్చరల్ మార్పు వచ్చింది. దీని పట్ల నేను గర్వపడతాను. ఓ ఐసీసీ టోర్నీ కొన్ని రోజుల్లోనే జరుగుతుంది. కానీ అదే ఓ జట్టులో కల్చరల్ మార్పుకు ఎంతో సమయం పడుతుంది. అందుకు ఎంతో నిలకడ అవసరం. నా నాయకత్వంలో భారత జట్టు అది సాధించింది. అందుకు నేను గర్వపడతాను. ఆటగాడిగా నేను ఐసీసీ ప్రపంచకప్ విజయం సాధించాను. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ అందుకున్నాను. ఐదు టెస్టు గదలు గెల్చుకున్న జట్టులో భాగంగా ఉన్నాను. ఇక్కడ మరో కోణంలో చూస్తే.. కెరీర్ అసాంతం ఐసీసీ టైటిల్ అందుకోని ఆటగాళ్లు ఉన్నారు' అని విరాట్ కోహ్లి అన్నాడు.

భారత క్రికెట్‌లో ఎం.ఎస్ ధోని, విరాట్ కోహ్లి దిగ్గజాలు. 15 ఏండ్ల కోహ్లి అంతర్జాతీయ కెరీర్‌లో సుమారు 11 ఏండ్లు ఎం.ఎస్ ధోనితో కలిసి డ్రెస్సింగ్‌రూమ్ పంచుకున్నాడు. మహి సారథ్యంలోనే మూడు ఫార్మాట్లలో అరంగేట్రం చేసిన విరాట్.. మూడు ఫార్మాట్ల కెప్టెన్సీ పగ్గాలు సైతం ధోని నుంచే అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన కోహ్లి 2019 నుంచి కాస్త నెమ్మదించాడు. కెరీర్‌లో ఎన్నడూ ఎదుర్కొని పరిస్థితిని చవిచూశాడు. ఆ సమయంలో భార్య అనుష్క, కుటుంబ సభ్యులు, చిన్ననాటి కోచ్ మినహా బయటి నుంచి మనోధైర్యం అందించిన వ్యక్తి ఎం.ఎస్ ధోని అని కోహ్లి అన్నాడు. ఆ సమయంలో ధోని స్వయంగా ఫోన్ చేసి నైతికంగా మద్దతు ఇవ్వటంతో పాటు ఆత్మవిశ్వాసం కలిగించాడన్నాడు. అయితే, నిజానికి ఎం.ఎస్ ధోనికి ఏ సమయంలో ఫోన్ చేసినా 99 శాతం అట్నుంచి సమాధానం ఉండదు. ఎందుకంటే, ధోని అసలు ఫోన్ చూడడు అని కోహ్లి చెప్పుకొచ్చాడు. అన్ని స్థాయిలు, అన్ని ఫార్మాట్లలో నాయకత్వం త్యజించిన అనంతరం సరికొత్తగా అనిపిస్తోందని విరాట్ కోహ్లి తెలిపాడు.



మార్షల్ ఆర్ట్స్‌కు ఆదరణ

తైక్వాండో పోటీలు ప్రారంభించిన శాట్స్ చైర్మన్

హైదరాబాద్ : ఆరోగ్యకర జీవనశైలితో పాటు ఆత్మరక్షణకు సైతం ఊతం ఇచ్చే మార్షల్ ఆర్ట్స్‌కు తెలంగాణలో మంచి ఆదరణ ఉందని శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. మహిళలు, విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించేందుకు మార్షల్ ఆర్ట్స్‌ను విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాలి. మార్షల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంజనేయ గౌడ్ తెలిపారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం 5వ జాతీయ క్యాడెట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన శాట్స్ చైర్మెన్.. జ్యోతి ప్రజ్వలనతో పాటు వివిధ విభాగాల్లో పోటీలను ఆరంభించారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల చారి, జాతీయ తైక్వాండో సమాఖ్య అధ్యక్షులు ఇషారి, గణేశ్, తెలంగాణ తైక్వాండో సంఘం అధ్యక్షుడు సతీశ్ గౌడ్ తదితరులు ఆరంభ వేడుకల్లో పాల్గొన్నారు.

కంగారూతో సఫారీ ఢీ

మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్ నేడు



కేప్‌టౌన్ : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఇంగ్లాండ్‌కు షాక్ ఇస్తూ తొలిసారి ప్రపంచకప్ ఫైనల్లోకి అడుగుపెట్టిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు నేడు మెగా మ్యాచ్‌లో తాడోపేడో తేల్చుకోన్నారు. ఐదుసార్లు చాంపియన్, మహిళల క్రికెట్ అగ్రజట్టు ఆస్ట్రేలియాతో నేడు టైటిల్ పోరులో సఫారీలు పోటీపడనున్నారు. ప్రపంచ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా పురుషుల జట్టుకు దక్కని ఐసీసీ టైటిల్‌ను మహిళల జట్టు సాధిస్తుందేమో చూడాలి. ఆస్ట్రేలియా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నప్పటికీ.. భావోద్వేగాలతో కూడిన సఫారీ శిబిరాన్ని ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సాయంత్రం 6.30 గంటలకు వరల్డ్‌కప్ ఫైనల్ ఆరంభం కానుంది.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



హైదరాబాద్ : స్టీల్‌మ్యాన్ క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీలు హైదరాబాద్‌లో శనివారం ప్రారంభం అయ్యాయి. యువతను బాడీ బిల్డింగ్ దిశగా ప్రోత్సహించే ఉద్దేశంతో మిస్టర్ ఇండియా శివ కుమార్, మిస్టర్ వరల్డ్ రాహుల్ ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది బాడీ బిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. అయిదు విభాగాల్లో 10 విభిన్న వెయిట్ విభాగాల్లో పోటీలు జరిగాయి.



విశ్వక్‌సేన్

దాస్.. షూటింగ్ పూర్తి

హీరో విశ్వక్ సేన్ నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ' ఈ చిత్రానికి ఆయన దర్శకుడు, నిర్మాత కూడా. ఇందులో ఆయనకు జోడిగా నివేదా పేతురాజ్ నటిస్తోంది. శనివారంతో ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని మేకర్స్ ఎనౌన్స్ చేయనున్నారు.

ఇప్పటి వరకూ విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. 'ఆల్మోస్ట్ పడిపోయిందే పిల్ల', 'మావా బ్రో..' పాటలు చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయి. ఇక ఈ చిత్ర ట్రైలర్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయ్యింది. వన్మయే క్రియేషన్స్, విశ్వక్సేన్ సినిమాస్ బ్యానర్లపై కరాటే రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకి ప్రసన్న కుమార్ బెజవాడ డైలాగ్స్ రాశారు. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రంలో రావు రమేష్, హైపర్ ఆది, రోహిణి, పృథ్వీరాజ్ తదితరులు ఇతర ముఖ్య తారాగణం.

ఈ చిత్రానికి డీవోపీ: దినేష్ కె బాబు, సంగీతం: లియోన్ జేమ్స్, ఎడిటర్: అన్వర్ అలీ, ఆర్ట్ డైరెక్టర్: ఎ.రామాంజనేయులు, ఫైట్స్: టోడర్ లాజరోవ్-జుజి, దినేష్ కె బాబు, వెంకట్.

ఆర్ఆర్ఆర్‌కు అవార్డుల పంట



కార్తికేయ, కీరవాణి, రాజమౌళి, సెంథిల్ కుమార్, రామ్‌చరణ్

అంతర్జాతీయ వేదికపై 'ఆర్ఆర్ఆర్' సినిమా మరోమారు సత్తా చాటింది. ఇప్పటికే పలు గ్లోబల్ అవార్డులను సొంతం చేసుకున్న ఈ సినిమా లేటెస్ట్‌గా మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. హాలీవుడ్‌లో విశేషంగా భావించే 'హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్' అవార్డుల్లో ఈ సినిమా ఏకంగా ఐదు పురస్కారాలను దక్కించుకుని హాలీవుడ్ సినిమాకు గట్టి పోటీనిచ్చింది.

'బెస్ట్ స్టంట్స్', 'బెస్ట్ యాక్షన్ మూవీ', 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్', 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్' విభాగాలతో పాటు మన దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ విశేష ప్రేక్షకాదరణ పొందిన చిత్రంగా పేరు సొంతం చేసుకుని 'హెచ్‌సిఏ స్పాట్‌లైట్' అవార్డుని సైతం ఇది దక్కించుకుని భారతీయ సినిమా ఖ్యాతిని మరింత పెంచింది.

ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ, 'మా సినిమాకి బెస్ట్ స్టంట్స్ అవార్డును అందించిన హెచ్‌సిఏ సభ్యులందరికీ ధన్యవాదాలు. ఎంతగానో శ్రమించి ఇందులో స్టంట్ కొరియోగ్రఫీ చేసిన సాల్మన్, క్లైమాక్స్‌లో కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను కంపోజ్ చేసిన జూజీతోపాటు మా సినిమా కోసం భారత్ వచ్చి, మా విజన్ అర్థం చేసుకుని, మాకు అనుగుణంగా మారి, కష్టపడి పని చేసిన ఇతర స్టంట్ మాస్టర్స్ అందరికీ కృతజ్ఞతలు. సినీ ప్రేమికులను అలరించడం కోసం స్టంట్ మాస్టర్స్ ఎంతో శ్రమిస్తుంటారు. కాబట్టి ఈ వేడుక ద్వారా ప్రతిష్టాత్మక అవార్డులు అందించే బృందాలకు నాదొక చిన్న విన్నపం. ఇకపై మీ అవార్డుల జాబితాలో స్టంట్ కొరియోగ్రాఫర్స్ విభాగాన్ని కూడా చేర్చాలని కోరుతున్నాను' అని చెప్పారు.

బేవెర్లీ హిల్స్‌లో శనివారం ఉదయం జరిగిన హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డుల్లో 'బెస్ట్ వాయిస్ / మోషన్ కాప్చర్ పెర్ఫార్మెన్స్'గా రామ్ చరణ్‌ని ఎనౌన్స్ చేశారు. ఈ ఘనత అందుకున్న తొలి భారతీయ హీరోగా ఆయన రికార్డ్ క్రియేట్ చేశారు. హాలీవుడ్ సినిమాకు అవార్డ్ ఇచ్చే గౌరవం అందుకున్న ఏకైక హీరోగా రామ్ చరణ్ నిలవడం తెలుగు ప్రేక్షకులకు, భారతీయులకు ఇది ఎంతో గర్వకారమైన క్షణం అని చెప్పాలి.

జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో..



మారుతి శ్యాం ప్రసాద్‌రెడ్డి, డి.సురేష్‌బాబు, మాధవ్ కోదాడ

సీనియర్ బాలీవుడ్ హీరో మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తిని తెలుగు చిత్రసీమకు కథానాయకుడిగా పరిచయం చేస్తూ మాధవ్ కోదాడ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నేనెక్కడున్నా'. దర్శకుడిగా ఆయనకు కూడా తొలి చిత్రమిది. ఇందులో ఎయిర్ టెల్ ఫేమ్ సశా ఛెత్రి కథానాయిక. కె.బి.ఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు టైటిల్ వెల్లడించడంతో పాటు పోస్టర్, టీజర్‌ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ఇటువంటి కొత్త ప్రయత్నాలకు ప్రేక్షకుల ఆదరణ లభిస్తుంది. సినిమా విజయం సాధించాలని ఆశిస్తున్నా' అని తెలిపారు.

'జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో వస్తున్న థ్రిల్లర్ చిత్రమిది. ఊహించని మలుపులతో సినిమా సాగుతుంది' అని దర్శకుడు మాధవ్ కోదాడ అన్నారు. నిర్మాత మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, 'సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది. ముంబై, హైదరాబాద్, బెంగళూరులో షూటింగ్ చేశాం. ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. ప్రస్తుతం సెన్సార్ సన్నాహాల్లో ఉన్నాం. త్వరలోనే విడుదల తేదీ వివరాలు వెల్లడిస్తాం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది' అని చెప్పారు.

భావోద్వేగాల సమాహారం



కావ్యా కళ్యాణ్‌రామ్, ప్రియ దర్శి, సుధాకర్‌రెడ్డి

దిల్‌రాజు ప్రొడక్షన్స్ శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్న సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని 'యు' సర్టిఫికేట్ పొందింది. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని మార్చి 3న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ,'తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఇందులోని ప్రతి ఒక పాత్ర మిమ్మల్ని హాంట్ చేస్తుంది. సినిమాను చూసిన వారందరూ అప్రిషియేట్ చేశారు. సినిమాలో హీరో తాత పాత్రలో సుధాకర్ రెడ్డి, హీరో తండ్రిగా జయరాం, అలాగే నారాయణ పాత్రలో మురళీధర్, హీరో మేనత్త పాత్రలో విజయ లక్ష్మి హీరో తల్లి పాత్రలో స్వరూప, హీరో బాబాయ్ పాత్రలో మొగిలి ఇలా ఈ పాత్రలన్నీ మనకు గుర్తుండిపోతాయి. భీమ్స్ సంగీతంలో కాసర్ల శ్యామ్ రాసిన పాటలు హృదయాలకు హత్తుకున్నాయి. మంచి ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు భావోద్వేగాల సమాహారమే ఈ సినిమా' అని అన్నారు.

చివరి క్షణం వరకూ పోరాడే అమ్మాయి కథ



రితికా సింగ్

రితికా సింగ్ ప్రధాన పాత్రలో రూపొందిన సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'. ఇన్‌బాక్స్ పిక్చర్స్ బ్యానర్ పై అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్ష వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 3న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో థియేట్రికల్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో నాయిక రితికా సింగ్ మాట్లాడుతూ, 'ఇది చాలా సీరియస్, కంప్లీట్ రా ఫిల్మ్. చాలా భావోద్వేగానికి గురి చేసిన పాత్ర నాది. చివరి క్షణం వరకూ పోరాడే పాత్ర' అని తెలిపారు.

'అత్యాచార వార్తలను నిత్యం హెడ్‌లైన్స్‌లో చూస్తుంటాం. అయితే ఆ వార్త హెడ్‌లైన్స్‌లోకి రావడానికి ముందు ఎలాంటి పరిస్థితులు ఉంటాయి?, ఎందుకు వాళ్ళు ఇంత క్రూరంగా వ్యవహరిస్తారు?, వాళ్ళ మనస్తత్వం ఏమిటి? అనే అంశాలను ఇందులో చూపించాం' అని దర్శకుడు హర్ష వర్ధన్ చెప్పారు.

నవచిత్రం

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



మృణాళిని, సోహెల్

ఫ్యామిలీ కథా చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి. ఆయన తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్గానిక్ మామ-హైబ్రిడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో అమ్ము క్రియేషన్స్, కల్పన చిత్ర పతాకంపై కోనేరు కల్పన నిర్మిస్తున్న ఈ చిత్రంలో డా. రాజేంద్రప్రసాద్, మీనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బిగ్‌బాస్ ఫేం సోహెల్, మృణాళిని హీరో, హీరోయిన్‌లుగా నటించారు. ఈ సినిమా మార్చి 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇక ఈ మూవీలోని ఇతర ముఖ్య పాత్రల్లో దాదాపు సినీ పరిశ్రమలోని ప్రముఖ నటులు అందరూ నటిస్తుండటం ఓ విశేషమైతే, తన చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం వహించే కృష్ణారెడ్డి ఈ చిత్రానికి మాటలు కూడా రాయడం మరో విశేషం.

'పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఇప్పటి తరానికి కావాల్సిన అన్ని అంశాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు ఎస్వీకృష్ణారెడ్డి ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. ఇది ఆయనకు మంచి కమ్ బ్యాక్ సినిమా అవుతుంది. ఇక ఆయన సినిమాల్లో ఉండే మ్యాజిక్, మ్యూజిక్ ఈ సినిమాలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఓ మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది' అని నిర్మాత కోనేరు కల్పన తెలిపారు.

సునీల్, కృష్ణభగవాన్, సన, ప్రవీణ్, సప్తగిరి, అజయ్‌ఘోష్, రాజా రవీంద్ర, సురేఖ వాణి, పృథ్వీ, చలాకీ చంటి, సూర్య, రాజారవీంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సి. రాంప్రసాద్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, ఆర్ట్: శివ, పాటలు: చంద్రబోస్, రామజోగయ్య, శ్రీమణి, నిర్మాత: కోనేరు కల్పన, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, దర్శకత్వం: ఎస్వీ కృష్ణారెడ్డి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

బిజినెస్



వృద్ధి 5 శాతం లోపే..!

- జీడీపీ గణంకాలపైనే ఇన్వెస్టర్ల దృష్టి
- వచ్చే వారంలోనూ అప్రమత్తత

ముంబయి: మార్కెట్లలో వరుస నష్టాలతో ఆందోళనలో ఉన్న మదుపర్లు వచ్చే వారంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఫిబ్రవరి 27తో ప్రారంభమయ్యే వారంలో మార్కెట్లను ప్రధానంగా భారత జీడీపీ గణంకాలకు తోడు తయారీ రంగం అంచనాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ప్రభావితం చేయనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణంకాలను ఫిబ్రవరి 28న కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇది ప్రధానంగా మార్కెట్లను ప్రభావితం చేయనుంది.

ఫిబ్రవరికి సంబంధించిన మ్యానుఫ్యాక్చరింగ్ పిఎంఐ డేటాను మార్చి మూడో తేదిన ఎస్అండ్‌పి విడుదల చేయనుంది. జనవరిలో ఈ సూచీ 55.4కు తగ్గి మూడు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. డిసెంబర్‌లో ఇది 57.8గా ఉంది. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన వాహన అమ్మకాలను మార్చి1న వాహన కంపెనీలు విడుదల చేయనున్నాయి. ఈ రిపోర్టులు ఆ రంగం సూచీలను ప్రభావితం చేయనున్నాయి.

2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జీడీపీ 4.6 శాతానికి పరిమితం కావొచ్చని రాయిటర్స్ పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ఇంతక్రితం జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతం, ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో 13.5 శాతం చొప్పున జీడీపీ నమోదయ్యింది. ఈ రెండు త్రైమాసికాలతోనూ పోల్చినా గడిచిన డిసెంబర్‌లో భారీ తగ్గుదల నమోదు కానుందని అంచనాలు వెలుపడుతున్నాయి. అదే జరిగితే స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి చోటు చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుత జనవరి నుంచి మార్చితో ముగియనున్న త్రైమాసికంలో వృద్ధి మరింత తగ్గి 4.4 శాతానికి మందగించనుందని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అంచనా వేశారు. 2023-24లో సగటున 6 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జనవరి 31న ప్రభుత్వం వేసిన అంచనా 6.5 శాతంతో పోల్చితే తక్కువగానే చోటు చేసుకోనుందని భావిస్తున్నారు.

ఈ నెల 16 నుంచి బిఎస్ఇ సెన్సెక్స్ 1856 పాయింట్లు లేదా 3 శాతం విలువ కోల్పోయింది. ఈ సమయంలో మదుపర్లు రూ.8.30 లక్షల కోట్ల సంపదను పోగొట్టుకున్నారు. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.8,30,322.61 కోట్లు కోల్పోయి రూ.2,60,00,662.99 కోట్ల వద్ద ముగిసింది. దేశ ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్లలో విశ్వాసాన్ని నింపడంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు విఫలమయ్యాయని నిపుణులు విమర్శిస్తున్నారు.

అదాని షేర్లపై నీలినీడలు..!

హిండెన్ బర్గ్ దెబ్బతో భారీగా పడిపోయిన అదాని గ్రూపు కంపెనీల షేర్లపై నీలినీడలు కొనసాగుతూనే ఉన్నాయి. వచ్చే వారంలోనూ ఈ స్టాక్స్ పట్ల మదుపర్లు అప్రమత్తంగా వ్యవహారించే అవకాశం ఉంది. 2023 జనవరి 24న హిండెన్‌బర్గ్ రిపోర్టు వెల్లడయినప్పటి నుంచి అదాని గ్రూపు మార్కెట్ కాపిటలైజేషన్ రోజుకు సగటున రూ.52,343 కోట్లు పతనమవుతూ వచ్చింది. కేవలం నెల రోజుల్లో అదానీ గ్రూపు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ 63 శాతం పతనమయ్యింది. కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతం అదాని మూడో స్థానం నుంచి 29వ స్థానానికి దిగజారారు.

పీఎస్‌బీలపై ప్రభావం..

హిండెన్ బర్గ్ రిపోర్ట్ అదాని గ్రూపు కంపెనీలపైనే కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల షేర్లపైన తీవ్ర ప్రభావం చూపింది. అదానికి అప్పులిచ్చిన పలు బ్యాంక్‌ల సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే గడిచిన నెల రోజుల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 18 శాతం కోల్పోయింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 17.1 శాతం, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 17 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 16.3 శాతం, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ 15.6 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. తక్కువ ధర పలుకుతున్న ఈ సూచీలకు వచ్చే వారం మద్దతు లభించే అవకాశం ఉంది.

పేటియంలో ఆంట్ గ్రూప్ వాటా విక్రయం..!



న్యూఢిల్లీ: జాక్‌మాకు చెందిన ఫిన్‌టెక్ సంస్థ ఆంట్ గ్రూప్ పేటియ ంలో వాటాలను విక్రయించనుందని రిపోర్టులు వస్తున్నాయి. షేర్ల బైబ్యాక్ తో పేటియంలో ఆంట్ గ్రూప్ వాటా పెరిగింది. ఇలా పెరిగిన వాటాలను విక్రయించాలని ఆంట్ గ్రూప్ భావిస్తుందని తెలుస్తోంది. షేర్ ధర, రెగ్యులేటరీ సంస్థల అనుమతులను బట్టి ఎంత వాటా విక్రయించాలన్న విషయమై రెండు సంస్థలు ఓ నిర్ణయానికి వస్తాయని సమాచారం. దీనిపై ఇరు సంస్థలు స్పందించలేదు. ఆంట్ గ్రూపు వాటాల అమ్మకాలు జరిగితే ఇప్పటికే గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న పేటియం షేర్ల పరపతి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

ఢిల్లీలో ఇవి క్యాబ్‌లపై ఉబెర్ ఆందోళన

న్యూఢిల్లీ: కేవలం విద్యుత్ వాహన క్యాబ్‌లకు మాత్రమే అనుమతించనున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం చేసిన ప్రకటనపై ఉబెర్ ఆందోళన వ్యక్తం చేసింది. దీని వల్ల నగరంలో లక్ష మందికి పైగా డ్రైవర్ల జీవితంపై ప్రతికూల ప్రభావం పడనుందని పేర్కొంది. ఇది పూర్తిగా క్యాబ్ సర్వీసుల రంగాన్ని మూసివేసేలా ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయం ఉందని తెలిపింది. ఉబర్, ఓలా వంటి రైడ్ హైలింగ్ కంపెనీలు వాడే వాహనాల నియంత్రణకు కొత్త పాలసీ తేనున్నట్లు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇవిలను మాత్రమే టాక్సీలుగా వాడాలనే నిర్ణయం అమలు సాధ్యం కాదని పేర్కొంది.

రాష్ట్రంలో జెకె టైర్ అవుట్‌లెట్ల విస్తరణ



హైదరాబాద్ : ప్రముఖ టైర్ల ఉత్పత్తుల కంపెనీ జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తెలం గాణలో తమ మూడవ బ్రాండ్ షాప్‌ను ప్రారంభించినట్టు ప్రక టించింది. హైదరాబాద్ - ముంబయి హైవే వద్ద దాదాపు 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌ను ఆ కంపెనీ మొబిలిటీ సొల్యూషన్స్ అండ్ ఫ్లీట్ మేనేజ్‌మెంట్ హెడ్ సంజీవ్ శర్మ లాంచనంగా ప్రారంభించారని పేర్కొంది. దీంతో దక్షిణాదిలో 32 ఔట్‌లెట్లకు, దేశంలో 77కు విస్తరించినట్లయ్యిందని ఆ కంపెనీ తెలిపింది.

హైసెన్స్ నుంచి కొత్త స్మార్ట్ ఏసీలు

న్యూఢిల్లీ: విప్లవాత్మక ఫీచర్ల తో భావితరపు కొత్త స్మార్ట్ ఏసీల ను విడుదల చేసినట్టు హైసెన్స్ ఇండియా తెలిపింది. ఇంటెల్లిప్రో, కూలింగ్ ఎక్స్‌పెర్ట్‌ను పేరుతో రెండు వేరియంట్లను ఆవిష్కరించి నట్లు పేర్కొంది. 4డీ స్వింగ్‌తో గుగూల్ అసిస్టెంట్ సహాయంతో ఇంటెల్లి ప్రో వై-ఫై స్మార్ట్ నియం త్రించడుతుందని తెలిపింది. ఈ రెండు ఏసీలు, 5 ఇన్ 1 కన్వర్టబల్ ప్రో ఫీచర్లు కలిగి ఉన్నాయని వెల్లడించింది. ఇవి రూ.31వేల ప్రారంభ ధరతో లభిస్తాయని తెలిపింది.

బీహార్‌లో సార్వత్రిక ఎన్నికల వేడి

ప్రచారాన్ని ప్రారంభించిన మహాకూటమి

- బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాల ఐక్యతకు పిలుపు
- ర్యాలీలో పాల్గొన్న నితీశ్, తేజస్వీ, మాంఝీ, దీపాంకర్
- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసంగించిన లాలూ





పాట్నా : బీహార్‌లో 2024 సార్వత్రిక ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. బీజేపీ ఓటమే ధ్యేయంగా రాష్ట్రంలోని అధికార మహాకూటమి అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా శనివారం ప్రచార పర్వాన్ని ప్రారంభించింది. బీహార్ సీఎం నితీశ్ కుమార్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి మాంఝీ, సీపీఐ-ఎంఎల్ పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్, సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అజయ్ కుమార్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యం కావాలని మహాకూటమి పిలుపునిచ్చింది. ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉన్న వెనుకబడిన ప్రాంతం సీమాంచల్‌లోని పూర్నియాలో నిర్వహించిన సంయుక్త ర్యాలీలో మహాకూటమి అగ్రనేతలు పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడటంలో భాగంగా బీజేపీని ఓడించేందుకు ప్రజలు తమకు మద్దతు పలకాలని మహా కూటమి అగ్రనాయకత్వం కోరింది. గతేడాది ఆగస్టులో బీజేపీతో నితీశ్ తెగదెంపులు చేసుకొని మహాకూటమితో చేతులు కలిపి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మహాకూటమి మొదటి సంయుక్త ర్యాలీ ఇదే కావడం గమనార్హం.

మనం ఐక్యతతో బీజేపీ ఓటమి తథ్యం : లాలూ

దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడంలో భాగంగా బీజేపీని ఓడించేందుకు మా ఐక్యత తప్పనిసరి అని లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. మనమంతా ఐక్యంగా ఉంటే బీజేపీని తుడిచిపెట్టేయ్యచ్చని తెలిపారు. ప్రధాని మోడీ ఆరెస్సెస్ ఆదేశాలను పాటించడం తప్పితే ఏమీ చేయడం లేదని అన్నారు. వారు (బీజేజీ, ఆరెస్సెస్) మైనారిటీలను కించపరిచే ప్రయత్నం చేస్తున్నారనీ, రిజర్వేషన్లకు ముగింపు పలకాలని చూస్తున్నారని చెప్పారు. గతేడాదే విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ తర్వాత కోలుకుంటున్న లాలూ ఈ కార్యక్రమంలో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసంగించారు.

కాంగ్రెస్ చొరవ తీసుకోవాలి : నీతీశ్

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి, బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాల బలమైన ఐక్యతను తాను కోరుకుంటున్నానని నితీశ్ కుమార్ ఈ ర్యాలీలో పునరు ద్ఘాటించారు. ఈ దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం త్వరగా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అనుకుంటే వచ్చే ఏడాది ప్రభుత్వ మార్పు జరుగుతుందనీ, ఇందుకు ప్రతిపక్షాలూ చేతులు కల్పడానికి ఆసక్తిగా ఉన్నాయని నితీశ్ అన్నారు. దీనిపై కాంగ్రెస్ నిర్ణయం కోసం తాము ఎదురు చూస్తున్నామని చెప్పారు. సీమాంచల్‌లో బీజేపీ 'బీ టీమ్' పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంఐఎం పార్టీపై ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

మత శక్తులపై ఐక్యంగా పోరాడుతా : తేజస్వీ యాదవ్

మతశక్తుల ముందు ఎన్నడూ తలవంచని తన తండ్రి లాగే తానూ ఉంటానని తేజస్వీ యాదవ్ అన్నారు. మతతత్వ శక్తులను ఓడించడానికి మహాకూటమిలోని మిత్రపక్షాలతో కలిసి ఐక్యంగా పోరాడుతానని చెప్పారు. మహాకూటమిలో ఉన్న హిందూస్తాన్ ఆవామీ మోర్చా అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జీతన్‌రామ్ మాంఝీ.. లాలూకు తన మద్దతును తెలిపారు.

ఆరెస్సెస్, బీజేపీలు రిజర్వేషన్‌లకు ముగింపు పలకాలనుకుంటున్నాయని మాంఝీ చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అజయ్ కుమార్ దాడి చేశారు. బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాల ఐక్యత గురించి నొక్కి చెప్పారు. మోడీ, ఆయన గుజరాత్ మోడల్ 2022 గుజరాత్ అల్లర్లకు ప్రతీక అని దీపాంకర్ భట్టాచార్య ప్రజలకు గుర్తు చేశారు.

తెలుగు వర్సిటీలో ఎన్టీఆర్ శతజయంతోత్సవాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఈ ఏడాది నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శతజయంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, లలిత కళలు, జానపద విజ్ఞానం మొదలగు అంశాలతో విద్యాత్మక, కళాత్మక లక్ష్యాలతో విశ్వవ్యాప్త వికాసానికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ 1985 సంవత్సరం లో రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా డిసెంబర్ 6న తెలుగు విశ్వ విద్యాలయానికి అంకురార్పణ చేశారు. అనంతరం 1996లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంగా మారి తెలుగు భాష, సాహిత్య, చరిత్ర, లలిత కళల విద్యావిషయక కోర్సులను బోధిస్తూ, పరిశోధన, ప్రచురణ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ, అరుదైన విజ్ఞాన ప్రాంగణంగా భాసిల్లుతూ దేశంలోనే సాంస్కృతిక విశ్వ విద్యాలయంగా ప్రత్యేకతను చాటుకుంటు న్నది. గతంలోని సంగీత, నాటక, సాహిత్య, లలితకళా అకాడమీలను రద్దుపరచి తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేసి తద్వారా ఎందరో ప్రతిభామూర్తులను కళారంగానికి పరిచయం చేయాలనే సంకల్పానికి శ్రీకారం చుట్టిన మహానటుడు ఎన్టీఆర్. ఆయన ఆశ యసిద్ధి దిశగా తెలుగువర్శిటీ పయనిస్తున్నది.

ఈ ఏడాది ఆయన శతజయంతి సందర్భంగా వారిపట్ల తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న గౌరవంతో వారి ఆ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య టి కిషన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 10న తెలుగువర్సిటీ వరంగల్‌లోని జానపద, గిరిజన అధ్యయన పీఠం, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ (ఫాజిల్స్) సంయుక్త ఆధ్వర్యంలో 'జానపద గిరిజన అధ్యయనం సమస్యలు పరిష్కారాలు' అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సులో పాల్గొని, పత్ర సమర్పణ చేసేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న తెలుగు పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'తెలుగు భాష సాహిత్య ఔన్నత్యం స్థితిగతులు-తెలుగు మాధ్యమాల ఆవశ్యకత' అనే అంశంపై ఉభయ రాష్ట్రాల భాషావేత్తలతో సదస్సును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని లలితకళాక్షేత్రంలోని లలితకళా పీఠంలో 1985 నుంచి వివిధ కోర్సుల్లో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులతోపాటు ప్రస్తుత విద్యార్థులను కలిపి సాహిత్యం, సంగీతం, నృత్యం, జానపదం, చిత్రలేఖనం, శిల్పం తదితర అంశాల్లో పోటీలను నిర్వహిస్తా మని తెలిపారు. విజేతలకు నగదు పురస్కారా లను అందజేస్తామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలుగు విశ్వవిద్యాలయాన్ని మరింత విస్తరింపజేస్తూ నగర శివారులోని బాచుపల్లిలో వందెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అధునాతన భవన సముదాయంలోనికి త్వర లోనే మారబోతున్నామని వివరించారు.

ఆమ్నెస్టీ భారత్‌కు ఊరట

- బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయాలన్న ఈడీ నోటీసు రద్దు
- కర్నాటక హైకోర్టు ఆదేశాలు

బెంగళూరు : ప్రముఖ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాకు ఊరట లభించింది. సదరు సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసుకు కర్నాటక హైకోర్టు బ్రేకులు వేసింది. ఆ నోటీసును రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. విదేశీ మారకపు నిర్వహణ, ఐటీ చట్టాల కింద 2018లో ఈడీ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈడీ పంపిన నోటీసును సవాలు చేస్తూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా, ఇండియన్స్ ఫర్ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ట్రస్టు కర్నాటక హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై కర్నాటక హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సదరు నోటీసును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నోటీసు కేవలం 60 రోజుల మాత్రమే చెల్లుబాటు అవుతుందని ధర్మాసనం తెలిపింది. కోర్టు తీర్పుతో ఈడీకి చుక్కెదురైంది. ఈడీ ఆమ్నెస్టీ ఇండియా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతో ఆమ్నెస్టీ ఇండియా కార్యాలయాలు 2020లో మూతపడిన విషయం తెలిసిందే. నిరాధార, ప్రేరేపిత ఆరోపణలను ఆధారంగా చేసుకొని భారత ప్రభుత్వం మానవ హక్కుల సంస్థపై ఎడతెగని వేట చేస్తున్నదని ఆ సమయంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా ఆరోపించింది.

జీపీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.మధు
- రంగారెడ్డి జిల్లా కందుకూర్‌లో కొనసాగిన పాదయాత్ర



నవతెలంగాణ-కందుకూరు

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర శనివారం రంగారెడ్డి జిల్లాలో కొనసాగింది. ఉదయం ఇబ్రహీం పట్నం మండలం ఎలిమినేడులో మొదలై కందు కూరు మండలం నుంచి మహేశ్వరం మండ లం తుమ్మలూరు గ్రామానికి చేరుకుంది. కందు కూరు మండలంలోని మాదాపూర్, తిమ్మాపూర్, రాచులూరు గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 51ని సవరించి, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.15600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ. 19500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచకపోవడం సరైనది కాదన్నారు. పంచాయతీ కార్మికుల వల్లే పల్లె ప్రగతి కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ కల్పించాల న్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు దళితబంధు పథకం అమలు చేయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్, మండల కన్వీనర్ బుట్టి బాలరాజు, సీపీఐ(ఎం) కార్యదర్శి బి.శ్రీనివాస్ ఏ.కుమార్ పి.జంగయ్య పాల్గొన్నారు.

త్రిపురకు తొలిసారిగా 60 మంది కౌంటింగ్ అబ్జర్వర్లు

- ఒక్కో నియోజకవర్గానికి ఒకరు
- నియమించిన ఎన్నికల సంఘం

అగర్తల : ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగించుకున్న ఈశాన్య రాష్ట్రం త్రిపురకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం తొలిసారిగా 60 మంది లెక్కింపు పరిశీలకులను (కౌంటింగ్ అబ్జర్వర్లు) నియమించింది. మొత్తం 60 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఒక్కొక్క నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ నియామకాన్ని జరిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు లెక్కింపు పరిశీలకులను నియమించినట్టు త్రిపుర రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎస్. బందోపాధ్యాయ తెలిపారు.

ఓట్ల లెక్కింపు పరిశీలకులు మంగళవారం (ఈనెల 28) నాటికి త్రిపుర చేరుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె.కె సిన్హా, సీఈఓ గిట్టె కిరణ్ కుమార్ దినకర్‌రావు, డీజీపీ అమితాబ్ రంజన్ లు ఇప్పటికే మొత్తం ఎనిమిది జిల్లాలలో పర్యటించి భద్రతా చర్యలకు సంబంధించి అన్ని జిల్లాల మేజిస్ట్రేటులు, ఎస్పీలతో సమావేశాలు నిర్వహించారని బందోపాధ్యాయ తెలిపారు. పటిష్ట భద్రత నడుమ మొత్తం 21 కౌంటింగ్ హాల్‌లలో మార్చి 2న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్నదని అన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 16న త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మార్చి 2న జరిగి అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

ఉస్మానియా ఆస్పత్రిని కొత్త సచివాలయానికి మార్చాలి

- సీఎం కేసీఆర్‌కు హెచ్ఆర్‌డీఏ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రోగులకు మేలు కలిగేలా ఉస్మానియా ఆస్పత్రిని కొత్త సచివాలయానికి తాత్కాలికంగా మార్చాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హెచ్ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ కె.మహేష్ కుమార్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఉస్మానియాకు కొత్త భవన నిర్మాణంతో పాటు పాతభవనాలను ఏమి చేయాలనే అంశాలపై నిర్ణయం తీసుకునేంత వరకు కొత్త సచివాలయాన్ని ఉపయోగించుకునేలా కేటాయించాలని కోరారు. ప్రస్తుతం తాత్కాలికంగా నిర్మించిన షెడ్లలో రోగులకు చికిత్స అందిస్తున్నారనీ, అన్ని వార్డులను కలిపివేయడంతో ఇరుకుగా, అసౌకర్యంగా ఉందని తెలిపారు. అక్కడి వాతావరణం రోగులకు, సిబ్బందికి ఇబ్బందికరంగా, అసౌకర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి పాత, కొత్త భవనాల విషయంలో నిర్ణయం తీసుకోవడంలో వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పాత భవనాలను పాలన విభాగం కోసం వాడుకోవచ్చని సూచించారు.

పీజీల సమస్యలు పరిష్కరించాలి

- ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ డీన్‌కు హెచ్ఆర్‌డీఏ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఆర్‌డీఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ కె.మహేష్ కుమార్ ఆ కళాశాల డీన్‌కు శనివారం లేఖ రాశారు. ఐదు నెలల నుంచి ఉపకారవేతం పెండింగ్‌లో ఉందనీ, అడ్మిషన్ ఆర్డర్ ఇవ్వలేదనీ, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తీసుకుంటున్న దాని కన్నా చాలా ఎక్కువగా ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.2.5 లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. హాస్టల్ వసతి కల్పించడం లేదనీ, ఎవరైనా పీజీ వసతి కోరితే, ఒక గదిలో ఇద్దరు ఉండేలా నెలకు రూ.15,000 వసూలు చేస్తున్నారనీ, ఇది పేద విద్యార్థులకు భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు గుర్తింపు కార్డులివ్వలేదనీ, పీజీ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు గ్రంథాలయం, వర్క్‌షాప్స్, అకడమిక్ యాక్టివిటీస్, ఆరోగ్య సదుపాయాలు అందడం లేదని తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌కే సైబర్ నేరగాళ్ల టోకరా

రూ. 2,24,967 లక్షలు మాయం

- బాధితుడు పరకాల ఎస్బీఐ అసిస్టెంట్ మేనేజర్

నవతెలంగాణ-పరకాల

సైబర్ నేరగాళ్లు.. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కే వల విసిరారు. బ్యాంకు ఖాతాదారులను అప్రమత్తం చేయాల్సిన అధికారి నేరగాళ్ల మాయలో పడి అకౌంట్ ఖాళీ చేసుకున్నారు. ఖాతా నుంచి రూ.2,24,967 మాయమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని పరకాల ఎస్‌బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్‌గా సకల్ దేవ్ సింగ్ పని చేస్తున్నాడు. రెండ్రోజుల కిందట ఆయన మొబైల్‌కు 'మీ ఖాతా డీ యాక్టివేట్ అవుతుంది. పాన్ కార్డు అప్‌డేట్ చేయండి' అని మెసేజ్ వచ్చింది. ఆయన శుక్రవారం ఉదయం ఆ మెసేజ్‌ను క్లిక్ చేసి అప్‌డేట్ చేసేందుకు ప్రయత్నించగా సక్సెస్ కాలేదు. అనంతరం మరో నంబర్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. తాను చెప్పినట్టు చేయాలని అవతలి వ్యక్తి సూచించగా.. బస్సులో ఉన్నాను తర్వాత చేస్తానని సకల్ దేవ్‌సింగ్ చెప్పారు.

బ్యాంకుకు వెళ్లిన తర్వాత ఆయనే తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేశారు. అవతలి వ్యక్తి పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని సూచించగా కావడం లేదని చెప్పారు. ఆ వెంటనే వాట్సాప్‌కు ఒక లింక్ పంపానని, దాన్ని ఓపెన్ చేయాలని ఆ వ్యక్తి చెప్పాడు. ఈ మేరకు వేరే నంబరు నుంచి లింక్ పంపించగా దాన్ని మేనేజర్ ఓపెన్ చేశారు. దీంతో ఆయన ఖాతాలోంచి రూ.2,24,967 కట్ అయ్యాయి. దీంతో శుక్రవారం రాత్రి పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరం కింద పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ- హన్మకొండ

పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా హన్మకొండ సౌత్ మండల కార్యదర్శి సాంబరాజు శ్వేతా డిమాండ్ చేశారు. శనివారం అదాలత్ సెంటర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షులు బుడిద రాధ, కార్యదర్శి శ్వేతాలు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థిని డాక్టర్ ప్రీతికి న్యాయం చేయాలని, సైఫ్‌తోపాటు కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలన్నారు. డాక్టర్ ప్రీతి కాకతీయ మెడికల్ కాలేజీలో జాయిన్ అయిన మొదటి రోజు నుండే సీనియర్ విద్యార్థి సైఫ్ ఖాన్ వేధింపులు మొదలయ్యాయని చెప్పారు. రోజురోజుకూ వేధింపులు ఎక్కువవడంతో ప్రిన్సిపాల్ మధుసూదన్, హెచ్ఓడీ నాగార్జున రెడ్డికి ప్రీతి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించడం వల్లే ఆమె ప్రాణాల మీదకు వచ్చిందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే మేమున్నాం కదా మీరెందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని అక్కడున్న హెచ్ఓడీ ప్రీతిని మందలించారన్నారు.

కాలేజ్ మేనేజ్‌మెంట్‌తోపాటు సైఫ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రీతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నా, ప్రత్యేకంగా షీ టీమ్స్ ఉన్నా మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఈ ఘటనతో మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సుకర్ణ, విజయ, రాణి, ప్రేమలత, స్రవంతి, కవిత, సుజాత, లక్ష్మీ, యశోద పాల్గొన్నారు.

సీపీఐ నుంచి పాండురంగాచారి తొలగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఉన్న రాయబండి పాండురంగాచారి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందు వల్ల అతన్ని పార్టీ నుంచి తొలగించాలని నిర్ణయించామని సీపీఐ రాష్ట్ర ఆఫీసు కార్యదర్శి గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గెస్ట్ లెక్చరర్లకు 12 నెలల వేతనమివ్వాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి ఈ విద్యాసంవత్సరం నుంచే కన్సాలిడేట్‌గా 12 నెలల వేతనమివ్వాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీరియెడ్ విధానం తమకు గుదిబండలా మారిందని తెలిపారు.

అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం త్వరగా జీవో విడుదల చేయాలంటూ విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు విజ్ఞప్తి చేశారు. గెస్ట్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలకు బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. బదిలీల ద్వారా డిస్టర్బ్ అయిన వారిని మరోచోట సర్దుబాటు చేయాలంటూ ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్‌కు సూచించారు.

రేపటి నుంచి వెబ్‌సైట్‌లో ఏఈ అభ్యర్థుల హాల్‌టికెట్లు : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు వచ్చేనెల ఐదో తేదీన రాతపరీక్షను నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి ఆయా పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టికెట్లు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 833 పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.